ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com   WWW.VAARTHA.COM
విజయవాడ   fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-4-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 65 పేజీలు: 10+4 వెల: 6.50

ట్రంప్ నిర్ణయాలపై అమెరికాలో నిరసనలు 5లో

ఆమరణ నిరాహారదీక్ష విరమించిన జగ్జీత్‌సింగ్ దల్లేవాల్



# మహిళల రక్షణకోసమే 'శక్తి' యాప్

## ఆడబిడ్డల జోలికొస్తే తాటతీస్తా: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఏప్రిల్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలకు బాధ్యులపై కఠినంగా స్పందిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని,ఎట్టి పరిస్దితుల్లో నేరస్తులను వదిలిపెట్టేది లేదన్నారు. ఈ కేసుల్లో నేరస్తులు ఎవ్వరు తప్పించుకోలేరన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవ్వరినీ ఉపేక్షించమని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే తాటతీస్తామని, మహిళల రక్షణకోసమే శక్తి యాప్ తెచ్చామని చెప్పారు. ఈ యాప్ గురించి విస్తృత ప్రచారం జరగాల్సి వుందన్నారు. అదే విధంగా విద్యాసంస్థల్లో విద్యార్ధినిలకు యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రజలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు తలెత్తాయని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో సిఎం చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. ప్రజలు భయం లేకుండా సంతోషంగా ఉండాలంటే లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని అన్నారు.

ప్రేమ పేరుతో అమ్మాయిలను ట్రాప్ చేసేవారి తాట తీస్తాం. గత టిడిపి ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దాచేపల్లిలో చిన్నారిపై అత్యాచారం జరిగింది. 18 టాస్క్ ఫోర్స్‌లు నియమించి ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్కడ మోహరించాను. ప్రభుత్వం శిక్షిస్తుందనే భయంతో నిందితుడు ఉరేసుకుని చనిపోయాడు. ఆడబిడ్డల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని ఆనాడు విజయవాడలో ర్యాలీ నిర్వహించాం. మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చాం. ఆడబిడ్డలపై అత్యాచారాలకు ఒడిగడితే అదే వారికి చివరిరోజు. అత్యవసర పరిస్థితులు లేక ఆపదలో చిక్కుకున్నప్పుడు మహిళలు శక్తి యాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు... నిమిషాల వ్యవధిలో పోలీసులు వచ్చి రక్షిస్తారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ అని ప్రచారం చేశారు. ఏమైంది.. దిక్కుమాలిన యాప్‌గా మిగిలింది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులదే. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా లేకపోతే పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. బాధ్యతకలిగిన ప్రతిపక్షంగా దీనిపై తెలుగుదేశం పార్టీ ఆందోళన చేస్తే తిరిగి మా కార్యలయంపైనే దాడులు చేశారు. ఏ రాజకీయ పార్టీకైనా పార్టీ కార్యాలయమంటే దేవాలయం. గతంలో ఎక్కడా పార్టీ ఆఫీస్‌లపై దాడులు జరిగిన ఘటనలు నా 45ఏళ్ల రాజకీయ జీవితంలో నేను చూడలేదు. రాజకీయ కక్ష >>2



# సంతకాలనయినా తమిళంలో చేయండి

## తమిళనాడుకు ఏడాదిలోనే రూ.600 కోట్లు ఇచ్చాం

### అయినా కొందరునాయకులకు ఇంకా నిరాశే..

### పంబన్ బ్రిడ్జి ప్రారంభోత్సవ సభలో ప్రధాని మోడీ

**రామేశ్వరం, ఏప్రిల్ 6:** తమిళనాడు రాష్ట్రానికి కేంద్రం నిధులు పెంచినప్పటికీ కొందరు నిరాశ వ్యక్తంచేస్తున్నారని ప్రధానిమోడీ చురకలువేసారు. రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకోసం గతంలోకంటే ఏడురెట్లు నిధులు పెంచామన్నారు. 2014వరకూ రైల్వేప్రాజెక్టులకోసం రూ.900 కోట్లు కేటాయిస్తే ఎన్డీయే ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.600 కోట్లు కేటాయించిందన్నారు. రామేశ్వరంలోని పంబన్ వంతెన ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ డిఎంకె ప్రభుత్వంపై చురకలు వేసారు. వైద్యవిద్యను తమిళభాషలో అందించాలని తద్వారా పేదలకు ప్రయోజనం చేకూరుతుందని రాష్ట్రప్రభుత్వానికి ప్రధాని మోడీ సూచించారు. తమిళభాష సంస్కృతిని ప్రపంచం నలుమూలలా విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కొందరునేతలు సంతకాలను తమిళంలో చేయక పోవడంపట్ల ప్రధాని ఆశ్చర్యం వ్యక్తంచేసారు. కనీసం సంతకాలనైనా తమిళంలోచేయాలని విజ్ఞప్తిచేసారు.

21వ శతాబ్దంలోనిర్మించిన ఇంజనీరింగ్ అద్భుతం పంబన్ వంతెన అని మోడీ అన్నారు. ఈ వంతెన ఆధునికీకరణ డిమాండ్ దశాబ్దాలనుంచి ఉందన్నారు. ప్రజలకు రవాణాపరంగానేకాకుండా ఉపాధి ఆదాయ వృద్ధికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మా ప్రభుత్వం >>2



## ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమశాస్త్ర బద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేశారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు వేద పండితులు ఆహ్వానించారు. అన్నముందు గ్రామోత్సవానికి >>2

## కృష్ణానదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతి

**విజయవాడ ఏప్రిల్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ మండల మోదుమూడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరామ నవమి సందర్భంగా కృష్ణానదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలురు మృతిచెందారు. ఆదివారం ఉయదం మత్తి వెంకట గోపి కిరణ్(15), ఎం.వీరబాబు(15) ఎం.వర్ధన్(16) స్నానానికి నదిలోకి దిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. డిఎస్పీ విద్యాశ్రీ ఆధ్వర్యంలో సీఐ యువ కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పట్టాలెక్కనున్న అమరావతి రైల్వేలైన్

**విజయవాడ ఏప్రిల్6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని పనుల్లోభాగంగా అమరావతి మీదుగా వెళ్లే ఎర్రుపాలెం-నంబూరు రైల్వేలైన్ నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. సిఎం చంద్రబాబు ఆదేశాలతో ఆయన కార్యాలయ అదికారులు భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కొంత భాగం భూసేకరణ కొలిక్కి రావడంతో పనులు పట్టాలెక్కించేందుకు రైల్వేశాఖ >>2

# స్టార్టప్ ఏరియాగా అమరావతి

# బిజినెస్ జిల్లా నిర్మాణం

**విజయవాడ,ఏప్రిల్6, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి స్టార్టప్ ఏరియాగా సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నిర్మాణం దిశలో ఎపి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఈ విషయంలో సింగపూర్ కన్సార్టియంతో సంప్రదింపులు ప్రభుత్వం కొనసాగిస్తోంది. సంపద సృష్టి కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దే లక్ష్యంతో గతంలో టిడిపి ప్రభుత్వం సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ప్రతిపాదన తీసుకొచ్చింది. ఆర్థిక లావాదేవీల కేంద్రంగా సిబిడి పేరిట ఓ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సైతం రూపొందించింది. దీన్ని డెవలప్‌మెంట్ చేసేందుకు సింగపూర్ కన్సార్షియం ముందుకొచ్చింది.



2018 జూన్‌లో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సింగపూర్ కన్సార్టియం మధ్య ఒప్పందం కుదిరింది. 1691 ఎకరాల్లో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దశలవారీగా ఫేజ్ జీరోపేరిట దీన్ని అభివృద్ధి చేయాలని భావించారు. దీంట్లో వివిధ అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలను ఏర్పాటు చేయించే అంశంపై సింగపూర్ కన్సార్టియం ఒప్పందం చేసుకుంది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి ఓ వాహక సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తద్వారా దేశ విదేశాలకు చెందిన సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేయించేందుకు, పెట్టుబడులను ఆకర్షించాలని రెండుసార్లు జరిగిన ఒప్పందాల్లో అంగీకారం కుదిరింది. దీనిపై సింగపూర్ ప్రతినిధులు అప్పుడు సిఎంగా ఉన్న చంద్రబాబు అత్యున్నత స్థాయిలో జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసుకుని సమీక్షించారు. సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ నిర్మాణం ఫేజ్ జీరోతో ఆరంభమైతే ఆర్థిక, వాణిజ్య లావాదేవీలు పెద్దఎత్తున జరిగితే రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు భూమి విలువ బాగా పెరుగుతుందని అంచనాలు వేశారు.

స్టార్టప్ ప్రాంతంగా కృష్ణానదీ తీర ప్రాంతంలోని 1691 ఎకరాలను సిఆర్‌డిఎ సింగపూర్ కన్సార్టియంకు అప్పగించింది. ఫేజ్ జీరో కింద 684 హెక్టార్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించాలన్నది లక్ష్యం. ఇందుకోసం సింగపూర్ కన్సార్టియం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఓ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డును సింగపూం అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ పేరిట ఏర్పాటు చేశాయి.

అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ పేరుతో ఓ జాయింట్ వెంచర్ సంస్థ ఏర్పాటు చేశారు. సింగపూర్ కన్సార్షియం అమరావతి ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ మధ్య స్టార్టప్ ఏరియాలో 58:42 శాతంగా భాగస్వామ్యం ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ రాయితీ ఒప్పందాన్ని కూడా చేసుకుంది. తొలిదశలో స్టార్టప్ ప్రాంతంలో 656 ఎకరాలు అభివృద్ధి చేయాలని భావించారు. ఇందుకు సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని సింగపూర్ కన్సార్టియంకు అభివృద్ధి ప్రాతిపదికన ఇచ్చేందుకు కూడా అంగీకారం >>2



## సిపిఎం జాతీయ కార్యదర్శిగా ఎంఎ బేబి

**మదురై, ఏప్రిల్ 6:** కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) కొత్త జాతీయ ప్రధాన కార్యదర్శిగా కేరళ మాజీ మంత్రి ఎంఎ బేబి ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో జరిగిన సిపిఎం 24వ మహాసభల్లో ఆయన్ను కొత్తసారథిగా ఎన్నుకున్నారు. గత ఏడాది సీతారాం ఏచూరి మృతి అనంతరం ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది. దీనితో పార్టీ తాత్కాలిక సమన్వయకర్తగా సీనియర్‌నేత ప్రకాశ్‌కారత్ వ్యవహరిస్తున్నారు. ఈమహాసభల్లో 85 మందిసభ్యులతో కేంద్ర కమిటీని ఎన్నుకుంది. నూతన కేంద్ర కమిటీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంఎ బేబీని 18 మందితో పొలిట్‌బ్యూరోను ఎన్నుకుంది. కేంద్ర కమిటీలో 20శాతంమంది మహిళలే ఉన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి పదవిరేసులో సీనియర్‌నేతలు ఎంఎబేబీ, అశోక్ ధవలే, మహ్మద్ సలీం, బివిరాఘు >>2



ఆదివారం బంగారం దోపిడీ కేసులో నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంత

## రెండు రోజుల్లో దారి దోపిడి కేసు ఛేధించిన పోలీసులు

### నలుగురు నిందితులు అరెస్టు

### రూ.3.20 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు స్వాధీనం

**చిత్తూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో జరిగిన ఓ దారి దోపిడి కేసును జిల్లా పోలీసులు రెండు రోజుల్లో ఛేధించి నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 3.20 కోట్ల రూపాయల విలువైన 3.5 కిలోల 5 బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు విలేకరుల సమావేశం నిర్వహించి వి.కోట మండల పరిధిలో జరిగిన దారి దోపిడి కేసు వివరాలను వెల్లడించారు. బంగారు నగల వ్యాపారీ చేతన్‌కుమార్ ఈ నెల 2వ తేదీ రాత్రి 8.45 గంటలకు వి.కోట నుండి తమిళనాడు పేర్నంబట్టుకు నాయకనేరి ఘాట్‌లో కారులో వెళ్తుండగా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చేతన్‌కుమార్‌ను బెదిరించి కారులో వున్న 3.5 కిలోల బంగారు బిస్కెట్లను దోచుకెళ్ళిపోయారు. ఈ విషయంపై బంగారు నగల షాపు యాజమాని బాధితుడు దీపక్‌కుమార్ వి.కోట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితులను పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

వి.కోట ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందం, గంగవరం రూరల్ ఇన్స్‌పెక్టర్ మురళీ మోహన్, బైరెడ్డిపల్లి ఎస్ఐ పరుశు రాముడు ఆధ్వర్యంలో ఒక బృందం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో ఒక బృందం, చిత్తూరు క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఒక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందాలు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి అందుబాటులో >>2

# కొన'సాగు'తున్న కల్తీనెయ్యి దర్యాప్తు !

## ఇప్పుడు మూలాలు కదిలిస్తున్న సిట్ అధికారులు



**తిరుమల,ఏప్రిల్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనే వ్యవహారంలో సిట్ అధికారులు తాజాగా మూలాలు కదిలిస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలోని పూర్వ టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలు కమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి సూత్రధారులను తేల్చేపనిలో వేగం పెంచారు. ఇప్పటికే కల్తీనెయ్యి సరఫరాలో తమిళనాడులోని ఏఆర్ డెయిరీ, ఉత్తరాఖండ్‌లోని బోలేబాబాడెయిరీ, నెల్లూరు జిల్లాలోని వైష్ణవీ డెయిరీలకు చెందిన ముఖ్యులను సిట్ అరెస్టుచేసి పలు దఫాలుగా కస్టడీకి తీసుకుని లోతుగా విచారణ చేసిన విషయం తెలిసిందే.

ఈ విచారణలోనే పలు కీలక అంశాలు గత రెండునెలల క్రిందటే రాబట్టారు. ఆ ఆధారాలు మరింతగా నిశితంగా పరిశీలించిన సిట్ అధికారులు నెయ్యిసరఫరాకు టిటిడిలో టెండర్ నిబంధనలు మార్పుచేసిందెవరనే దానిపై తొలి ఛార్జిషీట్‌ను దాఖలు చేయనున్నారు. వారంరోజుల్లో ఈ తతంగం ముగించి తరువాత రెండోదశ దర్యాప్తులో పలువురు సూత్రధారులకు నోటీసులు ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారు. అసలు సూత్రధారులను పట్టుకుంటేనే దేవుడికి శఠగోపం పెట్టిన కల్తీనెయ్యి కేసులో ట్విస్ట్ >>2

## ట్రంప్ సుంకాల నుంచి రొయ్యలను మినహాయించాలి

### కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు సిఎం లేఖ

**విజయవాడ. ఏప్రిల్6, ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వారంగాన్ని అండగా నిలవాలని కోరుతూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖరాసారు. ఈ సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులకు మినహాయింపు పొందేలా ప్రయత్నాలు చేసి...రైతుల ఆదుకోవాలని కేంద్రమంత్రిని కోరిన సిఎంరాష్ట్ర జిడిపిలో మత్స్య రంగం కీలకమైన భూమిక పోషిస్తుందని, ఆక్వా రైతులకు సంక్షోభ సమయంలో అండగా నిలవాలని కోరుతూ లేఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించిన అంశాలు భారతదేశం నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా దేశ ప్రభుత్వం 27 శాతం దిగుమతి సుంకం విధించింది. భారతదేశం నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా దేశ ప్రభుత్వం 27 శాతం దిగుమతి సుంకం విధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ల డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. వీటిలో రొయ్యలే 92 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

అమెరికా దేశానికి రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారతదేశంపై 27 శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతుంది. ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై కేవలం 10 శాతం పన్ను మాత్రమే అమెరికా విధిస్తోంది. ఇది మనదేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ..వారికి అనుకూలంగా మారుతోంది. దీనికి తోడు మనదేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీభారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలను కలుపు >>2



తమిళనాడు రామేశ్వరంలో రామనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రధాని మోడీ

# ట్రిబ్యునల్ విచారణకు నేనే వెళతా

## న్యాయవాదుల బృందానికి సంపూర్ణ సహకారం : తెలంగాణ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణాకు జరుగుతున్న అన్యాయంపై కృష్ణా ట్రిబ్యునల్ 2 ముందు తానే స్వయంగాహాజరవు తాని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రిఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో నీటిపారుదల శాఖాధికారులతో పాటు న్యాయవాదుల ప్రతినిధుల బృందంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణ కేటాయింపులకై న్యాయస్థానలలో రాష్ట్రంతరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల బృందానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలబడుతుందని మంత్రి స్పష్టంచేశారు.రాష్ట్ర నీటిపారుదల సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్,ఇ.ఎన్.సిలు అనిల్ కుమార్, విజయ భాస్కర్ రెడ్డి,సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్య నాథన్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఇంతకు ముందు కృష్ణా ట్రిబ్యునల్ 2 ఎదుట జరిగిన వాదనలను పూర్తిగా సమీక్షి ంచడంతో పాటు ఏప్రిల్ 15,16 తేదీలలో ట్రిబ్యునల్ ముందు లెవనెత్తాల్సిన అంశాలపై సమగ్రంగా చర్చించిముందస్తు వ్యూహాన్ని రూపొందించు కున్నారు.2014 ఎపి పునర్విభజన అనంతరం కృష్ణా జలాశయాలలో ఎపిప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి,న్యాయబద్ధంగా తెలంగాణా రావాల్సిన నీటి కేటాయింపులు వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ పూర్తి స్థాయిలోవివరించారు.అందుకు మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ న్యాయబద్దంగా తెలంగాణాకు రావాల్సిన నీటి కేటాయింపులపై బలమైన వాదనలు వినిపించేందుకు అనేక సూచనలు చేశారు.

# రక్షణకోసమే ‘శక్తి’ యాప్

>> సాధింపులకు నేను దూరంగా ఉంటాను. గత పాలకులు కనీసం గంజాయి, డ్రగ్స్ పై సమీక్ష చేయలేదు. అసెంబ్లీలో వర్ణించిన పాపాన పోలేదు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిలో మార్పు అంత తేలిగ్గా రాదు. వ్యవస్థీకృతంగా మారిన గంజాయిసాగు, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చాం. స్వార్థం కోసం గంజాయి పండించి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడకూడదు. ఎట్టి పరిస్థితుల్లో ఈ రాష్ట్రంలో గంజాయి పండించేందుకు వీల్లేదు. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం. ఎక్కడికక్కడ ఏజెన్సీలను పెట్టి రాష్ట్ర సరిహద్దుల్లోకి కూడా డ్రగ్స్ రానివ్వము. గంజాయి సాగు చేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం.తమ పిల్లలు ఎలా ఉంటున్నారో తల్లిదండ్రులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలి. సంచలనం కలిగించిన వివేకానంద హత్య ఉదంతం తలుచుకుంటే ఆందోళన కలుగుతుంది. ఆ కేసుకు సంబంధించి 6 మంది సాక్షులు చనిపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. 2019లో వివేకా హత్య జరిగింది. మొదట వివేకా గుండెపోటుతో చనిపోయినట్టు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఎన్నికల వాడావుడిలో నేను అదే నిజమనుకున్నాను. నేరస్తులు ఏ విధంగా ట్రావెల్ చేస్తారో అదే ఉదాహరణ. మధ్యాహ్నానికి బాడీ పోస్టుమార్టమ్ చేయాలని ఆయన కూతురు సునీత అడిగారు. ఆవిడ పోస్టుమార్టమ్ అడగకపోతే నిజం సమాధివ్వేది. అప్పటివరకూ గుండెపోటు అని ప్రచారం చేసిన టీవీ చానెల్ పోస్టుమార్టమ్ తర్వాత మాట మార్చింది. నారాసుర రక్త చరిత్ర అని నాపై విష ప్రచారం చేశారు. ఇలాంటి అరాచకాలు చేసే కూడా రాజకీయాలు చేశారు. గత 45 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ హత్యా రాజకీయాల మరక అంటుకోకుండా ఉన్నాను. హత్యారాజకీయాలు చేసిన వారికి ప్రజాక్షేత్రంలో శిక్ష పడేలా చేశాను. రాజకీయ ముసుగులో నేరాలు చేసి తప్పించుకుంటానంటే ఈ ప్రభుత్వంలో సాగనివ్వను. ప్రజలకు భద్రత కల్పించడం మన బాధ్యత. నియోజకవర్గాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ ఎమ్మెల్యేల బాధ్యత. పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తాం. ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే పేట్రేగుతారు. ప్రభుత్వం కఠినంగా ఉంటే అందరూ లైన్ లోకి వస్తారు.
గత పాలకులు రాజకీయ లబ్ది కోసం ఎంతకైనా దిగజారారు. సోషల్ మీడియా ముసుగులో రోత పుట్టించే రాతలు రాశారు. మహిళలపై వ్యక్తిగత దూషణలు చేశారు. ఆడబిడ్డలు తలెత్తుకుని తిరగలేని విధంగా పోస్టులు పెట్టారు. అసెంబ్లీ లోపల, బయటా బూతులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. వాట్సాప్‌లోనే చెక్ పెట్టాం. అసెంబ్లీలో బూతులకు తావులేదు. అర్థంతరమైన చర్య జరుగుతుంది. మరోవైపు తీవ్ర వాదం అరికట్టాలి. మత సామరస్యం పెంచాలి. ముఠా నాయకులు, రౌడీ అనే మాట వినపడకూడదని నేను గతంలో కూడా మెసేజ్ ఇచ్చి ఆచరణలో చేసి చూపించాను.
ల్యాండ్ గ్రాబింగ్ నిషేధం కింద కొత్త చట్టం తీసుకొస్తున్నాం. గత పాలకులు చేసిన భూ మాఫియా అంతా ఇంతా కాదు. 22 ఏ ఉపయోగించి భూ దందాలు చేశారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రభుత్వ, పేదల, ఫారెస్ట్ భూములు కొట్టేశారు. అందుకే కొత్త చట్టం తెస్తున్నాం. భూ కబ్జాలకు పాల్పడితే కొత్త చట్టం ద్వారా కఠినంగా శిక్షిస్తాం. ఇకపై ఎవరైనా భూ కబ్జా అనాలంటే భయపడాలి. నేరాలు చేసి తప్పించుకునే వారికి కాలం చెల్లింది రాత్రి సమయంలో డ్రోన్ పెట్రోలింగ్ చేస్తాము. సీసీ టీవీ కెమెరాలు పెడుతున్నాం.. 26 సైబర్ సెక్యూరిటీ స్టేషన్లు పెడుతున్నాం. నేరస్థులను వెంటనే పట్టుకుంటాం. నేను సమైక్యాంధ్రలో ప్రతి రెవెన్యూ డివిజన్ కు పోలీస్ డ్రాగ్స్ ను పెట్టి నేరాలకు అడ్డుకట్ట వేశాను.ప్రతి విద్యాసంస్థ,బస్‌స్టాప్‌లు,రైల్వేస్టేషన్ల వద్ద నిఘాలు ఎక్కువగా ఉంచాలన్నారు.



శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం చైత్ర నవరాత్రి వేడుకల్లో కన్యాపూజను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

# సిపిఎం జాతీయ కార్యదర్శిగా ఎంఎ బేబి

>> వులు, బృందాకారత్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే ఆ పార్టీలో ఒక వర్గం ఆలిండియా కిసాన్‌సభ అధ్యక్షుడైన అశోక్‌ధవలేకు మద్దతు ఇచ్చారని సమాచారం. 1954లో కేరళలోని ప్రాక్కుళంలో పిఎం అలెగ్జాండర్, లిల్లీ అలెగ్జాండర్ దంపతులకు ఎంఎ బేబీ జన్మించారు. విద్యార్థి దశనుంచే వామపక్ష రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేరికతో రాజకీయ అరంగేట్రంచేసారు. 1986నుంచి 1998 వరకూ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కేరళమంత్రిగాను సేవలందించారు. 2012నుంచి ఆయన సీపిఎం పోలిట్‌బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

**సిపిఐ(ఎం) కేంద్ర కమిటీకి ముగ్గురు సభ్యులు ఎంపిక**

ఆంధ్రప్రదేశ్ నుండి సిపిఐ(ఎం) కేంద్ర కమిటీకి ముగ్గురు సభ్యులు ఎన్నికయ్యారు. ఎపి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి రమాదేవి, కె లోకనాథంలు ఎన్నికయ్యారు. సిపిఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభ 85 మంది సభ్యుల కేంద్ర కమిటీని ఎన్నుకుంది. కొత్త కేంద్ర కమిటీ ఎంఎ బేబీని ప్రధాన కార్యదర్శిగా 18 మంది సభ్యుల పొలిట్ బ్యూరోను ఎన్నుకుంది. కేంద్ర కమిటీ సభ్యులలో 20శాతం మంది మహిళలున్నారు. 85 మంది సభ్యుల కేంద్ర కమిటీలో 30 మంది కొత్తవారు ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

# పట్టాలెక్కనున్న అమరావతి రైల్వేలైన్

>> సమాయత్తమువుతోంది. తొలుత 27కి.మీ మేర ట్రాక్‌తో పాటు కృష్ణా నదిపై వంతెన నిర్మాణానికి రెండు నెలల్లో టెండర్లు పిలిచేలా కార్యాచరణ సిద్దం చేసింది. ట్రాక్ రెండేళ్లలో పూర్తిచేసే వీలుంటుందని, వంతెన మాత్రం మూడేళ్లు పడుతుందని వారు చెబుతున్నారు. ముమ్మందు అమరావతి రైల్వేస్టేషన్ నిర్మాణానికి ప్రత్యేక టెండరు పిలవనున్నారు. రాజధాని స్టేషన్ కావడంతో దీనిపై ప్రత్యేక దృష్టి పెడతారని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. కాజీపేట-విజయవాడ లైన్‌లోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి మొదలై రాజధాని అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వద్ద విజయవాడ-గుంటూరు లైన్‌లో కలిపేలా 57 కి.మీ మేర రైల్వేలైన్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఎర్రుపాలెం నుంచి అమరావతి వరకు భూసేకరణ దాదాపు రెండు నెలల్లో పూర్తి కానుంది అందుకే తొలుత ఎర్రుపాలెం- అమరావతి మధ్య 27 కి.మీ రైల్వేలైన్, కృష్ణా నదిపై 3.2 కి.మీ వంతెన నిర్మించనున్నారు. 27 కి.మీ ఒక ప్యాకేజీతా వంతెన మరో ప్యాకేజీగా పనులు అప్పగిస్తారు. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ విధానంలో టెండర్లు పిలవనున్నారు. 27 కి.మీ మేర లైన్ నిర్మాణానికి రూ.450 కోట్లు, వంతెనకు రూ.350 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ట్రాక్ వంతెన మూడేళ్లలో నిర్మించేలా రైల్వే శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అయితే రెండేళ్లలో పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు రైల్వే శాఖను కోరారు.

# శ్రీరామ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

>> సేవకు ఉత్సవమూర్తులకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ హారతి ఇచ్చారు. ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో ఆదివారం తలంబ్రాల తయారీ శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో టిటిడి ప్రారంభించింది. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఎసి వద్దకు తీసుకొచ్చారు. బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి, తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చారు. దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. రాత్రి సీతారామ లక్ష్మణులు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

# కన్నుల పండువగా భద్రాద్రి రాముని కల్యాణం

**భద్రాచలం,ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణమహోత్సవం ఆదివారం మిథిలా స్టేడియంలో వైకుంఠాన్ని తలపించింది. ప్రత్యేకంగా అలంకరించిన శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపంలో ఒక వైపు సీతారాముల కళ్యాణం జరుగుతుండగా .. మరోవైపు భక్తుల శ్రీరామ జయ రామ .. జయ జయ రామ స్మరణలతో మారుమ్రోగింది. అభిజిత్‌లగ్నంలో శ్రీరామచంద్రమూర్తి సీతమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీతారాముల కళ్యాణ క్రతువు కొనసాగింది. శ్రీరామనవమి సంద ర్భంగా కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు స్వామి వారికి సమర్పించారు.
చైత్రశుద్ధ నవమిరోజున అభిజిత్‌లగ్నంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించడం ఆనాధిగా ఆచారంగా వస్తుంది. నవమి రోజున అభిజిత్‌లగ్నం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు సమయానికి వధూవరులైన సీతారాముల వారి ఉత్సవమూర్తుల శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపానికి తీసుకుని వచ్చిఆశీనులను చేశారు. నవాహ్నిక దీక్షను పూనిన అర్చకస్వాములు ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, యోత్రధారణ, యజ్ఞోపవీతధారణ నిర్వహించి రామయ్యకు అభిముఖంగా సీతమ్మవారిని ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా భక్తరామదాసు చేయించిన పచ్చలపతకం వరుడైన రామయ్యకు,చింతాకు పతకం వధువు సీతమ్మకు, శ్రీరామమాఢ లక్ష్మణస్వామికి అలంకరించారు. అనంతరం వధూవరుల తలలపై జిలకర్రబెల్లం ఉంచి కళ్యాణతంతు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా శ్రీరామదాసు చేయించిన మూడు సూత్రాల మాంగళ్యానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సీతమ్మవారి మెడలో కట్టడం ద్వారా కళ్యాణ వేడుకలో ముఖ్య ఘట్టం ముగిసింది.



ఆదివారం భద్రాచలంలో వైభవంగా జరిగిన సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం

**నేడు రామయ్య పట్టాభిషేకోత్సవం**

ఆదివారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఆదివారం అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం జరిగింది. కాగా సోమవారం శ్రీరామయ్య వారి పట్టాభిషేక మహోత్సవం శోభాయమానంగా జరగనుంది.

# కల్తీనెయ్యి దర్యాప్తు !

>> వీడిపోతుంది. ఆ దిశగా ఇప్పుడు ఫోకస్ చేసి గత వైసిపి ప్రభుత్వంలో, వైఎస్సార్సీ, టిటిడి పాలకమండలిలో కొందరు సభ్యులు, అధికారుల తీరుపై సిట్ కీలక సమాచారం సేకరించిందనేది తెలుస్తోంది. తిరుమలకు 2019 నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరాచేసిన అంశంలో గత టిటిడి బోర్డు పెద్దలకు, అధికారులకు నోటీసులు జారీ చేసేందుకు సిద్దమవుతున్నారు.

**నోటీసులు జారీకి రంగంసిద్ధం!:**

లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే ఆధారాలతో సమగ్ర ఆధారాలు సేకరించిన సిట్ కొందరినీ రానున్న పదిరోజుల్లో విచారణకు పిలిచే అవకాశం ఉందనేది సమాచారం. మరీ కీలకమైన సూత్రధారులను విచారణ చేసి వదిలేస్తారా? లేక కేసు నమోదు చేస్తారా అనేది తేలాల్సివుంది. కాగా గత ఎనిమిదినెలలుగా కల్తీనెయ్యి వ్యవహారం సిబిఐ సిట్ దర్యాప్తు కొనసాగిస్తూనే ఉండటం విశేషం.

# దోపిడి కేసు ఛేదించిన పోలీసులు

>> వున్న సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని నిందితుల ఆచూకీని గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు వి.కోట అర్బన్ ఇన్స్‌పెక్టర్, వారి సిబ్బంది శనివారం మధ్యాహ్నం వి.కోట మండలం రాఘవపల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వి.కోట-పలమనేరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఒక ఇన్నోవా వాహనంను నిలుపి తనిఖీలు నిర్వహిస్తే పోలీసులకు అందులో 3.5 కిలోల బంగారు బిస్కెట్లు లభ్యం అయ్యాయి. ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులో ప్రయాణిస్తున్న కర్నాటక రాష్ట్రం కెజిఎఫ్ పట్టణానికి చెందిన జయపాల్(67), కెజిఎఫ్ రాబర్ట్‌సన్‌పేట్‌కు చెందిన ఎం.ముక్రామ్(42), కెజిఎఫ్ మారికుప్పంకు చెందిన కెఆర్ బాబు(61), కెజిఎఫ్ కోరమాండల్‌కు చెందిన షణ్ముగం(59)లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జయపాల్ కెజిఎఫ్ మున్సిపాల్టీలో 4వవార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ విచారణలో తాము బంగారు నగర దోపిడికి పాల్పడిన వివరాలను ప్రధాన నిందితుడు జయపాల్ పోలీసులకు వెల్లడించాడు. దీపక్‌కుమార్ బంగారు నగల వ్యాపారి అని, ఇతన చెన్నై-కెజిఎఫ్‌కు సేటు నుండి బంగారు బిస్కెట్లు తీసుకుని వస్తుండగా తాము దోపిడికి పాల్పడినట్లు పేర్కొన్నాడు. సేటు దగ్గర డ్రైవర్‌గా పని చేసే ముక్రమ్ సేటు వస్తున్న విషయంను జమిల్ అనే వ్యక్తికి ఇవ్వడం జరిగిందని, జమిల్ తనకు పరిచయం వుండటంతో ఇద్దరు కలిసి ఈ దోపిడికి పక్కాగా స్కెచ్ వేయడం జరిగిందన్నాడు. తాను తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టుకు చెందిన మరో 12 మందితో కలిసి దీపక్‌కుమార్ వెళ్తున్న మార్గంను గుర్తించి, దారి దోపిడికి పాల్పడి బంగారు బిస్కెట్లను దోచుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి 3.5 కిలోల బంగారు బిస్కెట్లను, ఒక ఇన్నోవా వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ దారి దోపిడికి సహకారం అందించిన మరో 9 మంది నిందితులను సైతం త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దారి దోపిడి కేసును రెండు రోజుల్లో ఛేధించిన వి.కోట పోలీసులను, విచారణలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికేట్లను అందజేశారు. ఈవిలేకరుల సమావేశంలో పలమనేరు డిఎస్పీ దేగల ప్రభాకర్, వి.కోట ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్‌రెడ్డి, గంగవరం రూరల్ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, బైరెడ్డిపల్లి ఎస్ఐ పరశురాముడు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్, క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంతకాలనయినా తమిళంలో చేయండి

>> దేశానికే గర్వకారణంగా నిలిచే మూడు వంతెనలు నిర్వహించింది. ముండయిలో సముద్రవంతెన, జమ్ముకాశ్మీర్‌లో చీనాబ్ వంతెన, పాంబన్ వంతెనలు అద్భుతమైనవని అన్నారు.ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనను చీనాబ్‌నదిపై నిర్మించామని, దేశంలో అత్యంత పొడవైన సముద్రపు వంతెనను ముంబయిలోను, దక్షిణాదిలో రామేశ్వరం వద్ద వర్టికల్‌రైల్వే వంతెనను నిర్మించామన్నారు. భారత రత్న అబ్దుల్‌కలాం పుట్టిన గడ్డ రామేశ్వరం. టెక్నాలజీ, ఆధ్యాత్మికత కలగలిసిన పుణ్యభూమి అని మోడీ అన్నారు. గత పదేళ్లలో భారత ఆర్థికవ్యవస్థ ఎంతో పురోగతి సాధించిందన్నారు.

**పంబన్ వంతెనను జాతికి అంకితంచేసిన ప్రధానిమోడీ**

దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన పంబన్ వంతెనను ప్రధానిమోడీ ఆదివారం జాతికి అంకితంచేసారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెనగా పంబన్ వంతెన నిలిచింది. సముద్రంలో 2.08 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వంతెన దిగువన ఓడల రాకపోకలకు వీలుగా కీలకమైన వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. తమిళనాడులోని రామనాథపురంజిల్లాలో రూ.535 కోట్లతో నిర్మించారు. 2019 మార్చి 1న ప్రధానిమోడీ శంకుస్థాపనచేసిన ప్రాజెక్టు 2020లో రైల్ వికాస్ నిగమ్‌సంస్థ పనులుచేపట్టి నాలుగేళ్లలోపూర్తిచేసింది. ఈక్రమంలోనే రామేశ్వరం తాంబరంప్రత్యేకరైలును ప్రధానిమోడీప్రారంభించారు. కొత్త వంతెనమీదుగా పరుగులుతీసింది. రైలులో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు సందడిచేసారు. అలాగే వంతెన కిందుగా ప్రయాణించిన కోస్ట్‌గార్డ్ నౌకకూ పచ్చజెండా ఊపారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్‌రవి, తమిళనాడు ఆర్థికమంత్రి తంగం తెన్నరసు తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ప్రధానిమోడీ 8300కోట్ల విలువైన హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలుచేసారు. రామేశ్వరం ఆలయాన్ని సందర్శించి జ్యోతిర్లింగాలవద్దప్రత్యేక పూజలునిర్వహించారు.

# ట్రంప్ సుంకాల నుంచి రొయ్యలను మినహాయించాలి

>> కుంటే ఈక్వెడార్‌కు భారతదేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20 శాతం ఉంటుంది.అమెరికా విధించిన కొత్త సుంకం ఏప్రిల్ 5, 2025 నుండి అమల్లోకి వచ్చింది.దీని కారణంగా అమెరికా దేశానికి వెళ్లే అన్ని ఎగుమతులపైనా ఈ భారం పడుతోందిగతంలో వచ్చిన ఆర్డర్‌లకు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి, కోల్డ్ స్టోరేజ్‌లు, పోర్టులలో ఉన్నాయి. కొత్త నిబంధనల వల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారం పడుతుంది యూరోపియన్ యూనియన్‌లో భారతీయ ఎగుమతిదారులు 50 శాతం తనిఖీ రేట్లు, 4 - 7 శాతం దిగుమతి సుంకంతో సహా నాన్‌టారిఫ్ అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నాం వంటి దేశాలు నిగీతో వారి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కింద జీరోడ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియాత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్‌ను సమర్థవంతంగా ఆక్రమిస్తున్నాయి. వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారతదేశం నుండి సీ ఫుడ్‌ను కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. అయితే నేడు తుది ఉత్పత్తులపై విధించిన అధిక ట్యాక్సుల కారణంగా ఆ దేశాలు కూడా మనకు ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేస్తున్నాయి.ఎపిలో శీతల గిడ్డంగులు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంట ఎక్కడ ఉంచాలో కూడా తెలియని గందరగోళ పరిస్థితిలో రైతాంగం ఉంది.మరోవైపు ఇంకా పంట సిద్ధంగా ఉంది. 27 శాతం సుంకాల కారణంగా రైతుల నుండి పంట సేకరిచడం ఎగుమతిదారులు నిలిపివేశారు.ఈ పరిణామాలు రాష్ట్ర ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఈ పరిణామాలతో ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు....ఇలా అందరికీ సమస్యలు వచ్చాయి.ఈ కారణంగా అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి అమెరికా సుంకాల నుంచి రొయ్యలను మినహాయింపు జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్చలు జరపాలి అని కోరుతున్నాసకాలంలో మీరు దీనిపై జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించడం వల్ల ఆక్వాపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మంది జీవనోపాధిని కాపాడవచ్చు.

## వారం - వర్జ్యం

**తేది : 07-04-2025, సోమవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**చైత్రమాసం, ఉత్తరాయణం,**
**వసంత ఋతువు, శుక్లపక్షం,**
శుక్ల దశమి రా.8.04
పుష్యమి ఉ.6.25
వర్జ్యం రా.8.01-9.43
దు.ము.12.35-1.25, 2) మ.3.04-3.54
శుభసమయం : ఉ.9.10-9.40
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** ఋణబాధలు ఎదురై చికాకులు పెట్టిన ముందుకు సాగుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కర్కాటకం :** ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వస్తులాభం.

**సింహం:** ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. బంధువుల నుండి శుభవార్తలు అందు కుంటారు.

**కన్య :** ఉద్యోగయత్నాలలో పురోగతి సాధిస్తారు. ఋణ వత్తిడుల నుండి బయటపడతారు. వస్తుసేకరణ.

**తుల :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** ఋణయత్నాలు సాగిస్తారు. దూరప్రయాణాలలో తొందరపాటు వద్దు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఋణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**మకరం:** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం, వస్తువులు, వస్త్రాలు కొనుగోలు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి.

**మీనం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సొంతమైదానంలో సన్‌రైజర్స్ చిత్తుగా ఓటమి

## ఏడు వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్ గెలుపు

**హైదరాబాద్,ఏప్రిల్ 6:** ఐపిఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటతీరు ఏమాత్రం మారలేదు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్నింట్లోను ఘోరంగా విఫలం అయి వరుసగా నాలుగో సారి ఓటమి చవిచూసింది. ఉప్పల్‌స్టేడియంలోచెలరేగాల్సిందిపోయి ప్రత్యర్థికి మొత్తం మ్యాచ్ అప్పగించింది. ఏడు వికెట్లు తేడాతో గుజరాత్‌పై హైదరాబాద్ ఓటమి చవిచూసింది. గుజరాత్ పేసర్ సిరాజ్ 17 పరుగులిచ్చి 4 వికెట్లు తీయడంతో ఆరెంజ్ ఆర్మీ టాపార్డర్ కుప్పకూలింది. నితీశ్‌కుమార్‌రెడ్డి ఆ1, కెప్టెన్ కమిన్స్ 27నాటౌట్‌లు పోరాడి కొంతమేర స్కోరు అందించారు.153 పరుగుల ఛేదనలో 16కే రెండు వికెట్లు పడినా గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ 61 నాటౌట్ గా నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకర్షించాడు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్‌సుందర్(40) మెరుపు బ్యాటింగ్‌తో జట్టు విజయానికి బాటలువేసాడు. ఇంపాక్ట్‌ప్లేయర్ షశ్రీర్వానే రూథర్‌ఫర్డ్ 35 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. ఏడువికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో నిలిచింది. ఇక ఐపిఎల్‌సీజన్‌లోసన్‌రైజర్స్ పరాజయాల పరంపర కొనసాగిస్తోంది. సొంతమైదానంలోనైనా గెలస్తుందనుకుంటే సాధ్యంకాలేదు. స్వల్ప లక్ష్యం కాపాడుకునే క్రమంలో సన్‌రైజర్స్ బౌలర్లు పవర్‌ప్లేలో అదరగొట్టారు. ఓపెనర్ సాయిసుదర్శన్ ఐదును ఔట్‌చేసిన షమీ తొలివికెట్ అందించాడు. ఆ కాసేపటికేజోస్‌బట్లర్‌ను కమిన్స్ డకౌట్‌గా పంపించాడు. అయితే 16 పరుగులకే రెండు వికెట్లుపడినా వాషింగ్టన్‌సుందర్23పరుగులుచేసాడు. ఇదిలా ఉంటే సన్‌రైజర్స్ బాట్యర్లు మళ్లీ నిరాశనే మిగల్చడంతో ఫ్యాన్స్ నిరసనప్రకటించారు. సన్‌రైజర్స్‌జట్టులో నితీష్‌కుమార్‌రెడ్డి క్లాసిన్ మినహా మిగిలిన బ్యాటర్లుఎవ్వరూ పెద్దగా రాణించలేదు. నిర్ణీత 20 ఓ వర్లలోనే 8 వికెట్లు నష్టపోయి 158 పరుగులు మాత్రమేచేసింది. ఓపెనర్లు అభిషేక్‌శర్మ 18, ట్రావిస్ హెడ్8లను సిరాజ్ ఔట్‌చేసాడు. మిడిలార్డర్‌లో ఇషాన్‌కిషన్ 17, ఎన్‌కెఆర్ 31, క్లాసిన్ 27, అనికేత్‌వర్మ 17, కమిందు మెండిస్ ఒకే ఒక్కపరుగుచేసి తక్కువ పరుగులకే ఆలౌట్ అయ్యారు.

# బిజినెస్ జిల్లా నిర్మాణం

>> కుదిరింది.
ఇరవై చదరపు కిలోమీటర్ల సీడ్ డెవలప్‌మెంట్ ప్రాంతంలో దశలవారీగా అభివృద్ధి చేస్తామని సింగపూర్ కన్సార్టియం స్పష్టం చేసింది. 1691 ఎకరాల సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో పెట్టుబడులు ఆహ్వానించడంతో పాటు ఆర్థిక లావాదేవీల కేంద్రంగా మార్చేందుకు 20 ఏళ్ల సమయం పడుతుందని సింగపూర్ కన్సార్టియం అంచనా వేసింది 2019లో అధికారం మారడంతో అమరావతిలో ఈ ప్రణాళికలన్ని మూలన పడ్డాయి. జగన్ అధికారంలోకి వస్తూనే ఈ అంకుర ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టును రద్దు చేశారు. 1691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సింగపూర్ కన్సార్షియం మూలధన పెట్టుబడిని కూడా వెనక్కి తీసుకునేలా చేశారు. స్విస్ ఛాలెంజ్ విధానంలో మాస్టర్ డెవలపర్‌గా సింగపూర్ కన్సార్షియం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనీయకుండా వైఎస్సార్సీ ప్రభుత్వం ధ్వంసం చేసింది.
అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్స్ వాహక సంస్థలో సింగపూర్ కన్సార్టియంకు 58 శాతం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 42 శాతం వాటా ఉంది. మూలధన వాటాగా సింగపూర్ కన్సార్షియం రూ.306 కోట్లు, ఎడిసి రూ.222 కోట్లు పెట్టాల్సి ఉంది. అయితే రెండు సంస్థలూ రూ.78 కోట్లు, రూ.52 కోట్ల చొప్పున మాత్రమే మూలధన పెట్టుబడిగా ఉమ్మడి ఖాతాలో జమ చేశాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ ఒప్పందం రద్దు కావడంతో ఆయా సంస్థలు తమ మూలధన పెట్టుబడిని వెనక్కి తీసుకున్నాయి.ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ప్రాజెక్టులన్నీ మళ్లీ ఊపందుకున్నాయి. సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేలా స్టార్టప్ ఏరియాను పునరుద్ధరించనున్నట్టు సమాచారం. సింగపూర్ కన్సార్షియంతో చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించే అవకాశాలున్నాయి. ఇప్పటికే సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తో సింగపూర్ ప్రతినిధులు సంప్రదింపులు జరిపారు.

# వృద్ధిరేటులో దేశంలోనే నంబర్ 2 ఎపి

## - ఇది సమష్టి విజయమన్న చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వృద్ధి రేటులో సంచలనం సృష్టించింది. జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాలను దాటి ముందుకు తీసుకునిదూసుకెళ్తోంది. 2024 -2025 సంవత్సరానికి కాన్ స్టెంట్ ప్రైసెస్‌లో 8.21 శాతం వృద్ధితో దేశంలో రెండో స్థానంలో నిలిచింది. 9.69 శాతం గ్రోత్ రేట్‌తో తమిళనాడు దేశంలో మొదటి స్థానంలో ఉందని సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ నివేదిక ఇచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏపీ ఈజ్ రైజింగ్ అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజల సమష్టి విజయమంటూ వ్యాఖ్యానించారు.

వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో కేవలం 6.19 శాతం గ్రోత్ రేట్ వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏడాది కాలంలో 2.02 శాతం పెరిగి 8.21 శాతానికి పెరిగిందని తెలిపారు. కరెంట్ ప్రైసెస్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రోత్ రేట్ 12.02 శాతం ఉందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రం గాడినపడడంతోపాటు విశ్వాసం పెంచేలా వృద్ధి రేటు సాధించామని సీఎం హర్షం వ్యక్తం చేశారు.



వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, ఇంధన రంగం సహా పలురంగాల్లో తీసుకొచ్చిన పాలసీలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రోత్ రేట్ వృద్ధి రాష్ట్ర ప్రజల సమిష్టి విజయమంటూ అభినందనలు తెలిపారు. బంగారు భవిష్యత్ కోసం కలిసి ప్రయాణాన్ని కొనసాగిద్దాం అంటూ ఏపీ ప్రజలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి జీఎస్టీతో పాటు వ్యాట్ వసూళ్లు, వృత్తిపన్ను కలిపి 51,297 కోట్ల రూపాయల రెవెన్యూ వచ్చిందని తెలిపారు.. గత ఏడాదితో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో క్రమేణా వృద్ధి నమోదు అవుతోందని తెలిపారు. 2025 మార్చి నెలకు రూ. 3,116 కోట్ల జీఎస్టీ వసూలు అయ్యిందని ఆయన తెలియచేశారు.

గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 8.35 శాతం మేర అదనంగా జీఎస్టీ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 తేదీ వరకూ రూ.33,660 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చిందన్నారు. 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి రూ.44,825 కోట్ల గ్రాస్ జీఎస్టీ వసూళ్లు అయినట్టు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి రూ.44,298 కోట్ల గ్రాస్ జీఎస్టీ వసూళ్లు వచ్చాయన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాదిలో 1.19 శాతం మేర జీఎస్టీ వసూళ్లు పెరిగాయని వెల్లడించారు.

2024 అక్టోబర్ లో రూ.2820 కోట్లు, 2024 నవంబరులో రూ.2843 కోట్లు జీఎస్టీ ఆదాయం వచ్చిందని అలాగే డిసెంబర్ లో రూ.2524 కోట్లు, 2025 జనవరిలో రూ.2904 కోట్లు, ఫిబ్రవరిలో రూ.2937 కోట్ల జీఎస్టీ వసూలు అయినట్టు స్పష్టం చేశారు. 2025 మార్చిలో రూ.3116 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చినట్టు తెలిపారు. పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ వసూళ్లలో 5 శాతం మేర స్వల్పంగా తగ్గుదల నమోదు అయ్యిందని, 2024 25 ఆర్థిక సంవత్సరానికి రూ.16,176 కోట్లు వచ్చాయన్నారు.

## పేదకుటుంబాలను అభివృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యం

### - తిరుమలలో హోంమంత్రి అనిత

**తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో విజన్ 2047,పి 4 విధానంతో పేద కుటుంబాలను బంగారుకుటుంబాలుగా అభివృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యమని రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో ముందుండాలని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రప్రజలు బాగుండాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీరామనవమిరోజు తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో భాగ్యమని అన్నారు. రాష్ట్రప్రజలందరికీ శ్రీరామనవమి శోభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి ఆమె ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. హోంమంత్రి వెంట తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఓ హర్షవర్ధనరాజు, తిరుమల ఏఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్ ఉన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఇంద్రకీలాద్రిపై ఆదివారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ప్రధాన అర్చకులు లింగంబొట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ సీతారాములను వధూవరులుగా ముస్తాబు చేసి కళావేదికపై సిద్ధం చేసిన ఆసనంపై వేంచేపు చేశారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లకు కళ్యాణోత్సవం జరిపించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

- నగరవ్యాప్తంగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం:

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా విజయవాడ నగరవ్యాప్తంగా పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. పూర్ణానందంపేట శ్రీ దాసాంజనేయ కోదండ రామస్వామివార్ల ఆలయంలో అభిజిత్ లగ్నంలో అర్చకస్వాములు గోపీ కృష్ణమాచార్యులు, నారాయణ, బాబు ల నేతృత్వంలో కమనీయంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

- నేడు పూర్ణాహుతి

దుర్గమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినాన ప్రారంభమైన వసంత నవరాత్రులకు సోమవారం పూర్ణాహుతి నిర్వస్తామని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు.

- నేడు శ్రీరామపట్టాభిషేకం:

దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు శ్రీ రాముల వారి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామన్నారు. పుష్పార్చన టికట్లు భక్తులు ఆన్‌లైన్లో, దేవస్థానం ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లో పొందవచ్చని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు.

- పుష్పార్చనలందుకుని అనుగ్రహిస్తున్న దుర్గమ్మవారు:



శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యశోద, గరుడ గమన, తదితర కీర్తనలకనుగుణంగా పలు నృత్యరీతులతో శిషబృందం ఆహుతులను ఆకట్టుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు.

- శాశ్వత అన్నదానంకు విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కంకిపాడుకు చెందిన జి శ్రీరామ్ చరణ్ తేజ్ రు.1లక్షను విరాళంగా ఆదివారం ఆలయాధికారులకు అందించారు. దాతకు వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

## కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణోత్సవం

### రామనామ స్మరణతో హోరెత్తిన రామతీర్థం




**నెల్లిమర్ల,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద ఆదివారంనాడు శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా దేవస్థానం వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వేదికపై వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ కళ్యాణోత్సవాన్ని అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు తదితర అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వ క్షేణపూజతో ప్రారంభించి తలంబ్రాలు వరకు సుమారు మూడున్నర గంటల పాటు అర్చకులు నిర్వహించిన కళ్యాణోత్సవాన్ని భక్తులు కనులార్పకుండా తిలకించి తరించారు. సుమారు 10.30 గంటల సమయంలో ప్రారంభమయిన కళ్యాణోత్సవం 1.15 గంటల వరకు కొనసాగింది. ప్రధానంగా జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, ముత్యాల తలంబ్రాలు చల్లుకునే ప్రక్రియలను చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అర్చకులకు అందజేశారు. అలాగే ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ లక్ష్మి దంపతులు పట్టువస్త్రాలను, ముత్యాలను వ్యక్తిగతంగా సమర్పించారు. అలాగే రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, శ్రవణ చైతన్య చిన్న స్వామి తదితరులు కూడా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవ ఘట్టాలను నంద్యాలకు చెందిన ప్రముఖ వేద పండితుడు డివి హయగ్రీవాచార్యులు అద్భుతంగా వివరించారు. కళ్యాణోత్సవానికి ముందు విజయనగరం అభినయ కళాక్షేత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందర్ని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 30 వేల మంది వరకు వచ్చారని అంచనా. వీరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టెంట్ హౌస్ ఏర్పాట్లు చేశారు. టెంట్‌లో కుర్చీలు వేశారు. రామనామ స్మరణంతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ వేడుకలు దేవస్థానం ఇఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగాయి. రామతీర్థంలో ఆదివారం జరిగిన శ్రీరామ నవమి వేడుకలతో పాటు సీతారాముల కళ్యాణోత్సవాలను తిలకించేందుకు ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజుతో పాటు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగర ం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ, ఝాన్సీ లక్ష్మి దంపతులు, ఎంఎల్‌సి డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) పాటు దేవాదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, నెల్లిమర్ల మాజీ ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల కమిటి అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పార్టీ నాయకులు కొండపల్లి కొండలరావు, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైసిపి నాయకుడు అంబళ్ల శ్రీరాములునాయుడు హాజరయ్యారు. అలాగే దేవాదాయ శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల డిప్యూటీ కమిషనర్ సుజాత, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ శిరీష, విజయనగరం ఆర్‌డిఓ దాట్ల కీర్తి,, డిఎస్‌పి ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఇఓపిఆర్‌డి శంకర్ జగన్నాథ్, నగర పంచాయితీ కమీషనర్ కె.అప్పలరాజు, నగర పంచాయితీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు తదితరులు పాల్గొన్నారు. రామతీర్థం సేవా పరిషత్ అద్యక్షుడు వివిఎస్‌ఆర్ ప్రసాద్ (జ్యోతి ప్రసాద్), రామతీర్థం సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రేగాన గోవిందరావు, సుదర్శనం విజయ్‌కుమార్, ఆల్తి శ్రీనివాసరావు, ముంతా ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

## పర్యాటక ప్రాజెక్టుల అధ్యయనానికి కమిటీ

**విజయవాడ,ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి వస్తున్న ప్రైవేటు పర్యాటక ప్రాజెక్టులను పరిశీలించి వాటి వల్ల ప్రయోజనం అంచనా వేయడం, వాటికి రాయితీలు ఇచ్చే అంశాల పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజరు జైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పర్యాటక విధానాన్ని అనుసరించి వివిధ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు పలు ప్రైవేటు సంస్థలు ముందుకొస్తున్న నేపథ్యంలో వాటి వల్ల ప్రయోజనాలు అంచనా వేయడం కోసం, అదే విధంగా ఆయా ప్రాజెక్టులకు నూతన పాలసీ ప్రకారం రాయితీలు ఇచ్చే అంశాలను 9 మంది అధికారులతో కూడిన కమిటీ అంచనా వేస్తోంది. కమిటీకి ఛైర్మన్‌గా ఎపిటిఎ సిఇఒ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎపిటిడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇంజినీరు, ఎపిడిఎ చీఫ్ అకౌంట్స్ అధికారి, హెచ్ఒడి (ఐడిజి సెక్షన్), ఎపిటిడిసి జిఎం, ఎజిఎం, ఆర్థికశాఖ పిపిపి నిపుణులు, ఎపిటిఎ సిఇఒ నామినేట్ చేసిన ఒక అధికారి, డిప్యూటీ సిఇఒ, ఇడి (ఆపరేషన్స్) ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతగానో కృషి - బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి



**విజయవాడ,ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతగానో కృషి చేస్తున్నారని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. బీజేపీ జెండాను ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆవిష్కరించారు. ఈ వేడుకల కోసం భారీగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మీడియాతో మాట్లాడారు. 1980లో జనసంఘ్ నుంచి చాలా ఒడిదుడుకులను తట్టుకుని భారతీయ జనతా పార్టీ నిలబడిందని తెలిపారు. ప్రపంచంలో ఎక్కువ మంది కార్యకర్తలు కలిగిన పార్టీ బీజేపీ అని చెప్పారు. రెండు సీట్ల నుంచి ప్రారంభమై మూడు వందలకుపైగా సీట్లు కమలం పార్టీకి రావడం చాలా గొప్ప విశేషమని సుజనా చౌదరి అభివర్ణించారు. పదేళ్ల నుంచి భారతదేశం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా కష్టపడుతున్నామని సుజనా చౌదరి తెలిపారు. దేశాన్ని నరేంద్ర మోదీ నాయకత్వంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఉద్ఘాటించారు. వాజ్ పాయ్, అద్వానీ లాంటి నేతల నుంచి నేడు నరేంద్రమోదీ, అమిత్ షా లాంటి సమర్థవంతమైన నాయకులు కలిగిన పార్టీ బీజేపీ అని చెప్పారు. నేడు దేశ వ్యాప్తంగా ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు జరగటం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికి ఎమ్మెల్యే సుజనా చౌదరి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు- మాజీ సీఎం జగన్

**విజయవాడ,ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీరామ నవమి పండుగ సందర్భంగా శ్రీ సీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని వైఎస్.జగన్ ఆకాంక్షిస్తూ .ఆదివారం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఒంటిమిట్ట, భద్రాద్రి ఆలయాలతో పాటు, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇంటింటా శ్రీరామనవమి పర్వ దినాన్ని, రాములవారి కల్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ శ్రీ సీతారాముల అనుగ్రహం లభించాలని వైఎస్ జగన్ అభిలషించారు. సకల గుణ సంపన్నుడు శ్రీరాముడు. రామచంద్రుడికి ఎన్ని కష్టాలు ఎదురైనా ఏనాడూ ధర్మం వీడలేదు. అబద్ధం ఆడలేదు. ప్రజారంజక పాలకుడు శ్రీరాముని జీవితం తరతరాలకు ఆదర్శనీయం. ఆ జానకీ వల్లభుడి ఆశీస్సులు తెలుగు ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటూ అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమల సమాచారం

## కోదండరామాలయంలో రామనవమి వేడుకలు



**తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీరామనవమివేడుకలు ఘనంగా జరిపించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంలో మేల్కొలిపి అభిషేకాదులు, పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు ఆలయంలో విశేష స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయంకు చేరుకున్నారు. భక్తులకు ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ అధికారులు, అర్చకులు సకల సౌకర్యాలు, క్యూలైన్ల క్రమబద్దీకరణ, మూలవిరాట్టు దర్శనం కల్పించారు. భక్తులకు వడపప్పు, పానకం టిటిడి అధికారులు పంపిణీ చేశారు. శ్రీరామనామంతో ఆలయం పులకించింది. సాయంత్రంస్వామివారు హనుమంతవాహనంపై మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.

## రామనవమిన శ్రీవారి దర్శనం ఆనందదాయకం

### - సుప్రీంకోర్టు సిజెఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా



**తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో పవిత్రమైన శ్రీరామనవమి పర్వదినాన కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకోవడంతో మనసు సంతోషంగా ఉందని అన్నారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి ఆయన విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి మొక్కిన జస్టిస్ ఖన్నా దంపతులు అనంతరం సన్నిధిలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, 2025 టిటిడి క్యాలండర్ బహుకరించారు.

## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి : మంత్రి నాదెండ్ల



**తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండు రోజులు తిరుమల పర్యటనలో అమాంతం సామాన్యభక్తుడిలాగే గడిపారు. ఆదివారం ఉదయం కూడా ఆయన కుటుంబసభ్యులతో కలసి సాధారణంగానే ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీరామనవమిపర్వదినాన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. విఐపి బ్రేక్ దర్శనంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న సన్నిధిలో వేడుకగా శ్రీరామనవమి ఆస్థానం

**.తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల బంగారువాకిలిలో ఆదివారం రాత్రి ఆగమోక్తంగా శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత సీతాలక్ష్మణ ఆంజనేయసమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లు ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు. రాత్రి 9గంటలకు ఆలయంలోపలకు వేంచేసిన ఉత్సవర్లను ఆలయ అర్చకులు,వేదపండితులు బంగారువాకిలిలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి వితరణ చేశారు. త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించారనే పురాణ ఆధారాలతో శ్రీరామనవమి పర్వదినాన్ని ఆదివారం ఉదయం తిరుమల ఆలయంలో శాస్త్రోక్తంగా సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం జరిపించారు. పాలు,పెరుగు,తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో అభిషేకించారు. జీయరుస్వాములు ఈ వేదోక్తంలో తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను పఠించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి,అర్చకులు పాల్గొన్నారు. రామనవమి ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం ఉత్సవమూర్తులు హనుమంతవాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరాముడికి హనుమంతుడు అత్యంత విశ్వాసపాత్రుడు. ప్రియదాసభక్తుడైన ఆంజనేయుడిపై శ్రీరాముడుగా మలయప్ప ఊరేగి భక్తులను కటాక్షించారు. వాహనంముందు భక్తులు ఆదపమొక్కులవాడా.....గోవిందా...తిరుమలవాసా గోవిందా నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి,అర్చకులు పాల్గొన్నారు.


**OFFICE OF THE DEPUTY COLLECTOR AND COMPETENT AUTHORITY (NSEL)**

3RD FLOOR, MPID BRANCH, Old Custom House, Mumbai 400 001

**NOTICE OF SALE**

Pursuant to the attachment by the Government of Maharashtra under the Maharashtra Protection of Interest of Depositors (in Financial Establishment) Act, 1999 (MPID Act) and the directions of the Hon'ble MPID Court the Competent Authority (hereinafter referred to as "CA") has engaged **Quikr Realty Pvt Ltd** (hereinafter referred to as "the Agency") which has been appointed by Government of Maharashtra to assist in the sale of the properties attached and made absolute through e-auction on **"as is where is and whatever there is basis"**.

"CA" hereby invites bids from the intending bidders along with a bid deposit as mentioned in the table below as Earnest Money for each of the properties to be paid through NEFT/RTGS for sale of properties:

**Short description of the property:**

**Andhra Pradesh**

| S. No. | Location | Address | Area | EMD Deposit (in INR) | Last Date of submission of EMD | Date of Auction | Bid Increase Amount (In INR) | Reserve Price (in INR) |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Andhra Pradesh | Agricultural land at D no. 35/2, Marripalem, Unnava Village Panchayat, Prattipadu Sub Division, Guntur District, Andhra Pradesh – 522019 | 1.12 Acre | 4,35,000/- | 06th May 2025 up to 5:00pm | 08th May 2025, 11.00 am to 12.00 pm | 50,000/- | 43,50,000/- |

1.The interested bidders who require assistance may contact Quikr Realty Private Limited via e-mail ID: **auctions@quikrrealty.com** or contact no. **+91 9321575329.**

3.The sale shall be subject to the orders of MPID Court.

**Place: Mumbai**
**Date: 07th April 2025**

**Deputy Collector and Competent Authority (NSEL) Mumbai**

వార్త

తమ వద్ద ఉన్న సంపదను మెదడులో జమచేస్తే దానిని ఏ ఒక్కరూ దొంగిలించలేరు. విద్యాపరమైన పెట్టుబడికి ఉత్తమం అయిన వడ్డీ లభిస్తుంది.

-బెంజమిన్ ఫ్రాంక్లిన్

# చట్టం అందరికి సమానమేనా?

కుల, మత, వర్గ, లింగ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు మన రాజ్యాంగ నిర్మాతలు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని ఆశించారు. కానీ అవి అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో, దక్షిణాలకు ప్రలోభపడో, చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారేమోననిపిస్తున్నది. మరొకపక్క సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. చట్టాల్లోని లొసుగులను లోపాలను ఉపయోగించుకొని వేలాది కరుడుకట్టిన నేరస్తులు కోట్లాది రూపాయలు దోచుకుంటూ తప్పించుకోగలుగుతున్నారు. సమర్థవంతపు దర్యాప్తు జరిపి పటిష్టంగా రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టి నేరాన్ని రుజువు చేయడంలో కొందరు అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా ముందుకు నడవకపోతే మరికొన్ని సందర్భాల్లో అధికారులే కేసులు వీగిపోయేలా రికార్డులు తయారు చేస్తున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులు సకల అవస్థలుపడి కోర్టుల ముందు రుజువుకు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు పాలక పెద్దలే మోకాలడ్డుతున్నారు. ఇలాంటి ప్రభుత్వ చర్యలు సమర్థవంతంగా దర్యాప్తు చేసే అధికారుల్లో నిస్పృహ, నిరుత్సాహం పెంచుతున్నది. అయితే ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలానుగుణంగా సవరించాలనే పోలీసు అధికారుల వాదన కూడా సమంజసమే. ఇటీవల కేంద్రం కొన్ని సవరణలు చేసింది. మూడు కొత్తచట్టాలను తీసుకవచ్చింది. అయినా ఫలితం లేకుండాపోతున్నది. అది అటు ఉంచుదాం. ఉన్న నిబంధనలను, చట్టాలను ఏ మేరకు నిస్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేద తేడాలు లేకుండా ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహారించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండాలేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహారిస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. ప్రధానంగా దేశవ్యాప్తంగా అనేక బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్‌లు పెట్టి కోట్లాది మంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేసే జీవితకాలం పాటు సంపాదించుకున్న డబ్బు పోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక, బాధితుల వేదన అరణ్యరోదనగా మారికొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్న సందర్భాలున్నాయి. గత దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా ఎన్నో ఫైనాన్స్ కంపెనీలు ప్రజలను మోసం చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నాయి. ఇందులో రికవరీ మాట ఎలా ఉన్నా నిందితుల్లో పదిశాతం మందిపై కూడా పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎలాంటి భయం, భక్తిలేకుండా బహిరంగంగానే నిస్సిగ్గుగా తిరుగుతున్నారు. ఇక ఒకే ప్లాట్‌ను ఇద్దరి ముగ్గురికి అమ్ముతూ, కొన్నిసార్లు అయితే లేని ప్లాట్లను కాగితాలపై చూపించి విక్రయించడం, ఇళ్ల స్థలాల అమ్మకాల్లో ఘరాన మోసం చేసిన ఎందరో పెద్దలు నిర్భయంగా తిరుగుతున్నారు. చాలావరకు వారిపై కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. హైదరాబాద్‌లో హైడ్రా చెరువుల కబ్జాల్లో తొలగిస్తున్న ఇళ్లల్లో కొందరు పేదవారు కూడా ఉన్నారు. అన్నీ అనుమతులు ఉన్నాయని, పైగా మున్సిపల్ పర్మిషన్, కరెంట్, వాటర్ కనెక్షన్ ఏర్పాటుచేసి రికార్డు చూపెట్టడంతో కొనుగోలు చేసుకున్నారు. ఒక్కసారిగా ఎలాంటి నోటీసు లేకుండా వచ్చి హైడ్రా కూలుస్తుండడంతో అలాంటి నిరుపేదలకు దిక్కులేక తాము మోసపోయామని తెలిసి కుప్పకూలిపోతున్నారు. న్యాయస్థానాల జోక్యంతో హైడ్రా కొంత వెనకాముందు ఆలోచిస్తున్నా ఎప్పుడు ఏమవుతోందనే భయం నెలకొన్నది. ఏదోరకంగా డబ్బు సంపాదించగలిగితే తమను ఎవరూ ఏమీచేయలేరనే భావన రోజురోజుకు పెరిగిపోతున్నది. అందుకే ఒకరిని చూసి ఒకరు పోటీపడి ప్రజలను మోసంచేసి కోటీశ్వర్లు అయిపోతున్నారు. ఈ విషయంలో బాధితులు కొందరు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి అటుంచి అసలు కేసులు నమోదు చేసుకోవడానికి కూడా కొందరు అధికారులు ఇష్టపడడం లేదు. మమ్మల్ని అడిగి ఇచ్చావా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మావద్దకు వచ్చేవాడివా అంటూ పలురకాల ప్రశ్నల వర్షం కురిపించి బాధితుడు మళ్లీ పోలీసు స్టేషన్ మెట్లెక్కకుండా చేసిపంపుతున్నారు. అంతే కాదు సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికివీల్లేదని న్యాయస్థానాలకు వెళ్లాల్సిందిగా సలహాలు ఇస్తారు. ఒక వేళ ఏదైనాకారణంతో కేసు నమోదుచేయాల్సి వస్తేసాక్ష్యాధారాలున్నాయా? లేవా? తదితర రికార్డులన్నీ పరిశీలించి దర్యాప్తులో సంతృప్తి చెందితేనే కేసునమోదు చేస్తున్నారు. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తేతాము వేరే పని చేయలేమని పోలీసుల వాదనను కూడా తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతోపాటు పోలీసులబాధ్యతలు కూడా పెరిగిపోయాయనడంలో సందేహంలేదు. ముఖ్యంగా విఐపిల బందోబస్తులోనే ఎక్కువసమయం గడుపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో దోపిడీలు జరుగుతున్నా అరాచకశక్తులువిజృంభించడంతో శాంతిభద్రతలు క్షీణించినా పర్వాలేదు కానీ ఒక్క విఐపిపర్యటనలో ఏమాత్రం పొరపాటు దొర్లినాతమ ఉద్యోగానికి ముప్పు తప్పదన్న భావనతోనే ప్రజాసమస్యలను విస్మరించి నేతల సేవవైపు మొగ్గు చూపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకోగలుగుతున్నా మరొకపక్క కొత్తకొత్త వ్యూహాలు, పరికరాలు, పరిజ్ఞానంతో ఈసైబర్ నేరాలకుఅదుపు లేకుండాపోతున్నది. ఈదగాలో మోసపోతున్నది, నష్టపోతున్నది సామాన్య, మధ్యతరగతి ప్రజలే. ఇప్పటికైనా పాలకులు అమాయక ప్రజలను మోసం చేస్తున్న దగాకోరులపై ఉక్కుపాదం మోపాలి.

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడని వారు ముందు తరాల వారు తమని గుర్తించగల ఏ కార్యాన్నీ సాధించలేరు.



మెకాలే

నిజమైన బలం అనేది శారీరక శక్తి కాదు. ఆత్మ జ్ఞానంలోనూ, మరణభయం నుంచి విముక్తి పొందడంలోనూ ఉంది.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



## బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి

గల్లీకొక శంకర్ దాదాలు తయారవుతున్నారు. గతంలో ఇలాంటి శంకర్‌దాదాలు ఎంతో మంది పట్టుబడ్డారు. కానీ ప్రభుత్వం ఎటువంటి చర్యలుతీసుకోలేదు. ఓపది మందుల పేర్లను గుర్తుంచుకుని ఏ జబ్బుకైనా వాటినే రాస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే వీరి ఆటలు సాగుతున్నాయి. ఖరీదయిన ఆసుపత్రులకు వెళ్లే స్తోమత లేక పేదలు వీరినే ఆశ్రయిస్తున్నారు. అధిక రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. బస్తీ దవఖానాలను రెండు తెలుగు రాష్ట్రాలలోనూ మరింతగా నెలకొల్పాలి. వాటిలో నర్సులతో బాటు అర్హత గల వైద్యులను నియమించాలి. చిన్నచిన్న ఆపరేషన్లు చేసేలా అన్ని వసతలు కల్పించాలి. లేకపోతే లేమితనంతో బాటు రోగాల బాటపడాలి. పరిస్థితి శృతిమించకుండా ప్రభుత్వాలు మేలుకోవాలి.

- పి. విజయలక్ష్మి, హైదరాబాద్

## బడులను బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలలను రద్దు చేయటం వల్ల అందుబాటులో ఉన్న ఇంటర్ విద్య గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు దూరమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కార్పొరేట్ ప్రైవేట్ ఇంటర్ కాలేజీలలో తమ బిడ్డల చదువు కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేసి తల్లిదండ్రులు అప్పులు పాలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ఇంటర్ విద్య అభ్యసించడానికి హైస్కూల్ ప్లస్‌పాఠశాలలు బాగా ఉపయోగపడుతున్నాయి. కాబట్టి ప్రభుత్వం వాటిని రద్దు చేయకుండా జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చి ఇంటర్ విద్య బలోపేతం చేయాలి.

-వి.నరేష్, నెల్లూరు జిల్లా

## పొదుపు పాటించడం ముఖ్యం

మహానగరాల్లో చదువుకొని కాస్తఅవగాహన ఉన్న వ్యక్తులువడ్డీపై అత్యాశ, లేక పొదుపు ఇతరులకు తెలియకుండా ఉండాలనే ఉద్దేశంతో లక్షలడబ్బుని వీధిలోని చేటీల పేరుతో చేసి కొంత కాలం తరువాత మొత్తం డబ్బుతో వాటి నిర్వాహకులు పారిపోయారని వార్తలువస్తున్నాయి. పొదుపుకు భారత దేశంలో తొలిబ్యాంక్ భారత తపాల శాఖది. ప్రజలు వీటిని గుర్తెరిగి కష్టార్జితం సొమ్మును సరైన రీతిలో జాతీయ పొదుపును చేయాలి.

- బొల్లోజు మేఘనాథము, విశాఖపట్నం

## అవినీతిని అరికట్టాలి

మన దేశంలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతుంది. ముఖ్యంగా మన తెలంగాణాలో అక్రమార్కుల సంఖ్యఅమాంతం పెరిగిపోయింది. లంచం తీసుకుంటూ దొరికిపోతున్న ప్రభుత్వ ఉద్యోగులకు సస్పెన్షన్‌తో సరిపెడుతున్నారు. దాంతో వారు నిర్భయంగా మళ్ళీ కొంత కాలానికి ఎలాగో అలా తిరిగి విధుల్లోకి చేరిపోతున్నారు. మళ్ళీ అదేతంతు. అదే తీరు అనే విధంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దిగమింగుతున్నారు. ముఖ్యంగా ఈ లంచావతారులు ఎక్కువగా జలమండలి ఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ ,మున్సిపల్ టౌన్ ప్లానింగ్ రంగాలలో జరుగుతోంది. కావునా ప్రభుత్వం దీనిపై గట్టిచర్యలు తీసుకోవాలి. కేవలం సస్పెండ్‌లతో సరిపెట్టకుండా చట్టాలువీరిని కఠినంగా శిక్షించాలి. నేరంరుజువు అయితే అటువంటి వారిని విధుల్లోకి ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు.

-కె.రామారావు, సికింద్రాబాద్

## చిత్తశుద్ధితో కృషి చేయాలి

అంతులేని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, విస్తరణవాదం కారణంగా ప్రపంచ భూసారం తగ్గి కనీస పోషకాలు లేని పంటలతో ప్రపంచ దేశాల ప్రజలు రోగనిరోధక శక్తిని కోల్పోతున్నారు. గత మూడు దశాబ్దాలలో ఐదు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు అని పలు నివేదికలు తెలుపుతున్నాయి. ఒక్క వాయు కాలుష్యం కారణంగా ఏటా 16 లక్షలమంది చనిపోతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వ్యవసాయం గిట్టుబాటు కాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి సేద్యంసాగించలేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతుండగా ఆ అంశం కేంద్ర, రాష్ట్రాల పాలకులు అంతగా పట్టించుకోకపోవడం విచారకరం. రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషిచేయాలి.

- సి.ప్రతాప్, శ్రీకాకుళం

## పెరుగుతున్న వైద్యం ఖర్చులు

వైద్యచికిత్సలు, పద్ధతులు, ప్రక్రియలకు నిర్దిష్ట ఫీజులను నిర్ధారించాలని, ఫీజులను నిర్ణయించే ముందు ప్రజల జీవన ప్రమాణాలను, ఇతర స్థితిగతులను దృష్టిలో ఉంచుకోవాలని కేంద్రంఅప్పట్లో ఈ నిబంధనలను రూపొందించడం జరిగింది. అయితే, దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రులేవీ ఈ నిబంధనలను పాటించడంలేదు. ఈనేపథ్యంలో దేశంలో పెరుగుతున్న వైద్యం ఖర్చులను నియంత్రించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

-ఎన్. నవీన్‌కుమార్, నల్గొండ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రీన్‌హౌస్ వ్యవసాయం గేమ్ ఛేంజర్ అవుతుందా?

**గ్రీన్‌హౌస్‌లలో సెన్సార్లు, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించబడుతుంది. గ్రీన్‌హౌస్ వ్యవసాయం నీటిని ఎరువులను సమర్థవంతంగా ఉపయో గించడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి దోహదం చేస్తుంది. తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడిని పొందడానికి వర్టికల్ ఫార్మింగ్ పద్ధతులు ఉపయోగించబడతాయి. నగరాల్లో గ్రీన్‌హౌస్‌లను ఉపయోగించి పంటలను పండించడం పెరుగు తుంది. ఇప్పటికే గ్రీన్‌హౌస్ వ్యవసాయం అనేక రాష్ట్రాలలో విస్తరిస్తోంది. కూరగాయలు, పువ్వులు, ఇతర విలువైన పంటలను పండిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది, ప్రభుత్వ సహకారం పెరిగితే ఈ రంగం మరింత వృద్ధి చెందుతుంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సమర్థవంతమైన నీటి యాజమాన్యంపై దృష్టి సారించడం ద్వారా పర్యావరణ ప్రభావాలను తగ్గించవచ్చు.**

డి జె మోహన రావు

ప్రస్తుతం మనదేశ జనాభా సుమారుగా నూట నలభై కోట్లకు పైగానే ఉంది. కానీ అనేక కారణాల వలన పంటభూమి విస్తీర్ణం రోజురోజుకి తగ్గుతూనే ఉంది. దీని వలన ఆహార భద్రతకు ప్రాధాన్యత పెరుగుతోంది. సంప్రదాయ వ్యవసాయంలో అనిశ్చిత వర్షాలు, కరవులు, వరదలు, ఇతర వాతావరణ వైపరీత్యాలు పంటల దిగుబడిని ప్రభావితం చేస్తున్నాయి. భూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడం వలన పంటల దిగుబడి తగ్గిపోతున్నది. వ్యవసాయానికి అవసరమైన నీరు లభ్యంకాక పంటలు ఎండిపోతున్నాయి. లోతుగా బోర్లు వేయడం వలన భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. రసాయన ఎరువులు, పురుగు మందులను అధికంగా వాడడం వలన నేలసారం క్షీణించిపోతుంది. దానితోపాటు పర్యావరణం కలుషితంఅవుతుంది. నేల కోత వలన, పంటలను తెగుళ్లు, వ్యాధులు ఆశించడం వలన పంటల దిగుబడి తగ్గిపోతుంది. వ్యవసాయ కార్మికులసంఖ్య తగ్గడం, వేతనాలు పెరగడం వలన పంట ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయి. ఆధునిక వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు తగినంత అవగాహన ఉండడంలేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వలన దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలియదు. ఈ సవాళ్లను అధిగమించడానికి, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి. ఇందులో గ్రీన్‌హౌస్ వ్యవసాయం చెప్పుకోదగినది. గ్రీన్‌హౌస్ వ్యవసాయం అనేది ఒక వినూత్న వ్యవసాయ నమూనా. స్థిరమైన ఆహార ఉత్పత్తిని సాధించడానికి ఒక సాధనం. నియంత్రిత వాతావరణాన్ని అందించే, కఠినమైన వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, వ్యాధుల నుండి మొక్కలను రక్షించే మూసివున్న నిర్మాణాలలో (గ్రీన్‌హౌస్‌లు) పంటలను పండించడం. ప్రత్యేకంగా తయారు చేసిన ఒక కట్టడంలో పంటలను పండించడం. ఈ కట్టడం సాధారణంగా గాజు లేదా ప్లాస్టిక్ వంటి పారదర్శక పదార్థాలతో నిర్మించబడి ఉంటుంది. దీని వలన సూర్యరశ్మి లోపలికి ప్రసరించి లోపల వేడిని నిలుపుతుంది. ఈ వేడి వలన మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. గ్రీన్ హౌస్ వ్యవసాయ ముఖ్య ఉద్దేశ్యం పంటలకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులను సృష్టించడం. సూర్యుని కాంతి పైకప్పు ద్వారా లోపలికి ప్రవేశించి భూమిని, మొక్కలను వేడి చేస్తుంది. ఈ వేడిని పైకప్పు బయటికి పోకుండా నిరోధించడం వలన లోపల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ ప్రక్రియనే గ్రీన్‌హౌస్ ప్రభావం అంటారు. లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతి, గాలి ప్రసరణ వంటి వాతావరణ పరిస్థితులను నియంత్రించే అవకాశం ఉండడం మూలాన పంటలకు అనుకూలమైన పరిస్థితులను కల్పించి దిగుబడి పేరుడుతుంది. గ్రీన్‌హౌస్ వ్యవసాయంలోవాతావరణ పరిస్థితులను (ఉష్ణోగ్రత, తేమ, కాంతి) నియంత్రించడం ద్వారా ఈ నష్టాన్ని తగ్గిస్తుంది. తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి అందిస్తుంది. నీటిని సమర్థవంతంగా ఉపయోగించి నీటి కొరతను అధిగమించవచ్చు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం చాలా తక్కువగా వాడడంవలన పండించిన పంటలునాణ్యంగా ఉంటాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలోనూ, సాధారణ వాతావరణంలో



పండించడానికి వీలుకాని విలువైన పంటలను పండించవచ్చు. దీని వలన సంవత్సరం పొడవునా పంటలు అందుబాటులో ఉంటాయి. ఈ పద్ధతిలో నేలకోతకు గురికాదు. పంటలను తెగుళ్లు, వ్యాధులు, వాతావరణ వైపరీత్యాల నుండి రక్షించవచ్చు. తక్కువ భూమిలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. గ్రీన్‌హౌస్ వ్యవసాయం ప్రధానంగా అధిక విలువైన, వాతావరణ నియంత్రణ అవసరమయ్యే పంటలకు అనుకూలంగా ఉంటుంది. కొన్ని పంటలు గ్రీన్‌హౌస్ వాతావరణంలో బాగా పెరుగుతాయి. టమోటాలు, దోసకాయలు, మిరపకాయలు, కరివేపాకు, గులాబీలు, లిల్లీలు, స్ట్రాబెర్రీలు, ద్రాక్ష, పుచ్చకాయలు, ఔషధ మొక్కలు, నారు మొక్కలకు గ్రీన్‌హౌస్ వ్యవసాయం మరింత అనుకూలంగా ఉంటుంది. అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. గ్రీన్‌హౌస్ నిర్మాణం, పరికరాల నిర్వహణకు అధిక పెట్టుబడి అవసరం. చిన్న, సన్నకారు రైతులకు ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. రైతులకుతగిన సాంకేతిక నైపుణ్యాలు లేవు. ఈ రంగానికి సంబంధించి మనదేశంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. గ్రీన్‌హౌస్ లోపల ఉష్ణోగ్రత, తేమ, కాంతిని నియంత్రించడానికి విద్యుత్, నీరు అవసరం. కావలసిన ఉష్ణోగ్రతలను నిర్వహించడానికి, కాంతిని అందించడానికి వెంటిలేషన్ కోసం చాలా విద్యుత్తు అవసరం. ఇది శక్తి వినియోగాన్ని పెంచుతుంది. ఇది పర్యావరణానికి హానికి దారితీయవచ్చు. ఈ సవాళ్లను అధిగమించడానికి, ప్రభుత్వాలు, రైతులు, పరిశోధకులు కలిసి పని చేయాలి. మన దేశంలో గ్రీన్‌హౌస్ వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అగ్రదేశాలతో పోల్చితే మన దేశం వాటా ఇంకా పరిమితంగానే ఉంది. దీనికి అనేక కారణాలున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీనివలన రైతులు పూర్తిస్థాయిలో లాభాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీన్‌హౌస్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ సహకారం మాత్రం అంతంత మాత్రమే ఉంది. పండించిన పంటలను మార్కెట్ చేయడం, విక్రయించడం ఒక సవాలుగా ఉంది. మన దేశంలో గ్రీన్‌హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవడానికి ఈ సవాళ్లన్నీ అధిగమించాలి. ఈ పద్ధతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఇంకా అధికంగా ప్రభుత్వం రాయితీలు, సబ్సిడీ అందించాలి. ముఖ్యంగా, చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలి. ఈ చర్యల ద్వారా, భారతదేశం గ్రీన్‌హౌస్ వ్యవసాయంలో తన వాటాను పెంచుకోవచ్చు. భారతదేశంలో గ్రీన్‌హౌస్ వ్యవసాయం భవిష్యత్తు చాలా ఆశాజనకంగా ఉంది. గ్రీన్‌హౌస్ వ్యవసాయం రానున్న రోజులలో విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని అంచనా వేస్తున్నారు. గ్రీన్‌హౌస్‌లలో సెన్సార్లు, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించబడుతుంది. గ్రీన్‌హౌస్ వ్యవసాయం నీటిని ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా సుస్థిర వ్యవసాయానికి దోహదం చేస్తుంది. తక్కువ స్థలంలో ఎక్కువ దిగుబడిని పొందడానికి వర్టికల్ ఫార్మింగ్ పద్ధతులు ఉపయోగించబడతాయి. నగరాల్లో గ్రీన్‌హౌస్‌లను ఉపయోగించి పంటలను పండించడం పెరుగుతుంది. ఇప్పటికే గ్రీన్‌హౌస్ వ్యవసాయం అనేక రాష్ట్రాలలో విస్తరిస్తోంది. కూరగాయలు, పువ్వులు, ఇతర విలువైన పంటలను పండిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది, ప్రభుత్వ సహకారం పెరిగితే ఈ రంగం మరింత వృద్ధి చెందుతుంది. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సమర్థవంతమైన నీటి యాజమాన్యంపై దృష్టి సారించడం ద్వారా పర్యావరణ ప్రభావాలను తగ్గించవచ్చు. ●

# బెట్టింగ్ ఆటలతో బలవుతున్న జీవితాలు

మోటె చిరంజీవి

ప్రస్తుతం బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసేవాళ్లపై తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ఇంకా యాప్స్ ప్రమోషన్‌ను ఆపడంలేదు. దేశ వ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేస్తూ కోట్లలో సంపాదిస్తున్న వాళ్లు వేలమంది ఉన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సెలబ్రిటీలే కాకుండా మరికొందరు బెట్టింగ్ టిప్స్ మాటున యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. టెలిగ్రామ్‌లో బెట్టింగ్ టిప్స్ పేరుతో ఛానళ్లు ఓపెన్ చేసి, అందులో మ్యాచ్ ప్రిడక్షన్స్ చెబుతూ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి చాలామంది యువతీ యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆటలు ఆడి తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సరదాగా ఆడటం మొదలుపెట్టి, ఆ ఆటలకు బానిసై, పెయిడ్ గేమ్స్, బెట్టింగ్ గేమ్స్ ఆడి దాచుకున్న డబ్బులను కోల్పోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి, అప్పులు కట్టలేక తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. అప్పుల పాలైనటువంటి వారు తిరిగి కట్టలేక ఇంట్లో వాళ్లకు చెప్పలేక, తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొందరైతే అప్పులుతీర్చేందుకు దొంగలుగా, చైన్స్ స్నాచర్లుగా, సైబర్ నేరగాళ్లుగా మారుతున్నారు. డబ్బుల కోసం ఇంట్లో వారిని చంపడానికి కూడా వెనకాడడం లేదు. బంధాలు బంధుత్వాలను కూడా ఆదమరిచి ప్రాణాలను తీస్తున్నారు. ఈ పెయిడ్ గేమ్స్, ఆన్లైన్ గేమ్స్ బారినపడి నేటి యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటుంది. ఇందులో ఎక్కువగా 20నుండి 35 సంవత్సరాల వయస్కులు ఎక్కువగా ఉండడం అందరినీ ఆందోళన కలిగించే విషయం. ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి వారు ఇంటర్నెట్‌లో లేదా స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లను వెతికి అందులోని రమ్మి, ఐపిఎల్ బెట్టింగ్, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్ అని ఎన్నో యాప్ లను ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో సరదాగా మొదలుపెట్టిన ఆటలు, చివరికి వాటికి అలవాటు పడి జీవితాన్ని బలితీసుకునే దిశగా వెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా టెలిగ్రామ్‌లో క్రికెట్ అనలిస్టు పేరుతో ఒకరు, సౌత్ ఇండియా కింగ్ పేరుతో మరొకరు విపరీతంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ప్రిడక్షన్స్ ఇవ్వ డం ద్వారా మీరు లాభాలు సంపాదించండంటూ తమ ఛానల్‌ను, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా టెలిగ్రామ్, వాట్సప్‌లో గ్రూపులు ఓపెన్ చేస్తూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌ను చాలామంది ఓవృత్తిగా ఎంచుకుం టున్నారు. కొందరికి అవి ఆన్‌లైన్ గేమ్స్ అని, క్రికెట్ బెట్టింగ్ అని తెలియకుండానే ఆ ఊబిలో చిక్కుకొని పోతు న్నారు. కరోనా సమయంలో పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు జరిగేవి. అలాంటి సమయంలో పాఠశాల విద్యా





ర్థులు మొదలుకొని కళాశాలలో చదువుకునేటువంటి యువతీ యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగ ఉపాధి లేనివారుఈజీగా డబ్బులు సంపాదించాలనే యావతో ఆన్‌లైన్ ఆటలకు ఆడిక్ట్ అయ్యి, వాటిపై ఇంట్రెస్ట్ చూపి, డబ్బులు డిపాజిట్ చేసి గేమ్‌ఆడితే సంపాదించవచ్చు అన్న ఆశలతో అప్పులు చేసి, అప్పుల ఊబిలో చిక్కుకొని కష్టపడి సంపాదించిన దాన్నంతా కూడా పోగొట్టుకుంటున్నారు. బెట్టింగులను ఆర్గనైజ్ చేసే వాళ్లు మొదట్లో కావాలనే కొంత డబ్బును యూజర్లు గెలుచుకునేలా చేస్తారు. దీంతో ఉత్సాహంగా మరింత సొమ్ము తెచ్చి గేమ్స్‌ఆడుతూ బెట్టింగ్ కడుతుంటారు. డబ్బులు పోగొట్టుకున్నా మళ్లీ రాకపోతాయని ప్రయత్నిస్తుంటారు. ఇలా నిండా మునిగిపోతుంటారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో చాలామంది యూత్ ఇలాగే నష్టపోయారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు వివిధ రకాల యాప్‌లు, వెబ్‌సైట్‌ల ద్వారా బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పుడు గూగుల్, పేటీఎం, ఫోన్ పేలో ద్వారా కూడా ఈ ఆటలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కొన్ని సంస్థలు పెయిడ్ గేమ్స్ ద్వారా గేమర్స్‌కి మనీ ఇస్తున్నాయి. ఆన్లైన్ రమ్మీ వంటి గేమ్‌లకు రూ. 50 నుంచి కూడా డబ్బు పెట్టే చాన్స్ ఉంటుంది. ముందు కొంత అమోంట్ గేమ్ ఆడే వారి అకౌంట్‌లోకి వస్తుంది. దీంతోపాటు గేమ్‌లకు రివార్డ్స్ ఇస్తూ ఆకర్షిస్తుంటారు. మొదట్లో రూపాయల్లో ఆశపెట్టి వందల్లో లాభాలు చూపి, తర్వాత వేళల్లో ఆశపెట్టి లక్షలు దోచేస్తున్నారు. నేటి యువతీ యువకులకు పలు రకాల ఆటలపై ప్రజల్లో ఉన్న మోజును క్యాష్ చేసుకునేందుకు నకిలీ యాప్‌లను సృష్టించి, వాటి ద్వారా కూడా సులువుగా డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ బెట్టింగ్ ఆన్‌లైన్ గేమ్‌ల ద్వారా, బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఇంకా కొన్ని యాప్‌లను గనుక చూస్తే ఇంకా ముందుకు వెళ్లి వారే రుణాలు ఇస్తూ మళ్లీ డబ్బులు కట్టించి అదే గేమ్‌కు బానిసగా కూడా చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు రాకముందు ప్రశాంతమైన జీవితం గడిపినటువంటి వారు స్మార్ట్‌ఫోన్లు వచ్చిన తర్వాత జీవితాలను బలి తీసు కుంటున్నారు. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు చైనా, సౌదీ అరేబియా, అరబ్ దేశాల నుంచి ఆపరేటింగ్ చేస్తుంటారు. ఇటీవల కాలంలో ఒక కలెక్టర్ దగ్గర పనిచేసేటువంటి గన్మెన్ సైతం అప్పుల ఊబిలో చిక్కి తన కుటుంబంతో సహా ప్రాణాలను కోల్పోయారు. ఇలా ఆన్ లైన్ మోసాలతో దేశంలో రోజుకు కొన్ని వందలమంది ప్రాణాలను కోల్పోవడం జరుగుతుంది. ఈ దారుణాలు జరుగుతున్నటువంటి క్రమంలో స్మార్ట్ ఫోన్ల వాడకం తగ్గించడం మేలు. స్మార్ట్ ఫోన్‌లో కానీ ఇంటర్నెట్లో కానీ తెలిసినటువంటి యాపులను వినియోగించడం మంచిది. తెలియని యాప్‌ల జోలికి వెళ్ళకూడదు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ బారినపడి లక్షల్లో అప్పులు చేసి తీర్చలేని పరి స్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఘటనలు అధికంగా జరుగుతున్న వేళ ఈ యాప్స్ ప్రమోషన్‌తో పాటు నిర్వాహకులపై చర్య లు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. అలాగే వారిపై చర్యలు తీసుకొని ఉజ్వల భవిష్యత్తు వున్న భవితను కాపాడుదామని ఆశిద్దాం. ●

# సమ్మిళిత ఆర్థిక వృద్ధికి ప్రోత్సాహం

తరిగోపుల నారాయణస్వామి

రెండువేల నలభైఏడు సంవత్సరం నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'జీరో పావర్టీ పి4' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్, స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యంలో భాగం. ప్రభుత్వ ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యాల ద్వారా, కుటుంబాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఈ పథకం ముఖ్య లక్ష్యాలు, పేదరిక నిర్మూలన, 2047నాటికి, ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం లేనిస్థితిని, సాధించడమే అంతిమ లక్ష్యం. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి, ప్రభుత్వం, అత్యంత ధనవంతులు తెలుగు ప్రవాసుల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, ఇంటి స్థలాలు, పారిశుధ్య సౌకర్యాలు, కుళాయి నీటి కనెక్షన్లు, హైస్పీడ్ ఇంటర్నెట్ యాక్సెస్ వంటి అవసరమైన సౌకర్యాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల అత్యంత వెనుకబడిన కుటుంబాలను, గ్రామస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు, అనేక విశ్లేషణలు సర్వేల ద్వారాగుర్తించినది. ఈ పథకంలో ప్రధానంగా లబ్ధిదారులను, బంగారు కుటుంబాలుగాను, వారికి సహాయ పడే వారిని, మార్గదర్శకులుగా పిలుస్తారు. మార్గదర్శుల పాత్ర లేదా సంపన్న వ్యక్తులు, ఈ కుటుంబాలకు ఆర్థిక సహాయం, మార్గదర్శకత్వం వృత్తి పరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. ఈ పథకంలో ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయం చేయదు. కేవలం ప్రభుత్వం అనుసంధాన వ్యవస్థగా మాత్రమే వ్యవహరిస్తుంది. అలాగే ఈ పథకంలో భాగస్వాములు అయిపోయినటువంటి కుటుంబాలకు, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సంక్షేమ పథకాలు ఈ కుటుంబాలకు అందుతాయి అని ప్రభుత్వం చెప్పినది. పి4 ప్లాట్‌ఫారమ్ ట్రాక్ చేయబడుతుంది, లావాదేవీలు మద్దతును సులభతరం చేస్తుంది. ఈ పథకం ద్వారా ఆశించిన ఫలితాలు, సమిష్టి ఆర్థిక వృద్ధి, ఈ కార్యక్రమం, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, సంపన్నులు వెనుకబడిన వారి మధ్య ఆర్థిక విభజనను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. సామాజిక ఉద్ధరణ అనగా కుటుం



బాలను శక్తివంతం చేయడంద్వారా, ఈ చౌరవ సంఘాలను ఉద్ధరించడానికి సామాజిక ఆర్థిక పురోగతిని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుంది. పేదరిక నిర్మూలనకు నమూనాగా ఈ పథకాన్ని భావించవచ్చు. భారతదేశంలో పేదరిక నిర్మూలన నమూనాలకు ఈ పథకం ఆదర్శంగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల మధ్య కొనసాగే ఈ కొత్త పథకం, బహుళ ప్రయోజనకారిగా తీర్చిదిద్దితే ,భారతదేశంలోనే ఒక సరికొత్త ఆర్థిక విప్లవం మొదలవుతుందని చెప్పవచ్చు. నిజానికి ప్రజల తలసరి ఆదాయం పెరగకపోవడానికి ప్రధాన కారణం. విద్య, వైద్యం, ఎక్కువగా ఇతర రంగాలకు చెందిన ప్రైవేటు వ్యవస్థల వైపు, ప్రజలు మళ్లడమే ప్రధాన కారణం. కనుక ఈ పథకం ప్రధానంగా, విద్య, వైద్యం, తదితర ప్రధాన రంగాల మీద దృష్టి సారిస్తే, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుంది. ఫలితంగా రాష్ట్రం ఆర్థికంగా సుసంపన్నం అవుతుంది. ఈ పథకంలో ప్రభుత్వం ఒక ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. కనుక కుటుంబాల తలసరి ఆదాయం పెరిగే వాటి మీద ప్రభుత్వం మార్గదర్శకాలు ఇవ్వవలెను. మార్గదర్శకులు ప్రధానంగా, బంగారు కుటుంబాలకు ప్రత్యక్షంగా ధన సహాయం చేయకూడదు. వారు చేసే సహాయంలో శ్రమతో కూడిన ఉపాధిని కల్పించవలెను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో, పాడి పరిశ్రమను ప్రోత్సహించటంలో భాగంగా బంగారు కుటుంబాలకు ఆవులను, గేదెలనుఅలాగే వృత్తిపరమైన కుటుంబాలకు ఆ వృత్తికి చెందినటువంటి ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. అలాగే మంచి విద్యను అందించుటకు సహాయం చేయవలెను. చైనా సామెత ఈ పథకంలో ముఖ్య భాగం కావలెను,' చేపలు ఇవ్వడం కన్నా, చేపను పట్టడం నేర్పించవలెను' అనే భావన ఈ పథకం ప్రధాన ఉద్దేశం కావలెను. అలాగే ఈ పథకం వలన కుటుంబాల సమాజ స్థితిగతులు మారుతున్నాయా లేదాఅనే విషయాన్ని నిశితంగా దృష్టిసారించి, ఈ పథకం అత్యంత ప్రయోజనకారిగా మారేటట్లు చూడవలసిన బాధ్యత, ప్రభుత్వ యంత్రాంగం మీద ఉన్నది. ఈ పథకం విజయవంతం అయితే, భారతదేశంలోనే సరికొత్త చరిత్ర లిఖించవచ్చు. కారణం, ఆర్థిక అసమానతలు లేని సమాజం తయారు చేయుటలో, విజయం సాధించవచ్చు. ఈ పథకం విజయవంతం కావాలి అంటే బంగారు కుటుంబం వారు ,మార్గదర్శకులు ఇచ్చే ప్రోత్సాహాన్ని చిత్తశుద్ధితో స్వీకరించి, శ్రమతో కూడినఉపాధి పొందే ప్రయత్నం చేయవలెను. ఈ విధంగా ప్రభుత్వం కూడా వారిని ప్రేరేపించవలెను. ఈ పథకం విజయవంతమై, సుసంపన్నమైన ఆంధ్రప్రదేశ్ తయారు కావాలి. ●

# ట్రంప్ నిర్ణయాలపై అమెరికాలో నిరసనలు




**వాషింగ్టన్, ఏప్రిల్ 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనాలోచిత నిర్ణయాలపై ఆ దేశంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల కోత, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం, మానవ హక్కులు, ఇతర అంశాలపై ట్రంప్‌తోపాటు బిలియనీర్ మస్క్ చర్యలపై అమెరికన్లు మండిపడుతున్నారు. ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ శనివారం వేల మంది నిరసనకారులు నార్త్‌కరోలినాలోని షాలెట్, మసాచుసెట్స్‌లోని బోస్టన్, వాషింగ్టన్ డిసి సహా పలు చోట్ల భారీ నిరసనలు చేపట్టారు. 'హ్యాండ్ ఆఫ్' పేరిట నిర్వహించిన ఈ నిరసనల్లో 150కిపైగా గ్రూపులు 1200 మంది పాల్గొన్నారు. ఆందోళనకారుల్లో పౌరహక్కుల సంస్థల ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ట్రాన్స్‌జెండర్లు, న్యాయవాదులు, దివ్యాంగులు, నిపుణులు ఉన్నారు. ట్రంప్ సర్కార్ నిర్ణయాలు సరిగా లేవని, ప్రజల అవసరాలతో పనిలేకుండా వ్యవహరిస్తోందని నిరసనకారులు మండిపడ్డారు. ట్రంప్ ప్రభుత్వం సరైన దిశలో నడవట్లేదని, భారీగా ఉద్యోగాల కోత వల్ల అమెరికాలో సేవలు, వనరులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, సామాజిక భద్రత, మెడికే ఎయిడ్, మెడికేర్, మాజీ సైనికుల హక్కులు, ఎల్‌జిబిటిక్యూ సమాజం ఇలా ప్రతిఒక్కటి నష్టంగా లేవని మండిపడ్డారు. ఈ నిరసనలపై శ్వేతసౌధం స్పందించింది. సామాజిక భద్రత, మెడికే ఎయిడ్‌లను ట్రంప్ ఎల్లప్పుడూ రక్షిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు ట్రంప్ పరస్పర టారిఫ్‌ల నిర్ణయం వేళ ప్రపంచ కుబేరుడు, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్ కీలక విషయాలను వెల్లడించారు. భవిష్యత్తులో అమెరికా, ఐరోపా చాలా సన్నిహితమైన, బలమైన భాగస్వామ్యాన్ని సృష్టించగలవని పేర్కొన్నారు. ఎలాంటి పరస్పర సుంకాలు లేని జీరో టారిఫ్ జోన్ ఏర్పడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీ లీగ్ పార్టీ ప్రతినిధులను ఉద్దేశించి ఓ వీడియో లింక్ ద్వారా మాట్లాడిన మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అమెరికాలో ఉద్యోగాల కుదింపు కొనసాగుతోంది. తాజాగా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌కు (ఐఆర్ఎస్) చెందిన 20,000 మంది ఉద్యోగులను తొలగించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇది దాదాపు 25 శాతంతో సమానం. శుక్రవారం నుంచే పౌర హక్కుల కార్యాలయం నుంచి ఈ తొలగింపులను అధికారులు ప్రారంభించారు. ఆ కార్యాలయాన్ని మూసివేసి అక్కడి ఉద్యోగులను చీఫ్ కౌన్సెల్ కార్యాలయానికి బదిలీ చేయాలని నిర్ణయించారు. గత ఫిబ్రవరి లో కూడా 7,000 మంది తాత్కాలిక ఉద్యోగులను ఈ విభాగం నుంచి తొలగించారు.

## ఆమరణ నిరాహార దీక్ష విరమించిన జగ్జీత్‌సింగ్ దల్లేవాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** దేశంలోని రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను ఆదివారం విరమించారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీతో పాటు పలు డిమాండ్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గతేడాది నవంబరు 26న ఆయన ఈ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దానిని విరమించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ సహాయమంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహెబ్ జిల్లాలోని సిర్హింద్‌లో నిర్వహించిన 'కిసాన్ మహా పంచాయత్'లో నిరవధిక నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు దల్లేవాల్ ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'ఆమరణ నిరాహార దీక్ష విరమించాలని మీరంతా నన్ను కోరారు. ఈ ఉద్యమాన్ని జాగ్రత్తగా నడిపేందుకు మీకు రుణపడి ఉంటాను. మీ సెంటిమెంట్లను నేను గౌరవిస్తూ ఈ దీక్షను పాటిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. సంయుక్త కిసాన్ మోర్చా. కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం)కలిసి ఏర్పాటు చేసిన వేదికలో కీలక నేతగా ఉన్న జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ కేంద్రం తమ డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ గతేడాది నవంబరు 26న నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం జనవరిలో రైతులను చర్చలకు ఆహ్వానించడంతో దీక్ష చేపట్టిన స్థలంలోనే వైద్యసాయం తీసుకొనేందుకు ఆయన అంగీకరించారు. కానీ, తన నిరాహార దీక్షను మాత్రం కొనసాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే శనివారం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ట్వీట్ చేశారు. కేంద్రంతో రైతు సంఘాల ప్రతినిధుల చర్చలు కొనసాగుతున్నాయని మే 4న ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దల్లేవాల్ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# అత్యాధునిక పంబన్ వంతెన ప్రారంభించిన ప్రధాని మోడీ

### కార్యక్రమానికి సిఎం స్టాలిన్ గైర్హాజర్



**చెన్నై, ఏప్రిల్ 6:** తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో రూ.535కోట్లతో ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పంబన్ వంతెనను ప్రధానిమోడీ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి సీఎం ఎంకె స్టాలిన్ గైర్హాజరయ్యారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి కేంద్రానికి తమిళనాడుప్రభుత్వానికి మధ్య వివాదంజరుగుతున్న క్రమంలో ప్రధాని కార్యక్రమానికి సీఎం హాజరుకాకపోవడం విశేషం. తమిళనాడులోని రామేశ్వరంలో కొత్త పంబన్ వంతెనను ప్రధాని మోడీ ప్రారంభించిన సమయంలోనే మరోచోట ఒక కార్యక్రమంలో పాల్గొన్న స్టాలిన్ ప్రసంగించారు. పార్లమెంటులో రాజ్యాంగసవరణతో న్యాయమైన పునర్విభజన అమలుచేయాలని డిమాండ్‌చేసారు. ఈ ప్రక్రియలో రాష్ట్రప్రజలకు ఉన్న భయాలను తొలగిస్తానని ప్రధాని హామీ ఇవ్వాలని కోరారు. పార్లమెంటరీ సీట్లలో తమ రాష్ట్రవాటాశాతంలో మార్పులేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2001లో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి పాటించిన నిబద్ధతను నిలబెట్టుకోవాలని కేంద్రానికి సూచించారు. 2026 జనాభా లెక్కలప్రకారం డీలిమిటేషన్ చేస్తే తమిళ నాడు ఇతర దక్షిణాదిరాష్ట్రాలు పార్లమెంటులో న్యాయమైన ప్రాతినిధ్యం కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేసారు. లోక్‌సభ నియోజ కవర్గాల పునర్విభజన 2026లో జరగనుంది. జనాభా లెక్కలు అనుసరించి విభిన్నకారణాలవల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. ఇటీవలే డిఎంకె నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాదిరాష్ట్రాలకు చట్టాల తయారీలోప్రాతినిధ్యం తగ్గుతుందని స్టాలిన్ ఆరోపించారు. సొంతదేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతా మన్నారు. ఈ సందర్భంగా తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకం కాదని న్యాయబద్ధంగా పారదర్శకంగా డీలిమిటేషన్‌చేయాలని తమ డిమాండ్‌చేస్తున్నట్లు తెలిపారు. భారత ప్రధాన భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పాంబన్ వంతెనను నేడు ప్రధాని మోడీ జాతికి అంకితంచేసారు. ఈ క్రమంలోనే రామేశ్వరం తాంబరం ప్రత్యేకరైలును ప్రారంభించగా అది కొత్త వంతెనపై పరుగులు తీసింది.

## దేశప్రజలకు ప్రధాని శ్రీరామనవమి శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశప్రజలకు శ్రీరామనవమిశుభాకాంక్షలు తెలియజేసారు. శ్రీరాముడి ఆశీస్సులు దేశప్రజలకు అన్ని ప్రయత్నాల్లో మార్గనిర్దేశనం చేస్తూనే ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తంచేసారు. ఆదివారం ఆయన తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్‌ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు చెప్పారు. అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు. ప్రభు శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ మనపై ఉంటాయి. మన అన్ని ప్రయత్నాల్లో ఆస్వామి మనకు మార్గనిర్దేశనం చేస్తుంటారు అని ప్రధాని పోస్టుచేసారు.




కాగా ప్రధాని మోడీ ఆదివారం రామనాథ స్వామి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పిఎంఒ ప్రకటించింది.

## కెనడా పార్లమెంటు తాత్కాలిక మూసివేత



**ఒట్టావా, ఏప్రిల్ 6:** కెనడా పార్లమెంటు భవనాన్ని తాత్కాలికంగామూసివేసినట్లు ఒట్టావా పోలీసులు వెల్లడించారు. ఆభవనంలోకి ముందురోజు గుర్తుతెలియని దుండుగుడు ప్రవేశించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా పార్లమెంట్ హిల్‌లోని తూర్పుబ్లాక్‌లోకి ప్రవేశించిన ఒక వ్యక్తి రాత్రంతా లోపలే ఉన్నాడన్నారు. అయితే ఆతడివద్ద ఆయుధాలు ఉన్నాయా లేదా అనే విషయంపై స్పష్టతలేదు. ముందురోజు రాత్రి ఒక వ్యక్తి పార్లమెంట్ భవనంలోకి చొరబటం గుర్తించిన అధికారులు అప్రమత్తం అయ్యారు. భవనం చుట్టూ పోలీసులను మోహరించారు. తూర్పుబ్లాక్‌లో ఉన్న సిబ్బంది మొత్తం ఒకే గదిలోకి చేరుకుని తాళాలు వేసుకోవాలని సూచించారు. భవనంలోని పలు ప్రదేశాలపై లాక్‌డౌన్ విధించారు. పార్లమెంటుకు సమీపంలోని రోడ్లని మూసివేస్తున్నామని ప్రజలెవరూ అటువైపు రావద్దని అధికారులు ఆదేశాలు జారీ చేసారు. ఆదివారం ఉదయం దుండగుడిని అరెస్టు చేసామని దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ఏప్రిల్ 28న జరగనున్న ముందస్తు ఎన్నికల నేపథ్యంలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ మార్చి 23న పార్లమెంటును రద్దు చేసారు. అక్టోబరు 27న జరగాల్సిన ఎన్నికలను దాదాపు ఆరునెలలకు ముందుగానే నిర్వహిస్తున్నారు. ఇవి సమీపిస్తున్నవేళ పార్లమెంట్ భవనంలోకి దుండగుడు ప్రవేశించడంపై అధికారులు పలుఅనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అపహరించడానికి దుండగుడు యత్నించి ఉంటాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అయోధ్య బాలరాముడికి 'సూర్యతిలకం'



**అయోధ్య, ఏప్రిల్ 6:** రాష్ట్రంలోని అయోధ్య ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట జరిగిన తర్వాత వచ్చిన రెండో శ్రీరామనవమి ఇది. స్వామి దర్శనంకోసం దేశవిదేశాలనుంచి భక్తులు పోటెత్తారు. ఈ ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదుటిపై సూర్యతిలకం చూసి భక్తులుపరవశించారు. అయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదిటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లుచేసారు. పరిమిత సంఖ్యలో పైపుల కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయశిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేసారు. అక్కడినుంచి పైపులోపలికి కాంతిప్రసరించి తిలకంవలే కనిపిస్తోంది బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు. ప్రతి శ్రీరామనవమిరోజున బాలరాముడి నుదిటిపై ఈతిలకం దిద్దేలా ఏర్పాట్లుచేసారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించేపరిజ్ఞానం తరహాలో గేర్‌టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దనే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించారు.

## మోడీ చర్చలతో శ్రీలంక నిర్బంధంలో ఉన్న జాలర్ల విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** మత్స్యకారుల విషయంలో భారత్, శ్రీలంకలమధ్య తరచూ వివాదాలు తలెత్తుతుంటాయి. పరస్పరం తమజలాల్లో వేట సాగిస్తున్నారంటూ జాలర్లను అదుపులోకి తీసుకోవడం జరుగుతూ వస్తోంది. తమ జలాల్లో వేటసాగిస్తున్నారని భారత జాలర్లను కొలంబో నౌకాదళ సిబ్బంది అదుపులోకి తీసుకున్న సందర్భాలు అనేకం. ఈక్రమంలోనే ప్రధానిమోడీ తన శ్రీలంక పర్యటనలోభాగంగా రెండు దేశాల మధ్య మత్స్యకారుల వివాదాలకు మానవతా ధృక్పథంతో పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని చాటిచెప్పిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలనడుమ సుహృద్భావ చర్యగా భారత్‌కు చెందిన 11 మంది జాలర్లను శ్రీలంక విడుదలచేసింది. శ్రీలంకపర్యటనలో ఆదేశ అధ్యక్షుడు కుమార దిసనాయకేతో ప్రధానిమోడీ భేటీ అయ్యారు. యుఎఇతో కలిసి ట్రింకోమలిని ఇంధనకేంద్రంగా అభివృద్ధి చేయడం, పవర్‌గ్రిడ్ ద్వారా అనుసంధానత వంటి ఒప్పందాలు చేసుకున్నారు. శ్రీలంక నిర్బంధంలో ఉన్న భారత మత్స్యకారులని వారి పడవల్ని వెంటనే విడుదల చేయాలని ప్రధాని కోరారు. నేడు దిసనాయకేతో కలిసి అనురాధ పురంలోని జయశ్రీ మహాబోధిని సందర్శించారు. అనంతరం మహో-ఒమన్ తాయ్‌లమధ్య అప్‌గ్రేడ్‌చేసిన రైల్వేలైన్ దిసనాయకేతో కలిసిప్రారంభించారు. ఆ తర్వాత భారత్‌కు బయలుదేరారు. తన పర్యటన రెండుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఊతం ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేసారు. శ్రీలంకనుంచి తిరుగుప్రయాణంలోభాగంగా ప్రధానిమోడీ విమానంనుంచి రామసేతును సందర్శించారు. ఎక్స్‌వేదికగా సంబంధిత విడియోను పోస్టుచేసారు. శ్రీలంకనుంచి తిరిగివస్తుండగా రామసేతును దర్శించే భాగ్యం కలిగింది. అయోధ్యలో బాలరాముడికి సూర్యతిలకం సమయంలోనే ఇది జరగడం విశేషం. ఈ రెండింటిని చూసిన అదృష్టం నాకు దక్కింది.

## బిజెపికి సుపరిపాలన ఒక్కటే అజెండా

### పార్టీ వ్యవస్థాపక దినోత్సవం రోజున మోడీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** దేశప్రజలంతా బిజెపి సుపరిపాలనను చూస్తున్నారని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో పార్టీ సాధించిన అనేక చరిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. బిజెపి 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశపురోగతికి వికసిత్‌భారత్ స్వప్నాన్ని సాకారంచేసుకునేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని చెప్పారు. కార్యకర్తలే మా పార్టీకి వెన్నెముక. వారిశక్తి ఉత్సాహం ప్రేరణదాయకం. కొన్ని దశాబ్దాలుగా పార్టీ బలోపేతంకోసం తమ జీవితాలను అంకితంచేసిన కార్యకర్తల సేవలు మరువలేనివి. దేశప్రజలు మా పార్టీ సుపరిపాలన అజెండానుచూస్తున్నారని మోడీ అన్నారు. ఇటీవలికాలంలో మేం సాధించిన విజయాల్లోనే ఇది ప్రతిబింబిస్తోందన్నారు. అవి లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికలైనా సరే. సమాజసర్వతోముఖాభివృద్ధి దిశగా మా ప్రభుత్వాలు సేవచేస్తూనే ఉంటాయని ప్రధాని మోడీ ట్వీట్ చేసారు. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రి అమిత్‌షాలుసైతం పార్టీశ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. 1980లో బిజెపిని స్థాపించారు. 1984లో జరిగిన జాతీయ ఎన్నికల్లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలు మాత్రమే గెలిచింది. అయితే అటల్ బిహారీ వాజ్‌పేయి ఎల్కే అద్వానీల నాయకత్వంలో అంచలంచెలుగా ఎదిగిన ఆపార్టీ 90ల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చింది. అనంతరం 2014నుంచి ప్రధానిమోడీ నాయ కత్వంలో వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుదీరింది.

## ఇంటి అద్దెల భారంపై స్పెయిన్‌లో నిరసనలు

### 50 శాతం తగ్గించాలని డిమాండ్

**మాడ్రిడ్, ఏప్రిల్ 6:** స్పెయిన్‌లో గృహ సంక్షోభం నేపథ్యంలో వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. స్పెయిన్‌లో ఇళ్ల అద్దెలు భరించలేనంతగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అద్దెలను 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. మాడ్రిడ్‌లో జరిగిన నిరసనల్లో దాదాపు 1.5 లక్షల మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, దేశవ్యాప్తంగా 40 నగరాల్లోనూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'హౌసింగ్ రాకెట్'ను అంతమొందించాలని, ఇంటి యజమానులే దోషులని, ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాలని నిరసనకారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాడ్రిడ్ అద్దెదారుల సంఘం ప్రతినిధి వలేరియారాకు మాట్లాడుతూ కాటలాన్



తీర ప్రాంత పట్టణాల్లో పెరిగిపోతున్న అద్దెలపై సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. 'ఇంటి వ్యాపారం ముగింపునకు ఇది నాంది' అని పేర్కొన్నారు. మన జీవితాలను, మన వనరులను మింగివేసే ఈ పరాన్న జీవి వ్యవస్థ లేకుండా మెరుగైన సమాజానికి ఇది నాంది కావాలని ఆకాక్షించారు. 1.4 మిలియన్ల స్పానిష్ కుటుంబాలు తమ ఆదాయంలో 30 శాతనికిపైగా ఇంటి అద్దెలకు చెల్లిస్తున్నారు. స్పెయిన్‌లో ఇటీవల గృహ సంక్షోభం అతిపెద్ద సామాజిక సమస్యగా మారింది. ఆస్తి ఊహాగానాలు (మూలధన లాభాలను పొందాలనే ఆశతో ఆస్తిని అమ్మడం, లేదా కొనడం), పర్యాటక అపార్ట్‌మెంట్ల అద్దెలు పెరగడమే ఇందుకు కారణం.
ప్రభుత్వ గణాంకాల ప్రకారం మాడ్రిడ్‌లో కనీసం 15 వేల టూరిస్టు అపార్ట్‌మెంట్లు అనధికారికంగా నడుస్తున్నాయి. స్పెయిన్‌లో ఇళ్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోవడంతో 30 యేళ్లలోపు ఉన్న 85 శాతం మంది యువత ఇప్పటికీ తమ తల్లిదండ్రులతోనే నివసిస్తున్నారు. బార్సెలోనాలో జరిగిన ఆందోళనల్లో ఇంటి అద్దెలను 50 శాతం తగ్గించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అలాగే, నిరవధిక లీజులు ఇవ్వాలని, ఆస్తి ఊహాగానాలకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

## ఆఫ్రికాదేశాలకు వీసాలు రద్దుచేస్తున్న అమెరికా..



**వాషింగ్టన్, ఏప్రిల్ 6:** అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటినుంచి డొనాల్డ్‌ట్రంప్ అక్రమ వలసదారుల కట్టడికి కఠిన చర్యలుచేపట్టారు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా తమ దేశంలో ఉంటున్నవారిని స్వదేశాలకు పంపించి వేస్తున్నారు. అక్రమంగా అమెరికాకు వచ్చిన ఆఫ్రికా పౌరులను ఇటీవలే తమ దేశాలకు తిరిగి పంపించారు. అయితే వారిని స్వీకరించడానికి పలు ఆఫ్రికా దేశాలు నిరాకరించాయి. దీనితో ట్రంప్ కన్నెర్ర చేసారు. యుఎస్‌కు వెళ్లిన ఆయా దేశాలపౌరులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వారి వీసాలను ట్రంప్ యంత్రాంగంరద్దుచేస్తోంది. ఇమ్మిగ్రేషన్ చట్టాల అమలును వేగవంతంచేసే ప్రయత్నాలలో భాగంగా ఈచర్యలు తీసుకుంటున్నట్లు యుఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కోరుబియో అన్నారు. డిపోర్టేషన్ పరంగా తన ప్రవర్తన మార్చుకుని సమస్యను పరిష్కరించేవరకూ దక్షిణ సూడాన్‌కు చెందిన వారి వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసామని కొత్త వీసాల జారీ ప్రక్రియను నిలిపి వేస్తున్నా మని మార్కో రుబియోప్రకటించారు. దక్షిణ సూడాన్ పాస్‌పోర్టు దారులకు అమెరికాలో ఉన్న అన్ని వీసాలకు కూడా విలువలేదు. ఇది తక్షణమే అమలులోకి వస్తుంది. వారు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత దాదాపు ఎనిమిదివేలమంది అక్రమ వలసదారులను అరెస్టుచేసినట్లు వైట్‌హౌస్ తెలిపింది. వీరిలో కొందరిని వెనక్కి పంపించగా మరికొందరు జైళ్లలో ఇంకొందరు నిర్బంధ కేంద్రాల్లో ఉన్నట్లు తెలిపింది. కొందరు విదేశీ విద్యార్థులు జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్నట్లు గుర్తించి స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ విదేశాంగశాఖ వారికి మెయిల్స్ పంపింది. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారికే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లోషేర్‌చేసిన విదానయర్థులను కూడా ఈ హెచ్చరిక సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. యునైటెడ్ స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ అమెరికా జాతీయ చట్టంలోని సెక్షన్ 221(ఐ)ప్రకారం వారి వీసాలు రద్దుచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

## చీతాలకు నీళ్లు పట్టించాడని ఉద్యోగం నుంచి డిస్మస్..

### కునో నేషనల్‌పార్క్ అటవీ అధికారుల వింతచర్య

**భోపాల్, ఏప్రిల్ 6:** మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్‌పార్క్‌లో చీతాలకు నీరు అందించి నందుకు ఒక డ్రైవర్ తన ఉద్యోగం కోల్పోయాడు. రాష్ట్ర అటవీశాఖకు చెందిన ఒక డ్రైవర్ కునో జాతీయ పార్కులోని చీతాలకు నీరు అం దించాడు. ఓచెట్టుకింద సేద తీరుతున్న జ్వాల అనే పేరున్న చీతా దాని నాలుగు పిల్లలను గమనించిన ఆతడు ఓ క్యాన్‌లో నీరుతెచ్చాడు. ఓపాత్రలో నీటిని నింపి వాటిని తాగమంటూ పిలిచాడు. దాహంతో ఉన్న ఆ వన్యప్రాణులు వాటిని తాగాయి. ఇందుకు సం బంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యా యి. నిజంగా గొప్పపని చేసాడని, మను షులు, వన్యప్రాణులమధ్య ఇలాంటి స్నేహపూ ర్వక బంధం ఉండాలని ఈదృశ్యం ముచ్చటగా ఉందంటూ కామెంట్లుకూడా వెల్లువెత్తాయి. అయితే ఆ డ్రైవర్‌పై ఉన్నతాధికారులు మాత్రం ఆగ్రహం వ్యక్తంచేసారు. ఆతడిని ఉద్యోగంనుంచి సస్పెండ్‌చేసారు. చీతాలకు నీరు అందించాలని గ్రామస్తులు అనుకుంటున్నారు. ఈ జీవాలు సహజంగానే ముప్పుకలిగించేవి కావని తెలుసుకుంటున్నారు. కానీ ఈ ప్రాంతం సహజ పర్యావరణ వ్యవస్థలో భాగమని వారంతా గ్రహించారు. వన్యప్రాణులతో స్నేహపూర్వకంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఇది ఏమాత్రం పద్ధతికాదని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే జ్వాల దానిపిల్లలు ఓ జంతువును వెంబడిస్తూ గ్రామంలోకి వచ్చేసాయి. పొలంలోని కొందరు వాటినిచూసి ఆందోళన చెందారు. గ్రామస్తులు చీతాలపై రాళ్లదాడికి తెగబడ్డారు. దీనితో అవి అక్కడినుంచి పారిపోయాయి. ఈక్రమంలోనే వాటికి నీటిని అందిస్తున్న విడియో బయటికొచ్చింది.



## ఢిల్లీలో ఉద్యోగులు అధిక సమయం ఆఫీసుల్లోనే..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** భారత్‌లో ఎక్కడా లేని విధంగా ఢిల్లీలో ప్రజలు అత్యధిక సమయం ఉద్యోగ కార్యకలాపాలకోసం వెచ్చిస్తున్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. భారత్‌లో సగటున ఉద్యోగి రోజుకు 455 నిమిషాలు అంటే 7.5 గంటలు ఉద్యోగవిధుల్లో గడుపుతుండగా ఢిల్లీలో మాత్రం రోజుకు 571 నిమిషాలు అంటే 9.5 గంటలు పనిచేస్తున్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలుశాఖ విడుదలచేసిన నివేదికలో స్పష్టం అయింది. ఈ పనిగంటల్లో ఇంటినుంచి కార్యాలయానికి వెళ్లిరావడానికి ఖర్చవుతున్న సమయాన్ని కూడా కలిపినట్లు టైమ్స్‌యూజ్ సర్వే నివేదిక తెలిపింది. యుపిలో పురుష ఉద్యోగులతో పోలిస్తే మహిళలు 72శాతం తక్కువ సమయం పనిచేస్తున్నారు. బీహార్‌లో ఇది కేవలం 71.6శాతంగా ఉంది. ఢిల్లీ, కేరళల్లో ఈ తేడా కేవలం 22శాతం, గోవాలో ఈతేడా 8శాతంగా ఉంది. గ్రామాల్లో 15-59 సంవత్సరాల వయస్కులు రోజుకు ఉపాధికోసం వెచ్చిస్తున్న సమయం సుమారు 424 నిమిషాలని తేలింది. పట్టణాల్లో 15-59 సంవత్సరాలవ వయసువరకూ ఉపాధికోసంరోజులో కనీసం 494 నిమిషాలు వెచ్చిస్తున్నారు. ఢిల్లీలో 9.5గం టలు, హర్యానాలో 8.2గంటలు, తమిళనాడులో 8 గంటలు, ఒడిశా, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో7గంటలు వెచ్చిస్తున్నట్లు సర్వేలో తేలింది.

## మధ్యప్రదేశ్‌లో శంకర్‌దాదా ఎంబిబిఎస్: ఏడుగురు మృతి

**భోపాల్, ఏప్రిల్ 6:** నకిలీ వైద్యుడు శంకర్‌దాదా ఎంబిబిఎస్ నిర్వాకంతో నెలరోజుల్లోనే ఏడుగురు వ్యక్తులు మృతిచెందిన సంఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. ఎన్.జాన్‌కెమ్ పేరుతో దమోహ్ పట్టణంలోని క్రిస్టియన్‌మిషనరీ ఆసుపత్రిలో ఓ వ్యక్తి గుండెవైద్యనిపుణుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి ఇంటివద్ద శస్త్రచికిత్సలు చేయించుకున్న ఏడుగురు రోగులు నెలరోజుల వ్యవధిలో మరణించినట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేయగా అసలు వైద్యుడేకాదని బయట పడింది. ఎన్.జాన్‌కెమ్ అనే ప్రసిద్ధి బ్రిటిష్ వైద్యుడి పేరు వాడుకుని నకిలీపత్రాలతో కార్డియాలజిస్టు అవతారం ఎత్తాడు. నిందితుడి అసలుపేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్. ఆతడుచేసిన ఆపరేషన్లకు ఆసుపత్రికి ఆయుష్మాన్ భారత్ నిధులు అందాయి. హైదరాబాద్‌లోనూ ఈతడిపై అనేక కేసులు నమోదయినట్లు గుర్తించామని, ఎన్‌హెచ్ ఆర్‌సీసభ్యుడు ప్రియాంక్ కనుంగో తెలిపారు.

## టార్గెట్ సాధించలేదని కుక్కలా నడిపించారు..

**తిరువనంతపురం, ఏప్రిల్ 6:** మార్కెట్ టార్గెట్లు రీచ్‌కానందుకు ఉద్యోగులను ఒక సంస్థ కఠినంగా శిక్షించింది. ఇందులోభాగంగా ఒక ఉద్యోగి మెడకు బెల్ట్ తగిలించి కుక్కమాదిరిగా నడిపించారు. కలకం రేపిన ఈ ఘటనపై అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. కేరళలోని కొచ్చినలో ఈ సంఘటన జరిగింది. ఒక ప్రైవేటు మార్కెటింగ్ సంస్థలో పనిచేసే ఉద్యోగులు తమ లక్ష్యాలను చేరుకోనందుకు పలు విధాలుగా శిక్షించారు. ఒక ఉద్యోగిని కుక్కమాదిరిగా మోకాళ్లపై నడిపించారు. నేలపై నాణేలను వేసి నాలుకతో పైకి తీయించారు. మరో ఉద్యోగి ప్యాంటును బలవంతంగా విప్పించారు. ఈ విడియోక్లిప్ సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీనితో అధికారులు స్పందించారు. రాష్ట్ర కార్మికశాఖ దీనిపై దర్యాప్తునకు ఆదేశించింది. హైకోర్టు న్యాయవాది కలత్తూరుజైసింగ్ ఫిర్యాదుమేరకు రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కూడా ఈ ఘటనపై కేసునమోదుచేసింది. మరోవైపు ఆ కంపెనీ



యజమానితో విభేదాలున్న మాజీ మేనేజర్ ట్రైనీ ఉద్యోగులతో ఈ విడియో రికార్డుచేయించడాని బాధిత ఉద్యోగి పోలీసులకు తెలిపాడు. నాలుగు నెలలకిందట తీసిన విడియో అని చెప్పాడు. ఆ మేనేజర్‌ను కంపెనీ తొలగించడంతో యజమానిపై ప్రతీకారం కోసం పాత విడియోను వైరల్‌చేస్తున్నారని ఆరోపించాడు. తాను ఇప్పటికీ ఆసంస్థలో పని చేస్తున్నానని అన్నాడు. అయితే ఆ ఉద్యోగితో బలవంతంగా ఆ కంపెనీ ఇలా వివరణ ఇప్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనితో వాస్తవం ఏమిటన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేరళ కార్మిక మంత్రి వి.శివన్‌కుట్టి సంబంధిత కంపెనీపై విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# రాష్ట్రంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**విజయవాడ,ఏప్రిల్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం నాడు ఘనంగా జరిగాయి. వేడుకల సందర్భంగా భక్తులు భారీగా ఆలయాలకు తరలి వచ్చారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వేడుకల కోసం ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. స్వాగత తోరణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతారాముల కల్యాణం కోసం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో భాజాభజంత్రీలు, వేదమంత్రోచ్ఛరణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణం జరిగింది. కృష్ణాజిల్లాలోని అపర భద్రాదిగా పేరుబడిన మోటూరులో శ్రీసీతారామ కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. గుడివాడ, మచిలీపట్టణం, గన్నవరం, తాడిగడప, కానూరుల్లోని శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి, విజయవాడలో దాదాపు ప్రతి డివిజన్‌లో ఉన్న రామాలయాల్లో, వైష్ణవాలయాల్లో నవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సత్యనారాయణపురం, , భావాజీపేట, కొత్తగుళ్ళు ప్రాంతంలో నవవి ఉత్సవాలు సాగాయి. ఒన్‌టౌన్(పాతబస్తీ)లో వీధి, వీధికి చలువ పందిళ్ళల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కల్యాణ ఉత్సవాలు జరిగాయి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు స్వగ్రామమైన చౌటపాళెంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో వెంకయ్యానాయుడు పాల్గొన్నారు. వెంకయ్యానాయుడికి వేద బ్రాహ్మణులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బ్రాహ్మణుల ఆశీస్సులను వెంకయ్యానాయుడు తీసుకున్నారు. కల్యాణం చూడటానికి భక్తులు భారీగా తరలి వచ్చారు.

కడపజిల్లా ఒంటిమిట్ట రామాలయంలో నవవి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. శ్రీరామనవమి సందర్భంగా కీలకఘట్టమైన ధ్వజారోహణకార్య క్రమం ఈరోజు ఉదయం 9 గంటలకు జరిగింది. ఈనెల 15 వరకు ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 11న సీతారాముల వారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. శ్రీరామనవమి రోజున కల్యాణంలేని ఏకైక ఆలయం ఒంటిమిట్ట కోదండ రామ స్వామి ఆలయమే. కాగా దేశవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో శోభాయాత్రకు పోలీసులు ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చారు. శోభాయాత్రలో డీజేలు, డ్రోన్స్‌పై నిషేధం విధించా ప్రఖ్యాత పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున విస్తృత ఏర్పాట్లు చేశారు. అభిజిత్ లగ్నమున స్వామి వారి కల్యాణం జరగనుంది. కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేపట్టారు. సీతారామలక్ష్మణులను దర్శించుకోడానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. రామతీర్థం సీతారామస్వామిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి దర్శించుకున్నారు. సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిసి అప్పలనాయుడు పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నవరం సత్యదేవుని సన్నిధిలో ఘనంగా సీతారాములు వారి కల్యాణ మహోత్సవం జరిగింది. శ్రీరాముని కల్యాణంలో పెళ్లి పెద్దలుగా సత్యనారాయణ స్వామి సత్యవతి అనంతలక్ష్మి అమ్మవారు కొలువు దీరారు. విశేష పూజలతో కల్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు, వేద పండితులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. నరసింహ నగర్‌లోని కోదండరామ స్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణులు విగ్రహాలకు ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం మహోత్సవం చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు. రామనామ స్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. ఏలూరులో సాహిత్య మండలి ఆధ్వర్యంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతోంది. శ్రీరామనవమి వేడుకల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తుల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సీతారాముల దర్శనం కోసం క్యూలైన్లలో భారీగా భక్తులు వేచి ఉన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గుంటూరు బృందావనం గార్డెన్స్ నుంచి ఆరు అగ్రహారం నందు శ్రీరామ నామ క్షేత్రం వరకు శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ యాత్రలో స్థానిక మహమ్మద్ నజీర్ అహ్మద్, గుంటూరు నగర ప్రజలు,

మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎక్కడికి అక్కడ మజ్జిగ వాటర్ ఏర్పాటు చేశారు... బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ప్రారంభమై పురవీధుల్లో ఊరేగించు కుంటు శోభయాత్ర బ్రాడీపేట, అరండల్ పేట, శంకర్ విలాస్, నాజ్ సెంటర్, జిన్నాటవర్, ఎన్టీఆర్ బస్టాండ్, లాలాపేట వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం మీదగా రామనామ క్షేత్రం వరకు శోభాయాత్రను కొనసాగించారు. ర్యాలీలో వస్తున్న వారికి మహమ్మద్ నజీర్ అహ్మద్, స్వయంగా మజ్జిగ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు... ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్రుడు, ఆంజనేయస్వామి జెండాలను చేతపట్టుకొని జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

# రైతులు దేశానికి వరం.. రైతు కష్టిస్తేనే అందరికీ ఆహారం..

ఏప్రిల్ 6 ప్రభాత వాభ్రారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయి. ఇలాంటి ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలను మన రైతులు ఆదరించి... ఆచరించడం పండుగ రోజు పొట్టేళ్ల పోటీలు, ఎడ్ల పోటీలు, ఎడ్ల బండ్ల ఫోటోలు లాంటి కార్యక్రమాలు నిర్వహించి వేడుకలు చేసుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర వెనుకబడిన సంక్షేమ శాఖ, జౌళి, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. ఆమె ఆదివారం జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యధావిధిగా గత ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేశారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిందని, మోటార్లకు మీటర్లు అమర్చారని, బస్సు ఛార్జీలు పెంచారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక, రాష్ట్రం వేగంగా అభివృద్ధి బాట పట్టిందన్నారు.. ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధుల, వితంతువుల పింఛన్ నెలకు రూ.4 వేలకు పెంచామని, తల్లికి వందనం పథకం త్వరలో అమలు అవుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. అభివృద్ధిలో భాగంగా పేద లు ధనికులుగా మారడానికి పి 4 పథకాన్ని అమలు లోకి తెచ్చారని అన్నారు. ఈ పథకాలలో దత్తత విధానంలో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని భరోసా ఇచ్చారు. మాపై నమ్మకంతో వోట్లు వేసి అధికారం ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాననీ అన్నారు. ఏది ఏమైనా సుస్థిర అభివృద్ధిలో ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. శ్రీరామనవమి పండుగల పురస్కరించుకొని ప్రతి ఏడాది నిర్వహించే ఎడ్లబండ్ల పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తో పాటు కర్ణాటక ప్రాంత 63 మంది రైతులు సైతం ఈ పోటీల్లో పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన నేపథ్యంలో మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజేతలు వీళ్లే.... వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోటీదారుల్లో మొదటి బహుమతి గోరంట్ల మండలం ఖాజాపురం గ్రామానికి చెందిన రైతు కుళ్లాయప్ప దక్కించుకోగా లక్ష ప్రోత్సాహక బహుమతి



అందజేశారు.. అలాగే రెండవ బహుమతి ని బుల్లెట్ షావుకారి అనే రైతు దక్కించుకోగా అతనికి రూ, 70 వేలు, మూడో బహుమతిని ఆంధ్ర కదంబ అనే రైతు దక్కించుకోగా అతనికి రూ, 50 వేలు, నాలుగవ బహుమతిగా రూ, 40 వేల ప్రోత్సాహక బహుమతులను మంత్రి సవితమ్మ, ఆలయ చైర్మన్ మరియు కార్యక్రమాల నిర్వాహకులు శంకర్ లాల్ నాయక్ ల చేతులు మీదుగా విజేతలకు అందజేశారు.

## వాడవాడలా శ్రీరాముని కల్యాణం

**విజయవాడ, ఏప్రిల్ 6:** ఎండలు మండుతుండగా హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చలువ పందిళ్ళతో పాటు మంచినీటి సదుపాయం, గాలివీచే లా ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే దారిలో చక్కటి ఏర్పాట్లు చేశారు. కళ్యాణ వేదికను చక్కగా అలంకరించారు. సంప్రదాయాల్ని ఉట్టిపడేటట్లు రూపకల్పన చేశారు. వేద పండితులు వేద మంత్రాల్ని పఠిస్తుండగా ప్రత్యేక వ్యాఖ్యాత సీతారాముల కళ్యాణానికి సంబంధించి భక్తులకు



వివరిస్తుండగా భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. సంప్రదాయ పద్దతిలో వివాహాల తంతును నేటి తరం కూడా చూశారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ మధ్యాహ్నం 12గంటల సమయంలో అభిజిత్ ముహూర్తంలో స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల మధ్య నూతనవధూవరులుగా ఉన్న సీతారాములపై ముత్యాలతలంబ్రాలు పోస్తూ వేడుకగా నిర్వహించారు. రెండేళ్ల తరువాత భక్తుల భాగస్వామ్యంతంతో నిర్వహించిన ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కళ్యాణ వేదికపై ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు ఆశీనులు కాగా సంప్రదాయబద్ధంగా జరిగిన వివాహానికి విశేషంగా భక్తులుహాజరయ్యారు. అనంతరం స్వామి అమ్మవార్ల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు భక్తులకు వితరణ గావించారు. ఈ సందర్భంగా ఇఓ టి.బాపిరెడ్డి మాట్లాడుతూ అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కళ్యాణోత్సవానికి విచ్చేసిన భక్తులకు పసుపుకుంకుమ, పసుపుదారాలను అందించడంతో పాటు తీర్థప్రసాదాలను అందించారు. శ్రీకాళహస్తి అభివీద్ది చెందుతున్న ప్రాంతం అని ఇక్కడ ఆలయం పరిపాలనతో ముడిపడి ఉందన్నారు. పట్టణం అభివృద్ది ఓ వైపు కాగా ఆలయం స్పందన ఎంతో ఉండాల్సి ఉందన్నారు. ప్రతి ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాల్లో బిజెపి ఎంఎల్‌సి జాతీయ కార్యవర్గ సభ్యులు సోమువీర్రాజు, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట, చంద్ర కోటలు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్

**విజయవాడ,ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల మాటకు విలువనిచ్చిన పాలనతో ఆనాడే ప్రజాస్వామ్య ప్రాధాన్యతను తెలియజేసాడు శ్రీ రామచంద్రుడని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. పాలకుడు ఎప్పుడూ ప్రజలకు ఆదర్శనీయుడుగా ఉండాలని తన పాలన ద్వారా తెలియజేసిన సుగుణాభిరాముని చరిత్రను ఈ సందర్భంగా మననం చేసుకుందామని పిలుపునిచ్చారు. వాడవాడలా జరిగే నవమి వేడుకలు గ్రామాల్లో కొత్త శోభను ఆవిష్కరించాలని కోరుకుంటున్నారు. ఆ సీతారాముల దయతో ఇంటిల్లిపాది ఆనంద ఆరోగ్యాలతో చల్లగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## హాథీరాంజీమఠంలో రామనవమిపూజలు



**తిరుమల,ఏప్రిల్ 6ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామితో పాచికలు ఆడిన హాథీరాంబావాజీ మఠంలో ఆదివారం ఉదయం శ్రీరామనవమి వేడుకలు విశేషంగా జరిగాయి. మఠం మహంతు ఓంప్రకాశ్‌దాస్, కృష్ణదాస్‌లు మఠంలోని సీతాలక్ష్మణ ఆంజనేయ శ్రీరామచంద్రమూర్తి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ గావించారు. భక్తులు భజనలతో జైశ్రీరామ్ నినాదంతో మఠం మార్మోగింది.

## రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ.ఏప్రిల్6,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి ఆశీస్సులతో ప్రజలకు సకల శుభాలు కలగాలని, ధర్మ మార్గంలో నడవగల ఆత్మబలం లభించాలని ప్రార్థించారు. పవిత్ర శ్రీరామ నామాన్ని నిత్యం జపిస్తూ జీవితాన్ని ధర్మ మార్గంలో నడిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడి బాటలో నడవాలని సూచించారు. రాముడు చూపించిన ధర్మ మార్గాన్ని అనుసరిస్తే అందరి జీవితాల్లో శాంతి, ఆనందం, విజయాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. శ్రీరామచంద్రుడు తన భక్తులకు ఎల్లప్పుడు రక్షణ కల్పిస్తాడని, ఆయన ఆశీస్సులతో ప్రజలు జీవితాంతం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ భగవంతుడిని కోరుకున్నారు.

## సీమ మీదుగా చర్లపల్లి-తిరుపతి మధ్య బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 6,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ చర్లపల్లి-తిరుపతిల మధ్య ప్రత్యేకంగా బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07017ప్రత్యేక బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6నుంచి మే 30వరకు ప్రతి శుక్ర, ఆదివారాల్లో రాత్రి 9.15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శని, సోమవారాల్లో ఉదయం 10.10గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07018ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7నుంచి మే 31వరకు ప్రతి శని, సోమవారాల్లో సాయంత్రం 4.40గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి ఆది, మంగళవారాల్లో ఉదయం 7.10గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో మల్కాజిగిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో నిలుస్తాయి.

## ఎపిలో మే నెలలో ఉపాధ్యాయుల బదిలీలు

**విజయవాడ ఏప్రిల్ 06 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉపాధ్యాయులకు వచ్చే మే నెలలో బదిలీలు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది వారి బదిలీలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. మొదటిసారి ఈ చట్ట ప్రకారం బదిలీలు చేయబోతున్నారు. జీఓ-117 ను రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా తీసుకునే చర్యలపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈసారి ఆదర్శ ప్రాథమిక పాఠశాలల విధానం తీసుకురాబోతున్నారు. అందుకు అనుగుణంగా ఉపాధ్యాయుడల సర్దుబాటు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1-5 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున కేటాయిస్తూ ఈ విధానాన్ని తీసుకొస్తున్నారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియ 95% పూర్తయింది. 430 బడులకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. 7500 పైగా ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. వార్డు గ్రామ పంచాయతీకో బడి ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రక్రియ మొత్తం ఈ నెల 30 నాటికి ముగిసే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను ఈ నెల 20 నాటికి పూర్తి చేయనున్నారు. ఇప్పటికే పలుమార్లు వాటిని విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించారు. మరోసారి సరిచూసుకొని, తుది జాబితాలను విడుదల చేస్తారు. మరోపక్క ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు , ఉపాధ్యాయ పోస్టుల హేతబద్దీకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆదర్శ పాఠశాలలకు పోస్టుల సర్దుబాటు విద్యార్థుల సంఖ్య ఆధారంగా అవసరమయ్యే బడులకు పోస్టులను మార్పు చేస్తారు. దీనికి ఆర్థిక శాఖ అనుమతి తీసుకున్న అనంతరం పాఠశాలల్లో పోస్టులపై స్పష్టత వస్తుంది. దీనిప్రకారం బదిలీలు చేపడతారు.

## కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం - హాజరైన భక్తజనం

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పట్టాభి రామమందిరంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం 'సీతారాముల కళ్యాణం' అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో మూడు రోజుల పాటు ఇఓ డి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. ఆలయానికి అనుబంధంగా నెహ్రూవీధిలోని పట్టాభిరామాలయ ఆలయ ఆవరణలో చక్కగా చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. విశేషంగా ప్రచారం నిర్వహించారు. ఇఓ టి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులచే సంకల్పం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

## ఏపిలో దళిత క్రైస్తవులకు రక్షణ కరువు

విజయవాడ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో దళిత క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందని డిబిసి జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారని, యాక్సిడెంట్ కాదంటూ వ్యాఖ్యానించారు. ఎన్డీయే పాలనలో ఆర్టికల్ 21 హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఈ కేసును సుమోటో గా స్వీకరించి విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. దళిత జాతుల రక్షణకు తమ గళం పెద్ద ఎత్తున వినిపించకుంటే బానిసత్వం తప్పదని హెచ్చరించారు.

## పంట పొలాల్లో భారీగా భాస్వరం

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తెలంగాణలో వ్యవసాయ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. రాష్ట్రంలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకు పైగా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పొలాల్లో చల్లుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సాగునీరు, నేల మాత్రమే కాకుండా పర్యావరణంలోకి సైతం కాలుష్యం విడుదలై పలు సమస్యలు ఉత్పత్తన్నమవుతున్నాయని అధికారులు గుర్తించారు.

## బడ్జెట్ మార్గదర్శకాలు విడుదల చేసిన ఎపిఆర్థిక శాఖ

**విజయవాడ ఏప్రిల్ 06 ప్రభాతవార్త ప్రతినిధి:** కొత్త ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెట్ మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ప్రతి హెడ్ ఆఫ్ ఎకౌంట్ కింద నాలుగు త్రైమాసికాల్లో విడుదల చేసే నిధులు మొత్తం బడ్జెట్ కేటాయింపులకు మించి ఉండకూడదు. తొలి త్రైమాసికంలో మొత్తం కేటాయింపుల్లో 35% మించ బడ్జెట్ నిధులు విడుదల చేయకూడదు. రెండో త్రైమాసికం పూర్తయ్యేసరికి 55% మించి బడ్జెట్ నిధులు విడుదల చేయకూడదు. మూడో త్రైమాసికం పూర్తయ్యేసరికి 75% మించి నిధులు విడుదల చేసేలా బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇవ్వకూడదు. ఒక వేళ ఈ పరిమితిని దాటాల్సి వస్తే ఆర్థికశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా ప్రభుత్వశాఖ నుంచి స్పష్టమైన ప్రతిపాదనలు పని ప్రణాళికతో కూడిన సమగ్ర వివరాలు సమర్పించిన తర్వాత మాత్రమే ఉత్తర్వులు ఇస్తారు. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు.

## వక్ఫ్ పేరుతో జరిగిన మోసాలకు చెక్ బిల్లు ఆమోదం దేశ చరిత్రలో కీలక ఘట్టం జెపిసి సభ్యురాలు, ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** వక్ఫ్ పేరుతో జరిగిన మోసాలకు ఈ చట్టంతో చెక్ పడిందని, దేశ చరిత్రలో మరో కీలక ఘట్టం, కీలక అధ్యాయం లిఖితమైందని, వక్ఫ్ సవరణ బిల్లుకు శ్రీరామ నవమి రోజునే చట్టబద్దత కల్పించడం శుభతరుణం అని వక్ఫ్ సవర్ణ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలోని వేలాది మంది వక్ఫ్ బాధితులకు న్యాయం జరగబోతోందని, దేశంలో వక్ఫ్ పేరుతో లిటిగేషన్ లో ఉన్న వేల ఎకరాల భూములకు రిలీఫ్ రాబోతోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల ఆస్తులు, మసీదులు, కబరస్తాన్‌లు తీసుకుంటారు, గుంజుకురాని జరిగిన ప్రచారం అవాస్తవం అని, ఇలాంటివేమీ లేవని ఇప్పటికైనా ముస్లిం సోదరులు, ప్రజలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. అందరికీ న్యాయం చేసేందుకే.. వక్ఫ్ బోర్డు ఏర్పాటు ఉద్దేశ్యం ఇన్నాళ్లు నెరవేరలేదని, ఇకపై అసలైన ముస్లిం మహిళలు, వితంతువులకు న్యాయం జరగనుందన్నారు. వక్ఫ్ పేరుతో ఇన్నాళ్లు కొందురు చేసిన అక్ర మాలకు చెక్ పడిందని, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన సందర్భంగా దేశ ప్రజలందరికీ ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదం తర్వాత ఇవాళ దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదం తెలపడం హర్షనీయం, అభినందనీయమన్నారు. వక్ఫ్ బిల్లుకు చట్టం రూపం ఇస్తూ ఉత్తర్వు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వక్ఫ్ బిల్లు చట్టం రూపంలో తీసుకురావడంలో ప్రత్యేక కృషి చేసిన ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, మైనారిటీ శాఖ మంత్రి కిరన్ రిజిజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు.

## శ్రీరాముడు, సీతాదేవి సమాజానికి మార్గదర్శకులు: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 6:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు, సీతాదేవి సమాజానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. తెలంగాణ ప్రజలకు శ్రీరాముడి ఆశీస్సులు ఉండాలని, శాంతి, సంతోషాలు, సామరస్యాలు, సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీరాముడి త్యాగాలను కొనియాడారు. శ్రీరాముడు ఎంతో పవిత్రమైన జీవితాన్ని గడిపారని, భారతీయ కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచారని తెలిపారు. వైవాహిక విలువలను నిలబెట్టడంలో, సమాజ శ్రేయస్సు కోసం త్యాగం చేయడంలో ఈ జంటను ఆదర్శప్రాయమన్నారు.

# బిసి రిజర్వేషన్ చట్టబద్ధత కోసం ప్రధాని మోడీతో ఒప్పించాలి

### నోటికి వచ్చినట్లు మాట్లాడకు.. ఖబడ్దార్! బండి సంజయ్

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఘాటు స్పందన

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్‌కి దమ్ముంటే బిసి 42 శాతం రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్లో చేర్చేలా చట్టబద్ధత కోసం ప్రధానిని ఒప్పించాలి, ఆయనకు దమ్ముందా అని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బిజెపి నేతలు బిసి నేతల ధర్నాకు మొహం చాటేశారని కేంద్రమంత్రి సంజయ్‌కు టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఘాటు కౌంటర్ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేసిన పనులు మర్చిపోయావా బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని, బండి సంజయ్ ఖబర్దార్ అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ ఏదైనా సమష్టి నిర్ణయాలు ఉంటాయని ఆయన వివరించారు.

అసెంబ్లీ పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల వలె స్థానిక



సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ బిఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకొన్నాయని ఆరోపించారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేకనే రహస్య మిత్రులు బిఆర్‌ఎస్ తో చీకటి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. బండి సంజయ్‌లో రోజురోజుకు అభద్రత భావం పెరిగిపోతుందని అన్నారు. బండి సంజయ్ మోడీ, అమిత్ షా అనుమతి లేకుండా కనీసం టిఫిన్ కూడా చెయ్యడని అపహాస్యం చేశారు. సొంత పార్టీ కార్యకర్తలే బండి సంజయ్ వైఖరిపై గుర్రుగా ఉన్నారని చెప్పారు. అధ్యక్ష పదవి రాదని తెలిసి బండి సంజయ్ ఆగమాగం అయితుండని విమర్శించారు.

గుర్తింపు కోసమే తాను కేంద్రమంత్రిని అని మర్చిపోయి దిగజారి బండి సంజయ్ మాట్లాడుతుండని అన్నారు. బీజేపీలో ఉనికి కోసం బండి సంజయ్ ఆరాటపడుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి బండి సంజయ్‌కి కనిపించకపోవడం విడ్డూరం అని ఆవేదన చెందారు. సుదీర్ఘ కాలం అయినా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నియామకం చేసుకోలేని బిజెపి కాంగ్రెస్ హై కమాండ్ గురించి మాట్లాడే హక్కే లేదని అన్నారు. తెలంగాణపై రేవంత్‌రెడ్డి పూర్తి పట్టు సాధించి బట్టే రిజర్వేషన్లు, వర్గీకరణ బిల్లులకు ఆమోదం లభిం చిందని అన్నారు. అవగాహన లేకుండా బండి మాటా ్లడుతున్నారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అంశం ఉన్నత న్యాయ స్థాన పరిదిలో ఉంది. ప్రభుత్వం కమిట్ వేసింది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. మైనార్టీ హక్కుల కోసం నిలబడి కాంగ్రెస్ వక్ఫ్ బోర్డు బిల్లు పై నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ సంస్థలను నయన భయానా బెదిరించి నిధులు రాబట్టుకున్న బీజేపీ నంబర్ వన్ గా నిలిచిందని స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. సన్న బియ్యం బిజెపి ఇస్తుంటే దేశం మొత్తం ఇవ్వచ్చు కదా అని ఆయన ప్రశ్నించారు. సన్న బియ్యంతో తెలంగాణలో నిరుపేదలకు అసలైన పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని మహేష్‌కుమార్ అభివర్ణిం చారు దేశ చరిత్రలో నిలిచిపోయే కుల గణన, బిసి బిల్లు, ఎస్సీ వర్గీకరణ సన్నబియ్యాన్ని కాంగ్రెస్ హయంలో అమలు అయ్యాయని ఆయన అన్నారు.

## వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం

### పాల్గొన్న జికెఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ రాజశేఖర్

**దేవరకద్ర, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పరిధిలోని చిన్న రాజమూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద ఆదివారం సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో రాష్ట్ర మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి, జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోన రాజశేఖర్ పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో ఆంజ నేయస్వామి టెంపుల్ ఆవరణలో ఆలయ అర్చకులు గ్రామస్తుల సహకారంతో కల్యాణఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సీతారాములకు నూతన వస్త్రాలతో కళ్యాణం జరిపించారు. ఎక్కడ చూసినా రామ రామ జపంతో ఆలయం పరిసరాలు మార్మోగాయి. అర్చకులు హోమముతో సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ రహదారులకు అవసరమైన

# భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయండి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నిర్మించనున్న వాటితోపాటు నిర్మిస్తున్న వివిధ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిచేసి ఆయా రహదారుల నిర్మాణానికి సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఒక బహిరంగ లేఖను ముఖ్య మంత్రికి రాసారు. మాజీ ఉపప్రధాని, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో 17 సెప్టెంబరు, 1948న నాటి నిజాం నియంతృత్వ పాలన నుంచి విముక్తిని పొంది భారతదేశంలో విలీనమైనప్పటి నుంచి 2014 లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటి వరకు దాదాపు 66 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 2,500 కిలోమీటర్ల పొడ వున జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు.

2014 లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఈ 11 సంవత్సరాల కాలంలో మోడీ నాయకత్వంలో మరో 2,500 కిలోమీటర్లకు పైగా పొడవైన జాతీయ రహదారులను నిర్మించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పట్ల భారత ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ఇది తెలియజేస్తుందన్నారు. ఇవే కాకుండా, రాష్ట్రంలో మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయి. అందులో రీజనల్ రింగ్ రోడ్డు కాకుండా రూ.12,619.27 కోట్ల అంచనా వ్యయంతో 691.52 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న వాటితో పాటు నిర్మిస్తున్న 16 జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశలలో (మంజూరు చేయబడ్డాయని, మరికొన్ని బిడ్డింగ్ దశలో ఉండగా, మరికొన్ని మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి) ఉన్నాయన్నారు. ఈ 16 జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణానికి 1,550.529 హెక్టార్ల భూమి అవసరం ఉందని, ఈ భూమి సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ/జాతీయ రహదారుల సంస్థ అధికారులు అనేకసార్లు లేఖలు రాసినట్లు తెలిపారు. అయినప్పటికీ, ఇప్పటి వరకు 904.097 హెక్టార్ల భూమిని మాత్రమే కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ/జాతీయ రహదారుల సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేయడం జరిగిందన్నారు. ఇంకా 646.432 హెక్టార్ల భూమిని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ/జాతీయ రహదారుల సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేయవలసి ఉందని, ఆయా జాతీయ రహదారి ప్రాజెక్టుల వివరాలను ఈ లేఖకు అనుబంధంగా మీకు పంపిస్తున్నాను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ 11 సంవత్సరాల కాలంలో లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి, వేలాది కిలోమీటర్ల పొడవున కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన జాతీయ రహదారుల ద్వారా ఆయా ప్రాంతాలలో సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. అంతేకాకుండా అనేక ప్రాంతాలలో ఉన్న ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయాయి. రహదారి ప్రమాదాలు కూడా చాలా వరకు తగ్గాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు ఉంటే, అందులో 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుంది. అదే విధంగా ప్రస్తుతం నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అవసరమైన భూమిని కూడా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో సేకరించి ఇస్తే ఆయా రహదారి ప్రాజెక్టులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలుగా ఉంటుందన్నారు.

దీంతో రాష్ట్రం మరింత అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగడానికి వీలవు తుందని లేఖలో పేర్కొన్నారు. కావున, ఈ విషయంలో మీరు వ్యక్తిగతంగా చొరవ చూపించి, ఆయా జాతీయ రహదారి ప్రాజెక్టులకు అవసరమైన భూమిని సకాలంలో అందించి, ప్రాజెక్టులు అనుకున్న సమయానికి పూర్తి చేయటానికి వీలుగా చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

# సమర్థ పాలన ఘనత బిజెపిదే

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేశంలో సమర్థవంతమైన పాలన అందించిన ఘనత బిజెపికే దక్కుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6వ తేదీన అటల్ బిహారీ వాజ్ పేయి అధ్యక్షతన బిజెపిని ప్రారంభించుకోవడం జరిగిందని, ఆరోజు చాలామంది పార్టీని అవహేళనగా చూశారు. పార్టీ అధికారంలోకి వస్తుందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్నామన్నారు. బిజెపికి ఒక ప్రత్యేకమైన సిద్ధాంతం ఉంది. దేశాన్నిపరమవైభవ స్థితికి తీసుకెళ్లేందుకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు, ప్రపంచమంతా భారతదేశ గౌరవాన్ని పెంచేందుకు, దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యసాధనలో భాగంగా భారతీయ జనతా పార్టీని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఇక్కడ మొదటి అధ్యక్షుడిగా రాయలసీమకు చెందిన డిఎస్‌పిరెడ్డి బాధ్యతలు స్వీకరించారన్నారు. అనేకమంది బిజెపి కార్యకర్తలు నక్సలైట్లకు, పాకిస్తాన్ ఐఎస్‌ఐకు వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణాలు అర్పించారు. జాతీయ భావజాలం కోసం, పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన వారందరికీ నివాళులర్పిస్తున్నామన్నారు. పార్లమెంటులో ఒక్క ఓటు తగ్గితే, వేరే పార్టీలకు చెందిన నాయకులు, పార్లమెంటు సభ్యులు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా, ఆ మద్దతును నిరాకరిస్తూ ఒక్క ఓటుతో ప్రధానమంత్రి పదవిని, కేంద్ర ప్రభుత్వాన్ని వదులుకున్న చరిత్ర భారతీయ జనతా పార్టీది, నైతిక విలువల కోసం, ఉత్తమ విలువలతో పనిచేసే పార్టీ బిజెపి అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సమర్థవంతమైన పాలన అందించిన ఘనత బిజెపికి దక్కుతుందన్నారు. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుందని పేద ఇంట్లో టాయిలెట్ నుంచి చంద్రయాన్ వరకు దేశం ఎదుగుతున్నామన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్థిక సంస్కరణలు, విదేశీ దౌత్యనీతి ఇలా అనేక రకాలుగా మోడీ నేతృత్వంలో నభూ తో న భవిష్యత్ అనే విధంగా అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారు. అవినీతి లేకుండా, సమర్థవంతమైన పాలన అందించిన ఘనత బిజెపిదే అన్నారు. తెలంగాణలో 45 సంవత్సరాల తర్వాత బిజెపికి అవకాశం రాబోతుందన్నారు. టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తెలంగాణను పరిపాలించాయి. ఇప్పుడు కాంగ్రెస్ పరిపాలిస్తోంది. కానీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో, న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంలో ఆ పార్టీలన్నీ విఫలమయ్యాయి. అందుకే, తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జెండాను ఎగురవేసేలా ప్రజలు, మేధావులు, విద్యావంతులు, కవులు, కళాకారులు అందరూ ఆలోచన చేయాలన్నారు. ఏప్రిల్ 14 వరకు బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించి, పార్టీ కార్యకర్తలు వారి ఇండ్లపై పార్టీ జెండాను ఆవిష్కరించాలి. సీనియర్ కార్యకర్తల ఇండ్లకు వెళ్లి వారి ఆశీస్సులు తీసుకొని, వారిని సత్కరించాలన్నారు. మరికొందరు కొత్త కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవాలి. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలను, ఏప్రిల్ 14 నుంచి 22 వరకు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపునకు జిఐ

## దరఖాస్తుకు ఉద్యాన యూనివర్సిటీ నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బాలానగర్ సీతాఫలం, ఆర్మూర్ పసుపునకు జిఐ ట్యాగ్ కోసం దరఖాస్తునచేయాలని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది. ఇటీవలే వరంగల్ చపాటా మిర్చికి జిఐ గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో సీతాఫలం, పసుపుపై అధ్యయనాన్ని మరింత ముమ్మరం చేసినట్లు తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. బాలానగర్ అడవుల్లో పుట్టిన సీతాఫలం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు విస్తరించింది. ఈ సీతాఫలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రుచి నాణ్యతకు పేరొందిన ఈ సీతాఫలాలు ఇతర రాష్ట్రాలు, వివిధ దేశాలకు ఎగుమతి చేస్తుంటారని తెలిపారు. అలాగే ఆర్మూర్ పసుపునకు కూడా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా మొక్క ప్రత్యేక లక్షణాలు, సాగు విస్తీర్ణ, ప్రాంత భౌగోళిక, వాతావరణ పరిస్థితులపై సమాచారాన్ని సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా దేశ వ్యాప్తంగా 697 రకాల ఐటెమ్స్‌కు జిఐ ట్యాగ్ ఉండగా, అందులో 198 వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి.



# గ్రీస్ ప్రేరేపిత లగ్జరీ, బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తుక్కుగూడ ఓఆర్ఆర్ సమీపంలోని లెమూర్ రోడ్‌లో 20 ఎకరాల్లో బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ గ్రీస్ వైభవం నుంచి ప్రేరణ పొందిన ఆర్కిటెక్చరల్ మాస్టర్‌పీస్ బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని అన్వయా కన్వెన్షన్‌లో విడుదల చేశారు. పుష్పా దర్శకుడు సుకుమార్, జాతీయ అవార్డు గ్రహీత డైరెక్టర్ వంశీపైడిపల్లి చేతుల మీద ఈ బ్రోచన్‌ను ఆవిష్కరించారు. బ్రిడ్జ్ గ్రూప్ డైరెక్టర్ ఉజ్వాల్‌రావు మాట్లాడుతూ మేము గ్రీస్‌కు చెందిన అసమానమైన అందం, చక్కదనాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాలనుకున్నాం. బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ ప్రతిఅంశం, దాని అద్భుతమైన ఎలివేషన్స్, హస్తకళా మాగ్నిఫికేషన్ ఈ ప్రాజెక్ట్ ప్రతిబింబిస్తుంది. ప్రతి విల్లా మన్నిక, స్థిరత్వం, విలాసంగా ఉండేలా తగుజాగ్రత్తలు నాణ్యమైన ముడిపదార్థాలు, వస్తువులను నిర్మాణంలో వినియోగించినట్లు తెలిపారు. తాము ఉత్తమమైన, అత్యాధునిక నిర్మాణ పద్ధతులను అనుసరించి పర్యావరణానికి అనుకూలంగా లగ్జరీ గృహాలను నిర్మిస్తున్నట్లు వివరించారు. బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ మొదటి రకమైన పోడియం పార్కింగ్ భావనకు మార్గదర్శకత్వం వహిస్తుందని, ఇది గేటెడ్ కమ్యూనిటీలో పూర్తిగా ట్రాఫిక్‌రహిత వాతావరణంలో ఏర్పాటు చేశామన్నారు. 20 ఎకరాల్లో బ్రిడ్జ్ ఎప్సిలాన్ విల్లాస్ ఆహ్లాదకరమైన వాతావరణంలో అధునాతన సౌకర్యాలతో అల్ట్రాలగ్జరీ జీవితాన్ని గడిపేలా 4, 5 బిహెచ్‌కె ఈస్ట్ ఫేసింగ్ విల్లాస్ సుమారు లక్ష ముప్పైతొమ్మిది వేల చదరపు అడుగులలో ఏర్పాటు చేసిన విల్లాస్ హైదరాబాద్‌కు ఇది ఒక గేమ్ చేంజర్‌గా అవుతుందని తెలిపారు.

# పోరాటం ఇంకా ముగియలేదు

## కంచ గచ్చిబౌలి భూములపై కెటిఆర్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 6:** భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన అద్భుతమైన పోరాటం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థులకు, పర్యావరణ కార్యకర్తలకు, ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వా ర్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతమని, పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నా, నిస్వార్థమైన విద్యార్థిప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ దళారి మాదిరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్‌ప్రయోజనాల కోసం కంచ గచ్చిబౌలి వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్నారని కేటీఆర్ తన లేఖలో ఎండగట్టారు. 50 సంవత్సరాలకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, కాంగ్రెస్ పార్టీ ప్రాపగండ చేస్తున్న ఏకో పార్క్ కన్నా గొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిన క్యాంపస్‌గా నిలిచిం దని కేటీఆర్ తెలిపారు.

విద్యార్థుల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను అడ్డుకున్నదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని కేటీఆర్ తన లేఖలో తెలిపారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలి ఉందని, ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలియజేశారు. ఈ పోరాటానికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మా పార్టీ తరఫున 400 ఎకరాల పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ తెలియజేశారు. ప్రకృతికి విఘాతం కలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా బిఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలి

## ప్రాణం విలువైంది: జస్టిస్ చంద్రకుమార్

### 'పాటపై తూటా.. ప్రశ్నించే గొంతులు పాలకుల అణచివేతపై సభ'

### హాజరైన ప్రముఖులు, కళాకారులు, సాహితీవేత్తలు, కవులు




ఆదివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'పాటపై తూటా ప్రశ్నించే గొంతులు పాలకుల అణచివేతపై సభ'లో పాల్గొన్న ప్రముఖులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** పాటపై తూటా సభలో పలువురు వక్తల ఉద్ఘాట శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంకావాలని, దోపిడీ పీడనలు వున్నంతా కాలం ప్రజా పోరాటాలు కొనసాగుతున్నాయని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ప్రజాయుద్ధ నౌక గద్దరన్న పై కాల్పు లు జరిపిన రోజును గుర్తు చెసుకుంటు అదివారం నాడు గద్దర్ ఫౌండెషన్ అధ్వర్యంలో పాట పై తూటా ప్రశ్నించే గొంతులు పాలకుల అణచివేత పై సభ జరిగింది. సభకు ముఖ్య అధిగా హాజరైన ప్రముఖ రచయిత మినా కందాస్వామి మాట్లాడుతూ ప్రజా సంస్కృతిని పాలకులు నిశబ్దం గా మారిస్తే గద్దర్ నిశబ్దాన్ని బద్దలు కొట్టారని అన్నారు. ప్రజా స్వామ్య వాతావరణాన్ని పాలకులు భగ్నం చెస్తున్నారన్నారు. ప్రశ్నించే కవులను, రచయితలను, సామాజిక కార్యకర్తలను అర్బన్ నక్సల్స్ గా కేంద్ర ప్రభుత్వం ముద్ర వేస్తున్నారన్నారన్నారు. ఈ సంవత్సరంలో 145 మందిని అదివాసీలను మావోయిస్టులుగా ముద్ర వేసి హత్య చేశారన్నారు. 2026 వరకు నక్సలిజాన్ని నిర్మూలి స్తామని అమితషా ప్రకటించడం సిగ్గు చేటన్నారు. బ్రహ్మ ణియ హిందుత్వ ఫాసిజం పెరిగిపోతుందన్నారు. సా మ్రాజ్యవాద, కుల అస మానతలకు వ్యతి రేకంగా పొరాడాల న్నారు. గద్దర్ ఎంతో మందిని ప్రభా వితం చేశారన్నారు. ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మావోయి స్టులు ప్రకటించిన చర్చలకు సిద్దమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం చర్చలకు అంగికరిం చాలన్నారు. గద్దర్ అన్న శాంతి యాత్ర చెశారన్నారు. ప్రజా గాయకురాలు అరుణొదయ విమలక్క మాట్లా డుతూ గద్దర్‌కు మరణం లేదని స్పష్టం చేసారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలను చేపట్టాలన్నారు. హింస లేని, సమాజం కావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన జివించె హక్కును కాపాడాలన్నారు. శాంతిని నెలకొల్పాలన్నారు.

విశ్రాంత హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ చంద్రకుమార్, ట్రైకార్ చైర్మన్ తెజావత్ బెల్లయ్య నాయక్, జన సేన పార్టి జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, గద్దర్ పౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జి.వి.సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు గద్దరన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేశారు.

# ఫోరెన్సిక్ చట్టపరమైన పరిశోధనల్లో అగ్రగామి

## జన్యుపరమైన డయగ్నోస్టిక్ పరిశోధనలో సిఎస్ఐఆర్ కీలక భూమిక: కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**హైదరాబాద్ ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** జన్యుపరమైన డయగ్నోస్టిక్ పరిశోధనలో హైదరాబాద్ కేంద్రంగా పరిశోధనలు నిర్వహించే సిఎస్ఐఆర్ సంస్థ కీలకభూమిక పోషిస్తున్నదని కేంద్ర సైన్స్ అండ్ టెక్నోలోజి మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. ఆదివారం సిఎస్ఐఆర్ ల్యాబ్ అభివృద్ధి కోసం గత దశాబ్దాకాలంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందించిన వనరులతో కొత్త ఆవిష్కరణలు చేశామని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ఫోరెన్సిక్ చట్టపమైన పరిశోధనలలో అగ్రగామిగా సిఎస్ఐఆర్ నిలిచిందని వేలిముద్రలు పరిజ్ఞానంతో నేరనిర్ధారణకు మార్గం సుగమం చేసిందని అన్నారు. సిఎస్ఐఆర్ ల్యాబ్‌రేటరి కెమి కల్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలోజి సంబంధించిన డైరెక్టర్లు డా.డి.శ్రీనివాసరెడ్డి, డా. ప్రకాశ్ కుమార్, నందికూరి వినయ్ కెమికల్, ఫార్మసీ రంగంలో ఇటీవల జరిగిన అవిష్కరణలు విజయాలు వివరించారు. శ్రీనివాసరెడ్డి జీవవ్యర్థ పదార్థాలను బయోగ్యాస్‌గా మార్చేందుకు వీలు కలిగించే ప్రాజెక్టును ఆవిష్కరించినట్లుతెలిపారు గుజరాత్ ఆల్కలీన్ అండ్ కెమికల్ లిమిటెడ్‌లో హైడ్రాజైన్‌హైడ్రేట్ అభివృద్ధి చేశామని తెలిపారు.

# వృద్ధ దంపతుల హత్య కేసును ఛేదించిన పోలీసులు

## ముగ్గురు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

### సెల్‌ఫోన్లు, బైక్‌లు, నగదు స్వాధీనం




వివరాలను వెల్లడిస్తున్న ఎసిపి మధు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రంలో వృద్ధ దంపతులను హత్య చేసిన కేసులో ముగ్గురి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఎసిపి మధు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రూరల్ సిఐ శ్రీనుతో కలిసి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూర్ మండలం బద్దిపడగా గ్రామానికి చెందిన పసుపుల సంపత్(32), బద్దిపడగ గ్రామానికి చెందిన మాలోతు రాజు (30), బద్దిపడగకు చెందిన మాలోతు శ్రీకాంత్ (26) నిందితులు తాగుడుకు బానిసలై చెడు అలవాట్లు, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. తాగడానికి జల్సాలు చేయడానికి డబ్బులు లేకపోవడంతో ముగ్గురు కలిసి దొంగ తనాలు చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో మండల కేంద్రమైన నంగునూర్ గ్రామ శివారులోని అక్కన్నపల్లి రోడ్డులో నివాసముంటున్న ఆవుల కొమురయ్య(80), ఆవుల భూదవ్వ(75) అనే వృద్ధ దంపతుల వద్ద ఉన్న బంగారు అభరణాలు, నగదును దొచుకెళ్లాలని పథకం పన్నినట్లు తెలిపారు. ఈనెల 2న రాత్రి 11 గంటల సమ యంలో ముగ్గురు నింది తులు కలిసి రెండు పల్సర్ బైక్‌లపై నంగు నూరుకు చేరుకున్నారని తెలిపారు. మలోత్ శ్రీకాం త్‌ను రోడ్డుపై కాపాలపెట్టి పసుపుల సంతోష్, మలోత్ రాజు ఇద్దరు కలిసి ఇంటి కిటికిని కట్ చేసి గదిలోకి వెళ్లినట్లు తెలిపారు. భూదవ్వ వద్ద ఉన్న చెవి కమ్మలు, చెవి మాటిలు, వెండి మొలతాడు ఇవ్వమని బెదిరించగా వృద్ధ దంపతులు ప్రతిఘటించినట్లు తెలిపారు. వృద్ధ దంపతులు నిందితులను గుర్తుపట్టడంతో పోలీసులకు, కుమారునికి చెబుతారన్న అనుమానంతో సంపత్ సంపత్ భూదవ్వను, మలోత్ రాజు కొమురయ్యను హత్య చేశారని తెలిపారు. అనంతరం బంగారు, వెండి అభరణాలు, నగదు దొచుకొని ఎవరికి అనుమానం రాకుండా కిటిలోంచి బయటకు వెళ్లి జాలి ఎప్పటిలాగా పెట్టినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని పరిశోధన చేస్తున్న క్రమంలో ఆదివారం రూరల్ సీఐ శ్రీను తన సిబ్బందితో కలిసి బద్దిపడగలో కేసు పరిశోధన చేస్తుండగా నిందితులు బస్టాండు వద్ద పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకొని విచారించగా వృద్ధ దంపతులను చంపి దొంగతానానికి పాల్పడినట్లు అంగీకరించినట్లు వివరించారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, నగదు రూ.30 వేలు, వెండి మొలతాడు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు తన ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలించినట్లు పేర్కొన్నారు. కేసును చేధించడంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట ఎస్ఐలు బాలకృష్ణ, అసిఫ్,సిబ్బంది కీలక పాత్ర పోషించారని వివరించారు.

# శామీర్‌పేటలో 273 కిలోల గంజాయి పట్టివేత

## ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్, మరో ఇద్దరు పరార్

### వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం

**హైదరాబాద్ (శామీర్‌పేట), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఒడిశా నుంచి హర్యానా రాష్ట్రానికి తెలంగాణ (శామీర్‌పేట) మీదుగా డ్రైగంజాయిని తరలిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల ముఠాను నిఘా పెట్టి పట్టుకుని వీరి నుంచి 273 కిలోల డ్రైగంజాయిని పట్టుకున్నట్లు మేడ్చల్ జోన్ డిసిపి ఎన్.కోటిరెడ్డి వెల్లడించారు. రూ. కోటి లక్షా ఇరవై ఐదు వేల విలువైన డ్రై గంజాయి, బోలెరో వాహనం, సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఒఆర్ఆర్ వద్ద స్థానిక పోలీసులు, మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు నిఘా పెట్టి పక్కా సమాచారంతో అక్రమంగా డ్రైగంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితుల ముఠాను, బొలెరో వాహనంలో భారీ ఎత్తున గంజాయిని పట్టుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మేడ్చల్ జోన్ డిసిపి ఎన్.కోటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా నుంచి హర్యానా, తెలంగాణ మీదుగా డ్రైగంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను శామీర్‌పేట ఓఆర్ఆర్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా నగరంలోని బోయినిపల్లిలో షర్దీప్‌కుమార్ అలియాస్ అజయ్‌శర్మ (27) డ్రైవర్, సన్నీ (27) డ్రైవర్,, మనీష్‌కుమార్ (29) హెల్పర్ నివాసం ఉంటూ ఈ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు హర్యానాకు చెందిన సాహిల్, ఒడిశాకు చెందిన సుభాష్ బిస్వాస్ అలియాస్ సామ్యూల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. షర్దీప్‌కుమార్ బోయినిపల్లిలో ఉంటూ బొలెరో వాహనాన్ని ప్యాకర్స్, మూవర్స్ పనికోసం ఉపయోగిస్తాడని అన్నారు. ఇతనికి సన్నీ, మనీష్‌కుమార్ ఇద్దరు పరిచయం ఉన్న వ్యక్తులు అని ,సన్నీ డ్రైవర్‌గా, మనీష్‌కుమార్ హెల్పర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. 2025మార్చి 31న షర్దీప్‌కుమార్, సాహిల్ ఒడిశా లో గంజాయి కొనుగోలు కోసం వెళ్లా రని అన్నారు.

అక్కడ సుభాష్ బిస్వాస్‌ను కలిసి 273కిలోల గంజాయి కొనుగోలు చేశారని అన్నారు. ఈ నెల 6న ఆదివారం ఉదయం శామీర్‌పేట ఒఆర్ఆర్ టోల్‌గేట్ వద్ద ఎస్ఓటి బాలానగర్, సైబరాబాద్ బృందం, శామీర్ పేట పోలీసులు వారిని పట్టుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. దీని విలువ 1,01,25,000 రూపాయల విలువ చేసేవి స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి కోటిరెడ్డి వివరించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మేడ్చల్ జోన్ డిసిపి ఎన్.కోటిరెడ్డి తదితరులు



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, చిత్రంలో విద్యార్థి, బిసి సంఘాల నాయకులు

# వర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

## భవిష్యత్ తరాల కోసం కేంద్రంలో అధినాయకులను కలుస్తా: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్(సైఫాబాద్), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్‌కు హామీ ఇచ్చిన ప్రకారం భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, విద్యా పరిశోధన అభివృద్ధి, పర్యావరణ పరిక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఓయు జెఎసి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 1974లో పార్లమెంట్ చట్టం ద్వారా స్థాపించబడిన ఈ యూనివర్సిటి దేశ దక్షిణ భాగంలో ఉన్నత విద్య, పరిశోధనకు జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఏర్పాటైందన్నారు. 1975లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యూనివర్సిటికి 2,300 ఎకరాల భూమిని కేటాయించేందుకు హామీ ఇచ్చిందని, అయితే గడిచిన 50 ఏళ్ళ అనంతరం కూడా ఈ భూమిని యూనివర్సిటి పేరు మీద చేయలేదని, దీంతో ఈ సంస్థ అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై పోలీసుల చేసిన లాఠిచార్జిని ఆర్.కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, బిసి నాయ కులు నీల వెంకటేష్, సి.రాజేందర్, అనంతయ్య, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'పెద్ది' గ్రౌండ్ బ్రేకింగ్ ఫస్ట్ షాట్ రిలీజ్



**గ్లోబల్ స్టార్** రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా టైటిల్, రెండు అద్భుతమైన ఫస్ట్‌లుక్ పోస్టర్లతో హ్యూజ్ బజ్ సృష్టించాయి. ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో 'పెద్ది' భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. శ్రీరామ నవమి శుభ సందర్భంగా నిర్మాతలు ఫస్ట్ షాట్‌ను రిలీజ్ చేశారు. సినిమా విడుదల తేదీని కూడా అనౌన్స్ చేశారు. 'పెద్ది' కోసం భారీ సంఖ్యలో జనం నినాదాలు చేయడంతో ఫస్ట్ షాట్ ఎక్సయిటింగ్‌గా ప్రారంభమవుతుంది. రామ్ చరణ్ పెద్ది పాత్రలో సిగార్ తాగుతూ భుజంపై బ్యాట్‌తో క్రికెట్ మైదానంలోకి పవర్ ఫుల్‌గా అడుగుపెడతారు. అతని ఎంట్రీ ఐకానిక్‌గా వుంది. 'ఒకటే పని సేసే నాకి... ఒకేనాక బతికే నాకి... ఇంత పెద్ద బతుకెందుకు... ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాల... పుడ్తామా యేటి మళ్ళీ... సెప్పు' అంటూ పెద్ది చెప్పిన డైలాగ్ అదిరిపోయింది.

పరిగెత్తుకుంటూ, విశాలమైన వరి పొలాల గుండా దూకడం, చివరకు క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టడం, క్రీజు నుండి బయటకు అడుగుపెట్టి, బ్యాట్ హ్యాండిల్‌ను నేలకు కొట్టి, బంతిని మైదానం దాటించడం.. గూస్‌బంప్స్ తెప్పించింది. మొదటి షాట్ అడ్రినలిన్‌చార్జ్ మూమెంట్ అందిస్తుంది.

పొడవాటి జుట్టు, రగ్గడ్ గడ్డం, నోస్ రింగ్‌తో కూడిన రామ్ చరణ్ ఇంటెన్స్ న్యూ లుక్ క్యారెక్టర్ రానెస్‌ని తెలియజేస్తోంది. అతని డైలాగ్ డెలివరీ, డిక్షన్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్ అద్భుతంగా వున్నాయి. విజయనగరం మాండలికాన్ని పలికిన విధానం అదిరిపోయింది. ఈ ప్రారంభ సన్నివేశంలోని డైలాగ్స్ పెద్ది పాత్ర లైఫ్ ఫిలాసఫీని తెలియజేస్తోంది.

రామ్ చరణ్ స్క్రీన్ ప్రజెన్స్ ఎక్స్ ట్రార్డినరీగా వుంది. దర్శకుడు బుచ్చి బాబు ఎక్స్ ట్రార్డినరీ క్యారెక్టర్‌ని అత్యద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రతి షాట్, ప్రతి మూమెంట్ గొప్పగా తీర్చిదిద్దారు. టెక్నికల్, ప్రొడక్షన్ గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో ఆకట్టుకుంది. ఆర్ రత్నవేలు విజువల్స్ బ్రెత్ టేకింగ్‌గా వున్నాయి. ఎఆర్ రెహమాన్ మ్యూజిక్ స్కోర్ మరింత ఇంటెన్సిటీని పెంచింది. ఎనర్జీని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. వరల్డ్ క్లాస్ నిర్మాణ విలువలు రూరల్ సెట్టింగ్‌కి ప్రాణం పోసుకుంది. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ పెద్ది రస్టిక్ ఎసెన్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ నవీన్ నూలి షార్ప్ ఎడిటింగ్ నెరటివ్‌ని ఆకర్షణీయంగా మలిచింది.

రామ్‌చరణ్ మాగ్నెటిక్, మాస్‌ని ఆకట్టుకునే పెర్ఫార్మెన్స్, బుచ్చిబాబు షార్ప్ రైటింగ్, టేకింగ్, నిర్మాణం పరంగా ఉన్నత స్థాయి సాంకేతిక బృందంతో 'పెద్ది' ఫస్ట్ షాట్ మార్చి 27, 2026న సినిమా రిలీజ్‌పై అంచనాలను మ్యాసీవ్‌గా పెంచింది. రామ్ చరణ్ పుట్టినరోజుకు పర్ఫెక్ట్‌గా నిలిచే ఈ చిత్రం గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ని, అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఫుల్ మీల్ ఫీస్ట్‌ని అందిస్తుందని హామీ ఇస్తుంది.

# 'ఓదెల 2' ట్రైలర్ 8న ముంబైలో లాంచ్

**తమన్నా భాటియా** హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రతి అప్‌డేట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఇటీవలి రిలీజయిన టీజర్ ఎక్సయిట్మెంట్ పెంచింది, అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు మేకర్స్ సినిమా థియేట్రికల్ ట్రైలర్ అప్‌డేట్‌తో వచ్చారు.



'ఓదెల 2' థియేట్రికల్ ట్రైలర్ ఈ నెల 8న ముంబైలో జరిగే అద్భుతమైన ఈవెంట్‌లో గ్రాండ్‌గా లాంచ్ కానుంది. కోర్ టీమ్ హాజరు కానున్న ఈ కార్యక్రమంలో టీమ్ తెలుగు, హిందీ ట్రైలర్‌లను లాంచ్ చేయనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం కాశీలో జరిగింది. టీజర్‌ను కుంభమేళాలో లాంచ్ చేశారు. ఇప్పుడు, ట్రైలర్‌ను లాంచ్ చేయడానికి మేకర్స్ ముంబైని ఎన్నుకున్నారు. విడుదల దగ్గర పడుతుండటంతో 'ఓదెల 2' ప్రచార కార్యక్రమాలు దూకుడుగా జరుగుతున్నాయి.

ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల కానున్న 'ఓదెల 2' ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌లో ఒకటిగా నిలుస్తుంది. తమన్నా భాటియా నాగ సాధువుగా అద్భుతంగా నటించి పవర్ ఫుల్ పాత్రకు ప్రాణం పోశారు. హెబ్బా పటేల్, వసిష్ట ఎన్ సింహా ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఎక్సయిటింగ్ యాక్షన్‌ను అద్భుతమైన కథలతో కలపగల సామర్థం వున్న సంపత్ నంది 'ఓదెల 2' చిత్రాన్ని సూపర్ విజన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి కాంతర ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. రాజీవ్ నాయర్ ఆర్ట్ డైరెక్టర్, సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. టాలెంటెడ్ టీమ్‌తో ఓదెల2 సినిమా మెమరబుల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించబోతోంది.

# 'అర్జున్ S/o వైజయంతి' న్యూ పోస్టర్ రిలీజ్

**నందమూరి కళ్యాణ్ రామ్** మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'అర్జున్ S/o వైజయంతి'. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది.

ఈ రోజు శ్రీరామ నవమి శుభ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. కళ్యాణ్ రామ్, విజయశాంతి లని డైనమిక్ గా ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'అర్జున్ S/o వైజయంతి' టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ నయాల్ది సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. శ్రీరామ నవమి సందర్భంగా స్పెషల్ ఇంటర్వ్యూ చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మేకర్స్ త్వర్లోనే గ్రాండ్ ఈవెంట్ లో ట్రైలర్ లాంచ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఈ మూవీ వండర్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందని హామీ ఇస్తుంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది.



# వైవిధ్యమైన కథాంశంతో పాన్ ఇండియా మూవీ 'రామం'

**శ్రీరామనవమి సందర్భంగా** చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి. రామం అనే పాన్ ఇండియా సినిమాకు శ్రీకారం చుట్టారు. ది రైజ్ ఆఫ్ అకిరా అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్రంలో టాలీవుడ్ యంగ్ హీరో కథానాయకుడిగా నటిస్తున్నారు. ధర్మ సంస్థాపనకు యుద్ధం చేసిన రాముడి అడుగు జాడల్లో నడుస్తూ ఆయన చూపిన బాట ప్రపంచానికి ఆదర్శం అని చాటి చెప్పే వీరుడికి సంబంధించి, ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు రానటువంటి ఓ గొప్ప యోధుడికి సంబంధించిన కథాంశంతో రూపొందుతోన్న సినిమా ఇది.





ఇండస్ట్రీలో పలువురి దర్శకుల దగ్గర పని చేసిన లోకమాన్యని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు వేణు దోనేపూడి. భారీ బడ్జెట్, అంతర్జాతీయ విలువలతో పాన్ ఇండియా మూవీగా 'రామం' సినిమాను రూపొందిస్తున్నారు. భారతీయులకు పర్వదినమైన శ్రీరామనవమి సందర్భంగా 'రామం' సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ,సమస్త మానవాళికి తారక మంత్రం శ్రీరామనామం. ధర్మ సంస్థాపనకు శ్రీరామచంద్రుడు చూపిన బాటే కాదు. అధర్మం నిర్మూలించటానికి ఆయన కోదండం చేపట్టి చూపిన వీరత్వం గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుంది. అలాంటి గొప్ప సమగ్ర మూర్తిమత్వాన్ని ఆధారంగా చేసుకుని.నేటి కాలంలో అలనాటి రామరాజ్యాన్ని కనెక్ట్ చేస్తూ ఇప్పటి వరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమా మీ ముందుకు రానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుంది. అన్‌కాంప్రమైజ్డ్‌గా, అత్యుత్తమ ప్రమాణాలతో, అంతర్జాతీయ సాంకేతిక విలువలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించనున్న ఈ చిత్రంలో టాలీవుడ్‌కి చెందిన ఓ రైజింగ్ స్టార్ హీరోగా నటిస్తున్నారు. అలాగే దేశ వ్యాప్తంగా అగ్ర నటీనటులు,సాంకేతిక నిపుణులు ఈ సినిమాకు వర్క్ చేయనున్నారు. ఆ వివరాలను త్వరలోనే తెలియజేస్తాం అన్నారు.

# సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకున్న ఎల్‌వైఎఫ్ మూవీ టీం!



**తాజాగా విడుదలైన** "లవ్ యువర్ ఫాదర్" చిత్రం ప్రేక్షకుల మనసు లను ఆకట్టుకుంటుంది. ఈ సినిమాలో తండ్రి కొడుకుల అను బంధాన్ని భావోద్వేగ పూరితంగా చిత్రీకరించారు. చరణ్, శ్రీహర్ష, కషిక కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని పవన్ కేతరాజు దర్శకత్వంలో మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా, అన్నపరెడ్డి స్టూడియోస్ నిర్మించాయి. ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అయినందుకు మూవీ టీం సెలబ్రేషన్స్ చేసుకున్నారు. ముందుగా హీరో హర్ష మాట్లాడుతూ.. "మాసినిమాని ఇంత పెద్ద హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇంకా సినిమా చూడని వారుంటే ఖచ్చితంగా వెళ్లి చూడండి. తప్పకుండా నచ్చుతుంది" అని అన్నారు. డైరెక్టర్ పవన్ కేతరాజు మాట్లాడుతూ.."ఈ సినిమా చాలా బాగుందని చాలా మంది ఫోన్లు చేస్తున్నారు.ఇంటర్వెల్, క్లైమాక్స్ అదిరిపోయిందని అంటున్నారు. ఈ సినిమాకి ఇంతలా కనెక్ట్ అయినందుకు హ్యాపీగా ఉంది" అని అన్నారు.ఇక నిర్మాత కిషోర్ రాఠి మాట్లాడుతూ.. "సినిమా చాలాబాగుందని చూసినవారు అంటున్నారు. చాలా సంతోషంగాఉంది. మనీషా ఆర్ట్స్ బ్యానర్‌లో గత నలభై ఏళ్లుగా ఇలాంటి కుటుంబకథ చిత్రాలేతీస్తున్నాం. వాటిలో చాలావరకు ప్రేక్షకుల ఆదరణలు పొందాయి. ఈ సినిమాకూడా మంచిఆదరణ పొందింది. ఇంత మంచి సినిమా తీసినందుకు డైరెక్టర్ పవన్‌గారికి కూడా నాధన్యవాదాలు" అన్నారు.

# 'అరి' సినిమా నుంచి లిరికల్ సాంగ్





**ఆర్‌వి రెడ్డి** సమర్పణలో ఆర్వీ సిని మాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, డా.తిమ్మప్ప నాయుడు పురిమెట్ల పి.హెచ్‌డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. మై నేమ్ ఈజ్ నో బడీ అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'బాయ్స్' చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్. దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ రోజు స్టార్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ అరి సినిమా నుంచి భగ భగ.. లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'భగ భగ'.. లిరికల్ సాంగ్ చాలా బాగుందన్న నాగ్ అశ్విన్...మూవీ టీమ్‌కు తన బెస్ట్ విషెస్ అందించారు. ఈ పాటను అనూప్ రూబెన్స్ ఫైర్ ఉన్న బీట్‌తో కంపోజ్ చేయగా..వనమాలి పవర్ ఫుల్ లిరిక్స్ రాశారు. షణ్ముక ప్రియ, రోహిత్ పివిఎన్ఎస్ ఇంటెన్స్‌గా పాడారు. 'భగ భగ'.. సాంగ్ ఎలా ఉందో చూస్తే మనిషేనా నువ్వు, ఏమై పోతు న్నావు, మృగమల్లె మారి దిగజారి పోయావు, 'భగ భగ భగ భగ్గ' మండే నీలో ఏదో సెగ, అంతులేని ఏంటి దగా, మనిషేనా నువ్వు, ఏమైపోతున్నావు, మృగమల్లె మారి దిగజారి పోయావు..అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. 'అరి' సినిమా ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల సిద్ధమవుతోంది. త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్ ను మూవీ టీమ్ అనౌన్స్ చేయనుంది.





# బాలీవుడ్ డెబ్యూ ఇస్తున్న తెలుగమ్మాయి అనన్య నాగళ్ల

**తెలుగు సినీ పరిశ్రమలో** తెలుగు అమ్మాయిలకి ఎక్కువ ప్రాధాన్యత ఉండదు, ఎక్కువగా ముంబై వాళ్ళకే అవకాశాలు ఇస్తారు దర్శకనిర్మాతలు అనేది ఒకప్పటి మాట.హార్డ్ వర్క్, డెడికేషన్, ఉంటే కచ్చితంగా హీరోయిన్లుగా నిలబడొచ్చు అని కొంతమంది తెలుగమ్మాయిలు ప్రూవ్ చేశారు. వీళ్ళలో ఒక తెలుగమయ్యాయి అయితే ఏకంగా బాలీవుడ్లో మెయిన్ లీడ్‌గా సినిమా చేసే స్థాయికి వెళ్ళింది. ఆమె మరెవరో కాదు అనన్య నాగళ్ళ. కెరీర్ ప్రారంభంలో 'షాద్' వంటి షార్ట్ ఫిల్మ్స్‌లో నటించి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. వెంటనే 'మల్లేశం' లో హీరోయిన్‌గా చేసే ఛాన్స్ దక్కించుకున్నారు. ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో వెంటనే ఈమెకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'వకీల్ సాబ్' సినిమాలో నటించే ఛాన్స్ దక్కింది. అటు తర్వాత 'ప్లే బ్యాక్' 'తంత్ర' 'పొట్టేల్' 'బహిష్కరణ' (వెబ్ సిరీస్) వంటి ఎన్నో వైవిధ్యమైన సినిమాల్లో వైవిధ్యమైన పాత్రల్లో అద్భుత నటన కనపరిచి బిజీ హీరోయిన్‌గా ఎదిగారు. ఇప్పుడు బాలీవుడ్ డెబ్యూ ఇవ్వడానికి కూడా రెడీ అయిపోయారు. ఏక్తా ఫిలిం ఎంటర్టైన్మెంట్ బ్యానర్లో హిమ్మత్ లడుమోర్ నిర్మాణంలో ఓ విమెన్ సెంట్రిక్ మూవీ చేస్తున్నారట అనన్య నాగళ్ళ. రాకేష్ జగ్గి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఆమె ఓ ట్రైబల్ అమ్మాయిగా మెయిన్ లీడ్‌గా కనిపించనున్నట్టు తెలుస్తుంది. 'కాంత' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఓ తెలుగమ్మాయి బాలీవుడ్ కి వెళ్లి మెయిన్ లీడ్‌గా సినిమా చేస్తుండటం అనేది తెలుగువారందరూ గర్వించ దగ్గ విషయమనే చెప్పాలి.



# 10న రాబోతోన్న 'జాక్'

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో 'జాక్ కొంచెం క్రాక్' అనే చిత్రాన్ని చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలోని అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమాలో సిద్ధు సరసన వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమా మీద అంచనాలు పెంచేశాయి. ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం నాడు భీమవరంలోని విష్ణు కాలేజీలో చిత్రయూనిట్ సందడి చేసింది. ఈ క్రమంలో, స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, భీమవరం వచ్చి ఇలా మీ (స్టూడెంట్స్) అందరినీ కలవడం ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్ ఎంతో అందంగా ఉంటుంది. మళ్లీ మళ్లీ ఈ టైం మళ్లీ రాదు. ఎంజాయ్ చేయండి. స్టూడెంట్ ఎనర్జీ చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. విష్ణు కాలేజ్‌లో ఈవెంట్ చేయడం సంతోషంగా ఉంది. ఏప్రిల్ 10న జాక్ చిత్రం రాబోతోంది. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు. వైష్ణవి చైతన్య మాట్లాడుతూ, నాకు కాలేజ్ లైఫ్ అంటే చాలా ఇష్టం. మీ అందరిలా ఇలా ఈవెంట్లు, ఫెస్ట్‌లో వచ్చి ఎంజాయ్ చేయాలని ఉండేది. ఏప్రిల్ 10న మా జాక్ చిత్రం థియేటర్లోకి రాబోతోంది. చాలా ఫన్‌గా, ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. మీ అందరికీ మా సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను. సిద్ధుతో నటించడం ఎంతో గొప్ప అనుభూతిని ఇచ్చింది. చాలా టాలెంటెడ్ పర్సన్. జాక్ టీంతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు.



నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ, సిద్ధు జొన్నలగడ్డ ఆల్ రౌండర్. కానీ ఇప్పుడు ఇక్కడి విద్యార్థులు డైరెక్షన్ చేయమని కోరుతున్నారు. ఇంకొన్ని రోజులు ఇలా సినిమాలు తీయనివ్వండి. జాక్ చిత్రం అద్భుతంగా వచ్చింది. ఏప్రిల్ 10న ఈ సినిమా రానుంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి అని అన్నారు.

వైష్ణవి చైతన్య మాట్లాడుతూ, నాకు కాలేజ్ లైఫ్ అంటే చాలా ఇష్టం. మీ అందరిలా ఇలా ఈవెంట్లు, ఫెస్ట్‌లో వచ్చి ఎంజాయ్ చేయాలని ఉండేది. ఏప్రిల్ 10న మా జాక్ చిత్రం థియేటర్లోకి రాబోతోంది. చాలా ఫన్‌గా, ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. మీ అందరికీ మా సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను. సిద్ధుతో నటించడం ఎంతో గొప్ప అనుభూతిని ఇచ్చింది. చాలా టాలెంటెడ్ పర్సన్. జాక్ టీంతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు.

# పిల్లలకు పఠనాసక్తి..

రోజంతా ఏదో హడావుడిగా గడిపేస్తూ చదువులో మునిగిపోతున్నరు ఇప్పటి పిల్లలు. ఒకప్పుడు పిల్లలకు కథలు చెపుతుంటే ఊ కొడొతూ పడుకునేవారు. ఇప్పుడు కథలు నానమ్మలు, తాతయ్యలు ఉండే కుటుంబాలు తక్కువే అని చెప్పొచ్చు. పిల్లలకు స్కూలు, ట్యూషన్‌లు, కోచింగ్‌లతో తీరిక లేకుండా పోయింది. అయినప్పటికీ కథలు అంటే ఇష్టపడనివారు ఉండరు. పెరిగిన సాంకేతికతతో ఏదో ఒక రకంగా కథలు, కార్టూన్లు చూస్తుంటారు. పుస్తకాలు చదివే అలవాటు తక్కువే అయినప్పటికీ చదవిడం ఎంతో ఆరోగ్యకరమైన అలవాటు. కథల పుస్తకాలు మాత్రమే కాదు. ఏ పుస్తకాలైన చదవడం వల్ల ప్రపంచాన్ని అర్థం చేసుకోవచ్చు. చదివే అలవాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జ్ఞానాన్ని నింపుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లల్లో చదవటం అలవాటు చేయాలి. సాధారణంగా పిల్లలు ఏదైనా పెద్దల నుండే నేర్చుకుంటారు. వయస్సుకు తగిన పుస్తకాలు చదవడం వల్ల పిల్లలు పఠన స్థాయికి తగిన పుస్తకాలు ఎంచుకునేలా చూడాలి. ముందుగా చిన్న పిల్లల కోసం బొమ్మలతో ఉండే పుస్తకాలు వారిని ఇవ్వాలి. వాళ్ల ఆసక్తిని గమనించి అందుకు తగిన పుస్తకాలు ఇస్తే వాళ్లలో చదవాలనే ఆసక్తి కూడా పెరుగుతుంది. రాత్రి భోజనం తరువాత కొద్దిసేపు చదవడం ఉండేలా చేయాలి. అలా చేస్తే వారికి కూడా ఆసక్తి పెరిగి రోజూ ఆ సమయానికి పుస్తకాలు ముందేసుకుంటారు. పిల్లలతో పాటు పెద్దవాళ్లు కూడా పుస్తకాలు చదువుతుంటే పిల్లలకు చదివే ఆసక్తి, నైపుణ్యం వృద్ధి చెందుతుంది.

స్క్రీన్ సమయం తగ్గించుకుని పుస్తకాలు చదివేందుకు ఆసక్తి చూపుతున్న పిల్లలకు ఏదైనా బహుమతులను ఇస్తూ ఉండాలి. ఇది వారికి చదవడానికి ప్రోత్సహాన్ని ఇస్తుంది. వాళ్లకు నచ్చే పుస్తకాలు, పెన్నులు, చిన్న చిన్న డైరీలు ఇస్తూ ఉండాలి. డైరీలో రాసే అలవాటు అలవడుతుంది. ఇలాబాగుంది కదూ! మీరు కూడా మీ పిల్లలకు ఇలాంటి అలవాట్లు చేస్తారు కదూ!



## ఆధ్యాత్మికం


### మహాభక్తురాలు మీరా!

శ్రీకృష్ణుడే సఖుడు, సర్వస్వం అని భావించి, ఆయన కోసమే తపించి తరించిన మహాభక్తురాలు మీరాబాయి. ఆ కృష్ణ ప్రేమిక ప్రత్యక్షంగా, పరోక్షంగా మన సనాతన ధర్మంలోని నవవిధ భక్తి మార్గాలను అనుసరించింది. నల్లనయ్యకు అంతరంగిక భక్తురాలై, అశేష ఆస్తిక జనావళికి ఆదర్శమూర్తిగా నిలిచారు. మీరా మొదట సాధువుల ద్వారా ఆ నవనీత చోరుడి లీలల్ని శ్రవణం చేసింది. ఆయన మహాత్మ్యాన్ని అనుభూతి చెందాక తనూ ఆశువుగా గీతాలు రచించి కీర్తించింది. ప్రాపంచిక బంధాల్లో తామరాకుపై నీటిబొట్టులా ఉంటూ ఆ పరమ పురుషుడి స్మరణలో కాలం గడిపింది. శ్యామసుందరుణ్ణి సాక్షాత్కరించుకున్నాక.. ఆయన పాదసేవనం, అర్చనల్లోనే తన్మయురాలవుతూ గీతాలాపనతో నిత్యం వందనాలు అర్పించింది. జీవితమంతా దామోదరుడికి దాస్యం చేసింది. ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించిన స్థితిలో ఆయనతో సఖ్య త ను పెంచుకుంది. తుట్టతుదకు ఆత్మ నివేదన చేసుకొని ఆయన ఐక్యత లోనే పోయింది. అలా శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చన, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం.. అనే తొమ్మిది భక్తి తోవల్లో పుండరీకాక్షుణ్ణి ప్రసన్నం చేసుకుంది. తన హృదయాన్ని తాండవకృష్ణుడి నివాసంగా మార్చుకుంది. మురళీ మోహనుడి భక్తి సామ్రాజ్యంలో మహారాణిగా వెలిగింది. అందుకే ఎందరో ఆధ్యాత్మిక సాధకులు మీరాబాయిని అపర రాధాదేవిగా ఆరాధిస్తారు. తల్లి మాటలతో తన్మయురాలైంది. నాలుగేళ్ల వయసులో తల్లితో కలసి ఓ పెళ్లికి వెళ్లిన మీరా వధూవరులను చూసి తన వరుడెవరని అనడిగింది. తల్లి నవ్వుతూ కృష్ణుడి విగ్రహం చూపింది. అది మీరా పసి మనసులో ముద్రించుకుంది. శ్రీకృష్ణుడే తన భర్తని నమ్మింది. అలాంటి మరో సంఘటనే మీరాను ఆ మురారికి చేరువ చేసింది. ఒకరోజు ఓ సాధువు వద్దనున్న కృష్ణుని కంచు విగ్రహం చూసి ఆకర్షితురాలై అది కావాలి. రోజూ నియమంగా పూజిస్తా నంటేనే ఇస్తానన్నాడు. సరేనని ప్రతిమను తీసుకొని పరవ శించిపోయింది. నాటి నుంచి మాధవుని ఆ మూర్తే లోక మైంది. 'హరీమైతో ప్రేమ్ దివానీ..ఖి అని పాడుకునేది మీరా. లోకంలో ప్రతి ప్రేమకూ ఓ పరిమితి ఉంది కానీ ఆ పరమాత్మ ప్రేమకు మేర లేదనేది మీరా. భగవంతుణ్ణి అంతరంగంలో ఆసీనుణికున్న ఆమె, మహారాణి కోసం కూడా తృణ ప్రాయంగా తోసి పుచ్చింది.

## క్యారెట్ అల్లం పచ్చడి

**కావలసిన పదార్థాలు:** నిలువుగా తరిగిన క్యారెట్, అల్లం ముక్కలు: ఒక కప్పు చొప్పున, కారం: అర కప్పు, పప్పుల నూనె: ఒక కప్పు, ఆవాలు, మెంతులు, జీలకర్ర, సోంపు: ఒక టేబుల్ స్పూన్ చొప్పున, ఉప్పు: తగినంత, పసుపు: ఒక టీస్పూన్.

**తయారీ:** ముందుగా మెంతులు, జీలకర్ర, ఆవాలు, సోంపు వేయించి పొడిచేసి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో క్యారెట్, అల్లం ముక్కలు, ఉప్పు, కారం, పసుపు, నూనెతోపాటు ముందుగా సిద్ధంచేసి పెట్టుకున్న పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నాలుగు గంటలపాటు నాన బెడితే నోరూరించే క్యారెట్ అల్లం పచ్చడి సిద్ధం. గాలి చొరబడని సీసాలో నెలరోజులు నిల్వ ఉంటుంది. ★



# రాత్రి భోజనంలో అల్పాహారాలు

**బరువు తగ్గాలనో, ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవడానికో.. వివిధ ఆహార నియమాలను పాటిస్తుంటారు కొంతమంది.** ఈ క్రమంలోనే రాత్రుళ్లు తేలికపాటి ఆహారం తీసుకుంటుంటారు. కొంతమందైతే ఉదయం తీసుకునే అల్పాహారాన్నే రాత్రి భోజన సమయంలోనూ తీసుకుంటుంటారు. నిజానికి ఈ ఆలోచన మంచిదే అయినా.. అన్ని రకాల అల్పాహారాలు డిన్నర్‌కి సరిపడవంటున్నారు నిపుణులు. ఇది విస్మరిస్తే జీర్ణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, రాత్రి భోజన సమయంలో ఎలాంటి అల్పాహారాలు మంచివి? తెలుసుకోవాలంటే ఇది చదివేయండి!

**ఎంపిక ముఖ్యం...** అల్పాహారం అనగానే బోలెడన్ని వంటకాలు గుర్తొస్తాయి. పోహా, ఇడ్లీ, వడ, పూరీ, దోసె.. ఇలా రోజుకో బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటుంటాం. అయితే రాత్రి భోజనానికీ అల్పామారం తీసుకునే వారు వీటిలో కొన్నింటిని మాత్రమే మెనూలో చేర్చుకోవడం మంచి దంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పోషకాలన్నీ అందేలా, ప్రొటీన్లు అధికంగా ఉండేలా, తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాల్ని తీసు కోవాలని చెబుతున్నారు.



- పోహా, ఉప్మా, ఆమ్లెట్,కిచిడీ, ఇడ్లీ.. వంటి పదార్థాల్లో ప్రొటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి బ్రేక్‌ఫాస్ట్‌కి ఎంత మంచివో, డిన్నర్‌కీ అంతే శ్రేయస్కరం అంటున్నారు నిపుణులు.
- కొంతమందికి పెరుగులో పండ్ల ముక్కలు, నట్స్, వంటి కలుపుకొని బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడం అలవాటు! అయితే దీన్నిరాత్రి పూట భోజన సమయంలోనూ నిరభ్యంతరంగా తీసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇవి త్వరగా కడుపు నిండిన భావనకలిగించి బరువును అదుపులో ఉంచుతాయని చెబుతున్నారు.
- అలాగే తక్కువ క్యాలరీలుండే శెనగపిండి దోసె.. పర్‌ఫెక్ట్ డిన్నర్ బ్రేక్‌ఫాస్ట్‌గా చెబుతున్నారు నిపుణులు. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి.. జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా కాపాడుతుందంటున్నారు.
- . పూరీ, వడ, పకోడీ, సమోసా, పరాఠా, ప్యాన్‌కేక్స్.. వంటి నూనె పదార్థాలు రాత్రి భోజనంలో తీసుకుంటే అరగవు. అందుకే ఇవి అల్పాహారాలే అయినా డిన్నర్‌కు బదులు తీసుకోవద్దంటున్నారు నిపుణులు.

**ఉపయోగాలెన్నో...** రాత్రి కడుపు నిండుగా తినే భోజనం కంటేతేలిగ్గా జీర్ణమయ్యే అల్పాహారం తీసుకోవడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. ఈ అలవాటు వల్ల పలు ప్రయోజనాలూ కలుగుతాయంటున్నారు.

- రాత్రుళ్లు తేలికపాటి ఆహారం తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతుంది. ఇది సుఖనిద్రకు ప్రేరేపిస్తుంది. నిద్రలేమి సమస్యనెదుర్కొనే వారికి ఇదీ ఓ పరిష్కారమేనట!
- చాలామంది మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటారు. ఇందుకు జీర్ణవ్యవస్థ పనితీరు సరిగ్గా లేకపోవడమూ ఓ కారణమే! అయితే రాత్రుళ్లు తేలిగ్గా జీర్ణమయ్యే ఫైబర్ ఎక్కువగా ఉండే అల్పాహారాన్ని తీసుకోవడం వల్ల ఈ సమస్య తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.
- చాలామందికి ఉద్యోగాలు, బిజీ లైఫ్‌స్టైల్ వల్ల రాత్రి భోజనం తయారుచేసుకునే సమయం ఉండట్లేదు. దాంతో బయటి నుంచి ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇలా రోజూ బయటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి నష్టం. అదే సింపుల్‌గా తయారుచేసుకొనే బ్రేక్‌ఫాస్ట్ వంటకాన్ని భోజన సమయంలో తీసుకుంటే పనీ సులువుగా పూర్తవుతుంది. ఆరోగ్యకరం కూడా! అంతేకాదు.. ఖర్చూ తగ్గుతుంది.
- . కొంతమంది కొన్ని రకాల అనారోగ్యాలతో బాధపడు తుంటారు. అలాంటి వారికి ఇంటి ఆహారమే తినమని వైద్యులు సూచిస్తారు. ఈ క్రమంలో ఇలాంటి సింపుల్ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీలను ప్రయత్నిస్తే.. ఆయా అనారోగ్యాల్నీ దూదరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
- బరువు తగ్గాలనుకునే వారు పాటించే సూత్రాల్లో తేలికపాటి ఆహారం తీసుకోవడం కూడా ఒకటి. రాత్రి భోజన సమయంలో ఈ సూత్రం పాటిస్తే.. వాళ్లు తమ ఫిట్‌నెస్ లక్ష్యాల్ని మరింత సులభంగా చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

అయితే రాత్రి ఎలాగూ అల్పాహారమే తీసుకుంటున్నాం కదా అనిఎక్కువ మొత్తంలో లాగించేయడం, ఆలస్యంగా తినడం..వంటివి సరికాదంటున్నారు నిపుణులు.

ఈ క్రమంలో వైద్యుల సలహా మేరకు తీసుకునే ఆహారం మోతాదు నిర్ణయించుకోవడం, పడుకోవడానికి రెండు గంటల ముందే భోజనం ముగించడం ఆరోగ్యకరం! ◻

# ఎండాకాలంలో చలువచేసే పుచ్చకాయ

ఎండాకాలం వచ్చిందంటే మార్కెట్లో పుచ్చకాయల సందడి కనిపిస్తుంది. మండే ఎండల్లో చల్లదనాన్ని ఇవ్వాలన్నా, రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండాలన్నా పుచ్చకాయ తినాల్సిందే. పుచ్చకాయ ముక్కలుగా కోసి తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్ ఎ,సితో పాటు యాంటి ఆక్సిడెంట్లు శరీరానికి పూర్తిగా అందుతాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పుచ్చకాయలో ఉండే ఫైబర్ శరీరానికి పూర్తిగా అందుతుంది. ఇది జీర్ణక్రియకు మేలు చేస్తుంది. ఈ పండును ముక్కలుగా చేసుకుని తింటే ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంటుంది. పుచ్చకాయలో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండి, చక్కెర స్థాయి పెరగకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తి కావాల్సి వచ్చినప్పుడు పుచ్చకాయను జ్యూస్ చేసుకుని తాగడం మంచిది. ఇందువల్ల శరీరానికి సత్వర శక్తి లభిస్తుంది. ముఖ్యంగా జిమ్, వ్యాయామం చేసేవాళ్లు జ్యూస్ తాగడం మంచిది.



# రెండు దశాబ్దాలుగా ఆగుతూ సా ..గుతూ..

## - గతంలో నిధుల కేటాయింపులోనూ నిర్లక్ష్యం
## - రెండేండ్లలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్6, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బిసి) సొరంగ మార్గంలో జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికి రెండు మృతదేహాలను బయటకు తీసి వారి సొంత గ్రామాలకు పంపించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 25లక్షల



చొప్పున ఎక్స్‌గ్రేషియా కూడా పంపించారు. కేంద్ర రాష్ట్ర, ప్రత్యేక బలగాలను కూడా రంగంలోకి దింపి.. రెస్క్యూ చర్యలను ముమ్మరం చేసింది. అయితే వీరి జాడను పట్టుకోవటం అతిపెద్ద సవాల్ గా మారింది. సొరంగం లోపల నీళ్లు, బురద పేరుకుపోవటంతో... ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకోవడం అత్యంత క్లిష్టంగా మారిందని చెప్పవచ్చు. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ఘటనతో ఈ ప్రాజెక్ట్ పై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. దశాబ్దాలు గడుస్తున్నా ప్రాజెక్ట్ పనులు మాత్రం పూర్తి కావటం లేదు. అసలు ఈ ప్రాజెక్ట్ స్వరూపం ఏంటి..? సొరంగం అవసరం ఎందుకు..? లాంటి అంశాలను ఒకసారి తెలుసుకుందాం.. ఎస్‌ఎల్‌బీసీ ( శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ ప్రాజెక్టు) తెలంగాణలోని పెండింగ్ ప్రాజెక్టుల్లో ఒకటి, ఈ ప్రాజెక్ట్ పూర్తి కోసం 20ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను వినియోగించుకుని నల్గొండ జిల్లాలో ప్రధానంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీటిని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి అందించేందుకు శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్ట్ ను తీసుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదలైన సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞంలో భాగంగా ఎస్‌ఎల్‌బిసి కార్యరూపం దాల్చింది. మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో సుమారు రెండువేల కోట్ల అంచనాతో 2007లో పనులు మొదలయ్యాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. పాజెక్టుకు అప్పటి సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేయగా 2007లో నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. నిర్ణీత గడువు మేరకు ప్రాజెక్టు పనులు మొదలయ్యాక నాలుగేళ్లకు పూర్తికావాల్సి ఉండాలి. కానీ ఇప్పటికీ పనులు మాత్రం పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టులో 43.93 కిలోమీటర్ల సొరంగం (టన్నెల్) మార్గం నిర్మించడం కీలకమైనది. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. రెండు చోట్ల సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్, రెండు లింక్ కెనాల్స్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సహా మరికొన్ని పనులు ప్రాజెక్టులో భాగంగా చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో కాల్వలు తవ్వాల్సిన ప్రాంతమంతా నల్లమల రిజర్వు అటవీ ప్రాంతంలో ఉండడంతో ప్రాజెక్టు పట్టాలు ఎక్కడానికి ప్రతిబంధకంగా మారింది. దీంతో సొరంగ మార్గాల నిర్మాణాలకు కార్యాచరణ రూపొందించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి సొరంగం ద్వారా నీటిని తీసుకుని నల్గొండ జిల్లా పరిధిలోని చందంపేట మండలం తెల్దేవర్ పల్లి వద్ద నీటిని బయటకు పోయడానికి మొత్తంగా సుమారు 44 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సిన అవసరం ఏర్పడింది. శ్రీశైలం వైపు ఇన్‌లెట్ 13.9కి.మీ నిడివిలో నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ఔట్ లెట్‌కు 20.4 కిమీటర్ల నిడివిలో సొరంగాలు తవ్వాలి. దీనికి కోసం కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చించింది. టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం)ను తెప్పించింది. ఇది రెండు సార్లు శ్రీశైలానికి భారీ వరదలు వచ్చిన సమయంలో నీటిలో మునిగిపోయి మర్మమతులకు గురైంది. ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టును రూ.1925 కోట్ల అంచనాతో మొదలు పెడితే అదిప్పుడు రూ.4 వేల కోట్లను దాటిపోయింది. ఈ ప్రాజెక్ట్ పూర్తి కోసం మరో 2వేల కోట్ల వరకు నిధులు అవసరమవుతాయి. ఏళ్ల తరబడిగా టన్నెల్ పనులు జరుగుతుండటంతో సమస్యలు పెరగటమే కాకుండా బడ్జెట్ పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ప్రాజెక్ట్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. 2026 జూన్ లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా మంత్రులతో పాటు సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ మధ్యనే పనులు మొదలైనట్లుగా నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. అంతలోనే టన్నెల్ ప్రమాదం జరిగింది. తెలంగాణలో సుదీర్ఘకాలంగా నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టుగా ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును చెప్పుకోవచ్చు. దీని నిర్మాణానికి సుమారు 42 ఏళ్ల కిందట ఆలోచన మొదలుకాగా, 20 ఏళ్ల కిందట నిధుల ఆమోదంతో పనులు కొనసాగుతూ వస్తున్నాయి. దాదాపు 44 కిలోమీటర్ల మేర ఎందుకు సొరంగం తవ్వుతున్నారు. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. రెండుచోట్ల సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్, రెండు లింక్ కెనాల్స్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సహా మరికొన్ని పనులు ప్రాజెక్టులో భాగంగా చేయాల్సి ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన మొదటి సొరంగం (టన్నెల్1) 9.2 మీటర్ల వ్యాసంతో 43.93 కిలోమీటర్లు నిర్మించాల్సి ఉండగా 34.37 కిలోమీటర్లు పూర్తయినట్లుగా నీటిపారుదల శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి రెండు వైపుల నుంచి అంటే ఇన్‌లెట్, అవుట్‌లెట్ వైపు నుంచి పనులు చేసుకుంటూ వచ్చారు. నాగర్‌కర్నూలు జిల్లాలోని అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్ద పనులు చేపట్టి అచ్చంపేట మండలం మన్నెవారి పల్లి వద్ద టన్నెల్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా 9.56 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించాల్సి ఉంది. మరో సొరంగం (టన్నెల్ 2) 8.75 మీటర్ల వ్యాసంతో 7.13 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఇది నల్లగొండ జిల్లా చందంపేట మండల తెల్దేవరపల్లి నుంచి నేరెడుగొమ్మ వరకు ఉంది. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పెండ్లిపాకాల, ఉదయ సముద్రం రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు ద్వారా సుమారు 30 టీఎంసీల నీటిని కృష్ణా నది నుంచి తరలించాలనేది ప్రణాళిక. దీనిద్వారా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నీటిని తరలించాలని నిర్ణయించారు. 2010 నాటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా, కొనసాగుతూ వచ్చాయి. ఈ విషయంపై తెలంగాణ జల సాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ బీబీసీతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు ఉమ్మడి ఏపీలోనే 52 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత గత పదిన్నరేళ్లలో 23 శాతం పనులు అయ్యాయి అని చెప్పారు. ఈ ప్రాజెక్టు నుంచి నీటిని తరలించే ప్రాంతం పూర్తిగా నల్లమల అటవీ ప్రాంతం. పర్యావరణ నిబంధనల మేరకు ఓపెన్ కాలువ తవ్వి పనులు చేయాలంటే కష్టమైన పని.

అనుమతులు లభించే పరిస్థితి లేదని నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు గ్రావిటీ దృష్ట్యా కూడా టన్నెల్ ద్వారా నీటిని తరలించాలనేది ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ప్రతిపాదన. ఈ ప్రాజెక్టు ప్రతిపాదిత రూట్లో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉంది. దీనివల్ల అటవీ, వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి ఎలాంటి ఆటంకం లేకుండా పనులు చేసుకోవచ్చని కేంద్ర పర్యావరణ శాఖ గతంలో అనుమతులు ఇచ్చింది. రక్షిత అటవీ ప్రాంతం కావడంతో మొదట్లో ప్రతిపాదించినప్పటి నుంచి కూడా సొరంగం ద్వారానే నీటిని తరలించాలనే ప్రణాళిక ఉంది. 40 సంవత్సరాల కిందటే బీజం ఈ శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల కిందటే బీజం పడింది.

# కమనీయం రాములోరి కళ్యాణం

- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**వంగూరు, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే రెండో అపరభద్రాదిగా పేరొందిన చారకొండ మండలం శిర్సనగండ్ల గుట్టపై అశేష జనవాహిని మధ్య రాములోరి కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత శోభయమానంగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మంగళ వాయిద్యాలతో అంగరంగా వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిపించారు. కళ్యాణ మహోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవిలు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అధికార లాంఛనాలతో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు, అచ్చంపేట, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ సునిత, డీఎస్పీ వెంకటేశ్వర్లులు హాజరై కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. సీతారాముల మూల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి జిలకర, బెల్లం పెట్టి ముత్యాల తలంబ్రాలు భక్తులు తిలకిస్తుండగా పోసి శ్రీ విశ్వవాసు సంవత్సర ఉత్తరాయ వసంత రుతువు చైత్రమాస శుక్లపక్ష నవమి పుష్య నక్షత్రం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శిర్సనగండ్ల గుట్టపై శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని అధికార లాంఛనాలతో అంగరంగా వైభవంగా జరిపించారు. కళ్యాణోత్సవానికి విచ్చేసిన అతిథులకు ఆలయ అర్చకులు, చైర్మన్ రామశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



## ఆలయాభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు చేసిన-మంత్రి జూపల్లి..

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధి కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావును రూ.5కోట్లు మంజూరు చేయాలని కోరగా తక్షణమే రూ.2కోట్లు మంజూరు చేస్తున్నానని భక్తుల ముందు హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి రూ.50కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని మంత్రి వివరించారు. రామాయణం మనకు ఎన్నో జీవిత పాఠాలను నేర్పిస్తుందని, ముఖ్యంగా కుటుంబ బాంధవ్యాల గురించి వర్ణిస్తుందని అన్నారు. మంచికి, చెడుకు మధ్య తారతమ్యాన్ని.. చెడు చేసిన వాళ్లను క్షమించగలిగే గుణాన్ని మనకు నేర్పిస్తుందిని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎన్నో అఘాయిత్యాలను చూస్తున్నామని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడానికి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, భార్యాభర్తల మధ్య సంబంధాలు సరిగ్గా లేక పోవడం, ఇంట్లో మంచి మాటలు చెప్పే పెద్దలు లేకపోవడం, భార్యాభర్తల మధ్య అర్థం చేసుకునే స్వభావం లేకపోవడం ప్రధాన కారణాలని వివరించారు. సీతారాముల బాంధవ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందిని చెప్పుకొచ్చారు.

తండ్రి మాట జవదాటని శ్రీరాముడు, అంతే కాకుండా తమ జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఒకరిని ఒకరు విడవలేని సీతారామచంద్రులు అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు శిర్సనగండ్ల గుట్టకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కళ్యాణ మండపం చలువ పందిళ్లు, ప్రత్యేక ఎల్‌ఈడీలను ఏర్పాటు చేశారు. భక్తులకు దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సౌకర్యం కల్పించారు. వైద్య సిబ్బంది క్యాంప్‌ను ఏర్పాటు చేసి మందులను ఏర్పాటు చేశారు. దాతలు, ఆలయ సిబ్బంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులను ఎండ తాకిడి నుంచి కాపాడేందుకు మజ్జిగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గుట్ట వద్దకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, చారకొండ మాజీ సర్పంచ్ విజేయందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను అప్రమత్తం చేసిన పోలీసులు..

శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తుండగా భక్తులు కళ్యాణోత్సవం తిలకిస్తుండగా చేతివాటం ప్రదర్శించే వారుంటారని గుర్తిస్తూ కళ్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులను అప్రమత్తం చేశారు. దొంగలు ఉన్నారు జాగ్రత్త అంటూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తూ భక్తుల అభరణాలను కొల్లగొట్టకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు కళ్యాణ ప్రాంగణమంతా సీసీ కెమెరాలతో అమర్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు చేపట్టారు.



# బాక్సర్ హితేష్‌కు పసిడి పతకం

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్ టోర్నమెంట్-2025లో భారత క్రీడాకారుడు హితేశ్ గులియా సంచలనం సృష్టించాడు. బ్రెజిల్‌లో ఆదివారం జరిగిన వర్డ్ కప్ టోర్నీ ఫైనల్‌లో నెగ్గి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ క్రమంలోనే బాక్సింగ్ వరల్డ్ కప్‌లో గోల్డ్ మెడల్ నెగ్గిన తొలి భారత క్రీడాకారుడిగా హితేష్ చరిత్ర సృష్టించాడు. 70 కేజీల విభాగం ఫైనల్‌లో హితేష్ ఇంగ్లాండ్‌కు చెందిన ఒడెల్ కమారాను ఢీ కొట్టాడు. తుదిపోరులో ప్రత్యర్థిని ధీటుగా ఎదుర్కొన్న హితేశ్ ఆధిపత్యం ప్రదర్శించి విజయం సాధించాడు. అంతకు ముందు జరిగిన సెమీఫైనల్లో హితేష్ 5-0తో మకాన్ ట్రార్ (ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. ఈ పోరులో ఆరంభంలో రక్షణాత్మకంగా ఆడిన హితేష్, తర్వాత ప్రత్యర్థిపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డాడు. మూడు రౌండ్లలోనూ అదే జోరు ప్రదర్శించి ట్రార్‌ను ఓడించాడు. కాగా మరో భారత్ బాక్సర్ అభినాష్ జమ్వాల్ పసిడి పతకానికి చేరువయ్యాడు. అతడు ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. సెమీ ఫైనల్లో అభినాష్ 5-0తో ఇటలీ బాక్సర్ మలంగపై ఏకపక్ష విజయం సాధించాడు. 22 ఏళ్ల అభి ఫైనల్లో బ్రెజిల్‌కు చెందన యూరీ రెయిస్‌తో తలపడతాడు. ఐదుగురు జడ్జీల్లో నలుగురు జ్వాల్‌కు పర్‌ఫెక్ట్ 30 పాయింట్లు ఇచ్చారు. మొదటి, మూడో రౌండ్‌లో అందరూ ఏకగ్రీవంగా అతనికి పాయింట్లు అందించడం విశేషం. మరో సెమీఫైనల్లో మనీష్ రాథోడ్ ఓటమి పాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. 55 కేజీల సెమీస్‌లో 0-5తో నూర్ సుల్తాన్ అల్టిన్‌బెక్ (కజికిస్థాన్) చేతిలో ఓడిపోయాడు.



# గ్రాండ్ ప్రి రేస్‌లో.. వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

**న్యూఢిల్లీ:** ఫార్ములా వన్ సీజన్ మూడో రేసులో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) పోల్ పొజిషన్ సాధించాడు. జపాన్‌లో జరిగిన గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ రౌండ్‌లో అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 1 నిముషం 26.983 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేశాడు. చివరి ల్యాప్‌లో అతడు ఈ టైమింగ్ నమోదు చేశాడు. కాగా, వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 41 పోల్ పొజిషన్ కావడం విశేషం. మెక్‌లారెన్ డ్రైవర్లు నోరిస్ (1 నిముషం 26.995 సెకన్లు), పియాస్ట్రి (1 నిముషం 27.027 సెకన్లు) వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జపాన్ గ్రాండ్ ప్రిలో 4 సార్లు విజేతగా నిలిచిన వెర్‌స్టాపెన్ ఈ సీజనులో ఆశించిన స్థాయిలో దూకుడు కనపర్చలేకపోయాడు. గత 16 రేసుల్లో అతడు కేవలం రెంటిలో మాత్రమే విజయం సాధించాడు.

# ఐపిఎల్‌లో చెన్నై ఫెయిల్యూర్స్




## ప్లానింగ్ లేని పవర్ ప్లే
## బౌలింగ్‌లోనూ సమస్యలే

**ఢిల్లీ:** ఈ ఐపిఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి దయనీయంగా తయారైంది. వరుస ఫెల్యూర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇప్పటి వరకూ ఆడిన 4 మ్యాచ్‌ల్లో అతి కష్టం మీద ఒకే ఒక్కటి గెలిచింది. మిగిలిన మ్యాచ్‌లన్నింటినీ కోల్పోయింది. ఇందుకు ప్రధాన కారణం ప్లానింగ్ లేకపోవడంతో పాటు, లోపాలతో కూడిన నిర్ణయాలుగా క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సూపర్ కింగ్స్ ఈ సీజనులో బౌలింగ్‌లో పెద్ద సమస్యను ఎదుర్కొంటోంది. రవిచంద్రన్ అశ్విన్ చెన్నై పిచ్‌లపైన ఏదో మాయ చేస్తాడని గంపెడాశలు పెట్టుకున్నా, ఆ స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. నాలుగు మ్యాచ్‌ల్లోనూ కేవలం మూడు వికెట్లు మాత్రమే తీశాడు. దీనితోడు భారీగా పరుగులు కూడా ఇచ్చేస్తున్నాడు. అలాగే జడేజా పరిస్థితి కూడా దాదాపు ఇంతే. ఈ సీజనులో రెండు వికెట్లుకే పరిమితమయ్యాడు. 10 వికెట్లు తీసిన నూర్ అహ్మద్ అదరగొట్టకపోతే స్పిన్నే ఆయుధంగా దిగే చెన్నై పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఇక క్రికెట్‌లో పవర్ ప్లే చాలా ముఖ్యం. మ్యాచ్‌లో కీలకమైన పవర్ ప్లే విషయంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తొలి ఆరు ఓవర్లలో వీలైనన్ని పరుగులు రాబట్టాలి. అలాంటిది చెన్నైకి ఈసారి ఓపెనర్లు ఎవరు అనేది ఇంకా తేలకుండా ఉంది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ మూడు ఓపెనింగ్ జోడీలను ట్రై చేశారు. అయితే ఈ ప్రయోగం విఫలం అవడం జట్టుకు పెద్ద సమస్యగా తయారైంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో రాహుల్ త్రిపాఠి (2, 5) తీవ్ర నిరాశ పరిచాడు. మూడో మ్యాచ్‌లో 23 కొట్టాడు కాని స్ట్రైక్ రేట్ టీ20ల స్థాయిలో లేదు. నాలుగో మ్యాచ్‌లో ప్రతిపాఠిని పక్కనపెట్టి దేవాన్ కాన్వేను తీసుకొచ్చారు. అతను ఫెయిల్ అవ్వగా, తొలి రెండు మ్యాచ్‌ల్లో రాణజంచిన రచిన్ (65, 41) ఢిల్లీ మ్యాచ్‌లో నిరాశపరిచాడు. దీంతో ఓపెనర్ల కష్టం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. సరైన ఓపెనర్లు లేకుండా భారీ స్కోరు, ఛేజింగ్ అసాధ్యం. అందుకే ఈ సీజన్‌లో అతి తక్కువ పవర్ ప్లే స్కోరు. స్ట్రైక్ రేటు ఉన్న చెన్నైకే కావడం విశేషం. ఇక ఓపెనర్లు రాణించకపోయినా మిడిలార్డర్‌తో కవర్ చేస్తా మనుకున్నా అది కూడా సూపర్ కింగ్స్‌కు వీలు కావడం లేదు. గతంలోఎన్నో మంచి విజయాలు, ఇన్నింగ్స్‌లు అందించిన అజింక్య రహానే, డారిల్ మిచెల్‌ను జట్టు బాగా మిస్ అవుతుందని చెప్పవచ్చు. దీంతో మొత్తంగా శివమ్ దూబె మీద ఆధారపడాల్సిన దుస్థితి తప్పడం లేదు. అయితే దూబె (9, 19, 9, 18) కూడా ఓపెనర్లను అనుసరిస్తూ వేగంగా పెవిలియన్‌కు చేరుకుంటున్నాడు. అంతేకాకుండా గత నాలుగు మ్యాచ్‌ల్లో మిడిలార్డర్‌లో ట్రై చేసిన దీపక్ హుడా, సామ్ కరన్, విజయ్ శంకర్‌లు కూడా విఫమయ్యారు. కాగా మొదటి, రెండు మ్యాచ్‌ల్లో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో విమర్శలు రావడంతో గత రెండు మ్యాచ్‌ల్లో ముందుకొచ్చాడు. అయితే జట్టుకు అవసరమైన పరుగులు వేగంగా చేయడంలో విఫలమయ్యాడు. రవీంద్ర జడేజా పరిస్థితి కూడా ఇలాగే ఉంది.



# సిఫ్ట్‌కౌర్‌కు స్వర్ణం

## షూటింగ్ ప్రపంచకప్‌లో హైదరాబాదీ షూటర్ ఇషాకు రజతం
## డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ విఫలం

**న్యూఢిల్లీ:** ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచ కప్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో భారత్ షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా పసిడి పతకం కైవం చేసుకుంది. అర్జెంటీనాలో జరిగిన సీజన్ ప్రారంభ ప్రపంచ కప్ ఈ వెంట్‌లో భారత్ ఖాతాలో తొలి పసిడి పతకం చేరింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్ 458.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. అనిట మంగోల్ (జర్మనీ 455.3 పాయింట్లు), అరినా అటుఖోవా (కజకిస్థాన్, 445.9 పాయింట్లు) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. ప్రపంచ కప్ టోర్నీల చరిత్రలో స్విఫ్ట్ కౌర్‌కు ఇదే తొలి పతకం. మొత్తం 45 షాట్ల పాటు జరిగిన ఫైనల్లో తొలి 15 షాట్లు ముగిసిన అనంతరం జర్మనీ షూటర్ అనిట మంగోల్డ్ కంటే 7.2 పాయింట్లు వెనకబడిన సిఫ్ట్ కౌర్‌కు ఆ తర్వాత అదరగొట్టింది. నీలింగ్ పొజిషన్‌లో సరైన గురి పెట్టలేకపోయిన భారత్ షూటర్ ఆ తర్వాత ప్రోన్, స్టాండింగ్ పొజిషన్లలో సత్తా చాటింది. అంతకు ముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో సిఫ్ట్ కౌర్ 590 పాయింట్లు సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇక హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఇషా 35 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా షూటర్లు సున్ యుజి 28 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, ఫెంగ్ జియాన్ 30 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో పోటీ పడినభారత్ మరో షూటర్ డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ 24 పాయింట్లతో ఆరో స్థానానికి పరిమితమైంది. అంతకు ముందు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మనూ భాకర్ 585 పాయింట్లు సాధించి మూడో స్థానంతో, ఇషా సింగ్ 578 పాయింట్లతో తొమ్మిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు.

# ఐపిఎల్ మధ్యలో భారత్, ఆస్ట్రేలియా టూర్ షెడ్యూల్

## అక్టోబరు 19 నుండి నవంబరు 8 వరకు మ్యాచ్‌లు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్‌లీగ్-2025, సీజను 18 రసవత్తరంగా సాగుతోంది. ఈ సందడి మధ్య క్రికెట్ అభిమానులకు మరో గుడ్ న్యూస్ అందింది. ఆస్ట్రేలియాలో భారత పర్యటన ఖరారైంది. ఈ పర్యటనలో 3వన్డేలు, ఐదు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. క్రికెట్ మైదానంలో ఇండియా-ఆస్ట్రేలియా మధ్య పోటీ ఎల్లప్పుడూ ఉత్తేజకరంగా ఉంటుంది. ఇరు జట్ల పోరును క్రికెట్ లవర్స్ ఎంతగానో ఎంజాయ్ చేస్తారు. ఈ నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా తన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఏడాది చివర్లో భారత పురుషుల జట్టు మూడు వన్డేలు, ఐదు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటిస్తుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. అక్టోబర్ 19-నవంబర్ 8 మధ్య వైట్ బాల్ మ్యాచ్‌లు ఆడనుంది. 50 ఓవర్ల మ్యాచ్‌లు డే, నైట్ మ్యాచ్‌లు కాగా, టి20 మ్యాచ్‌లు నైట్ మ్యాచ్‌లుగా ఉంటాయని తెలిపింది. రాబోయే 2025-26 సీజన్‌లో ఆస్ట్రేలియాలోని ఎనిమిది రాష్ట్రాల్లో క్రికెట్ మ్యాచ్ లు జరపడానికి క్రికెట్ ఆస్ట్రేలియా ప్లాన్ చేసింది. 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కాన్‌బెర్రా, హోబర్ట్ లో జరుగుతాయి. దీనికి ముందు పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో కూడా 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడతాయి. 2024-25 ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తర్వాత భారత్ తిరిగి ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్తోంది. ఇండియా ఆస్ట్రేలియా టూర్ షెడ్యూల్ వన్డే సిరీస్ అక్టోబర్ 19న పెర్త్ స్టేడియంలో, 23న అడిలైడ్ ఓవల్, 25న ఎస్‌సిజి, సిడ్నీలోను మ్యాచ్‌లు జరగనున్నాయి. అలాగే టీ20 సిరీస్ షెడ్యూల్‌కు సంబంధించి అక్టోబర్ 29న మనుకా ఓవల్, కాన్‌బెర్రాలో, 31న మెల్‌బోర్న్‌లో, నవంబర్ 2న హోబర్ట్‌లో, 6న గోల్డ్ కోస్ట్ స్టేడియం, గోల్డ్ కోస్ట్‌లో, 8న ది గబ్బా, బ్రిస్బేన్‌లో జరగనున్నాయి.

# వాణిజ్యం

# గోల్డ్ ఇటిఎఫ్‌లకు పెట్టుబడుల వెల్లువ

**ముంబయి, ఏప్రిల్ 6:** కేవలం అందంకోసమే కాదు భవిష్యత్తు అవసరాల కోసం బంగారం కొనుగోలు చేసేవారు ఇటీవల ఎక్కువయ్యారు. ఈ నేపథ్యంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. 2024 ఫిబ్రవరిలో రూ.28,529.88 కోట్లుగా ఉన్న గోల్డ్ ఇటిఎఫ్ ఫండ్స్ నికర ఆస్తుల ఈ ఏడాది ఫిబ్రవరికి దాదాపు రెట్టింపు అయ్యి రూ.55,677.24 కోట్లకు చేరుకున్నాయి. సాధారణంగా బంగారాన్ని రెండు రకాల పద్ధతుల్లో కొనుగోలు చేస్తారు. సమీపంలోని బంగారు దుకాణానికి వెళ్లి, నచ్చిన ఇటిఎఫ్‌లలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భౌతికంగా బంగారం ఉంటే దాన్ని ఇంటిలో సురక్షితంగా దాచుకోవాలి. లేకపోతే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. కానీ గోల్డ్ ఇటిఎఫ్ ఫండ్స్‌లో బంగారం యూనిట్ల రూపంలో ఉంటుంది. దాన్ని ఎవరైనా దొంగిలిస్తారనే భయం ఉండదు. భౌతికంగా బంగారం కొనడానికి దుకాణానికి వెళ్లాలి. కానీ గోల్డ్ ఇటిఎఫ్ లావాదేవీలను ఫోన్ ద్వారా చేసుకోవచ్చు. దుకాణాల్లో బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేటప్పుడు వాటికితరుగు, పెట్టవచ్చు. భౌతిక బంగారాన్ని విక్రయించడం కొంచెం కష్టంగా ఉంటుంది. అదే ఇటిఎఫ్‌లను ఎప్పుడైనా విక్రయించుకోవచ్చు. ప్రజలకు అత్యధిక రాబడినిచ్చే గోల్డ్‌ఇటిఎఫ్ ఫండ్స్‌లో క్వాంటం గోల్డ్ ఫండ్, కోటక్ గోల్డ్ ఇటిఎఫ్, ఐసీఐసీఐ ప్రెడెన్షియల్ గోల్డ్‌ఇటిఎఫ్, యాక్సిస్ గోల్డ్ ఇటిఎఫ్, ఇన్వెస్కో ఇండియా గోల్డ్ ఈటీఎఫ్ ప్రముఖంగా ఉన్నాయి. వీటిలో పెట్టుబడులకు గణనీయమైన రాబడి వస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి.




ఆభరణాన్నిఎంపిక చేసుకుని, ఆ రోజు ధర ప్రకారం డబ్బులుచెల్లిస్తారు. ఈ విధానంలో మీదగ్గర భౌతికంగా బంగారం ఉంటుంది. రెండో పద్ధతిలో గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. అంటే ఎలక్ట్రానిక్ విధానంలో బంగారం కొనుగోలు చేయడం. డీమ్యాట్ ఖాతా ద్వారా యూనిట్ల రూపంలో బంగారం కొనవచ్చు. ఈ విధానంలో మీవద్ద భౌతికంగా బంగారం ఉండదు. మీరు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి కొనుగోలు, అమ్మకాలు చేయవచ్చు. ప్రస్తుతం వీటిలో పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. భౌతిక బంగారం, గోల్డ్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడుల మధ్య కొన్ని తేడాలు ఉంటాయి. భౌతికంగా మన చేతిలో బంగారం లేకపోవడం మినహా గోల్డ్ మజూరు చార్జీలు వసూలు చేస్తారు. బంగారం ధరకు ఇవి అదనంగా ఉంటాయి. గోల్డ్ ఇటిఎఫ్‌లలో మీరు పెట్టుబడికి సరిపడేబంగారంయూనిట్లు మీ ఖాతాలో జమ అవుతాయి. దుకాణాల్లో బంగారు వస్తువు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.20 వేలు కావాలి. అయితే గోల్డ్ ఇటిఎఫ్‌లలో రూ.75 నుంచి పెట్టుబడి

# ఈ యేడాది ఆర్‌బిఐ వడ్డీరేట్లను తగ్గిస్తుందా?

**ముంబై, ఏప్రిల్ 6:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల కారణంగా భారతదేశ ఆర్థిక వృద్ధి అవకాశాలు తగ్గవచ్చని సిటీ బ్యాంకు ఆర్థికవేత్తలు అంటున్నారు. దీనిని ఎదుర్కోవడానికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ సంవత్సరం వడ్డీ రేట్లను మూడుసార్లు తగ్గించడం ద్వారా 75 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చు. దీనితో పాటు, ఈ సంవత్సరానికి వడ్డీ రేట్లలో మొత్తం 100 బేసిస్ పాయింట్ల తగ్గింపును సిటీ అంచనా వేసింది. సిటీ ఈ అంచనా జేపీ మోర్గాన్, నోమురా అంచనాలకు అనుగుణంగా ఉంది. అమెరికా విధించిన 27శాతం సుంకం 2025-26లో భారతదేశ జిడిపి వృద్ధిని దాదాపు 40 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని సిటీకి చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ఒక నివేదికలో అంచనా వేశారు. దీనితో పాటు, ఈ సంవత్సరం ఆర్‌బిఐ వడ్డీరేట్లను మొత్తం 100 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని అంచనా వేశారు. ఫిబ్రవరిలో రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ విధంగా ఇప్పుడు 75 బేసిస్ పాయింట్ల కోత అంచనా. ఈ సుంకాల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళితే, అది భారతదేశ ఎగుమతులపై పెద్ద ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని చక్రవర్తి అంటున్నారు. దీనితో పాటు సుంకాల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తలెత్తే అనిశ్చితి ప్రైవేట్ పెట్టుబడుల ఉద్దేశాలను బలహీనపరుస్తోందని ఆయన అన్నారు. ఫిబ్రవరిలో విడుదలైన కేంద్ర బ్యాంకు అంచనా ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 6.7శాతం వృద్ధి చెందుతుందని అంచనా. ఈ సంవత్సరం ద్రవ్యోల్బణం సగటున 4.2శాతం ఉంటుందని అంచనా. దీని వలన ఆర్‌బిఐ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. ఆర్‌బిఐ రేటు నిర్ణయ కమిటీ వచ్చే వారం సమావేశమవుతుంది. నిర్ణయం ఏప్రిల్ 9న ప్రకటించనుంది. అదే సమయంలో రాయిటర్స్ ఆర్థికవేత్తలపై నిర్వహించిన సర్వేలో రిజర్వ్ బ్యాంక్ ఏప్రిల్ 9న జరిగే సమావేశంలో వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని వెల్లడించింది.




# అమ్మకాల్లో చేతక్ 'ఇవి' నయా రికార్డ్

**ముంబై, ఏప్రిల్ 6:** బజాజ్ ఆటో కంపెనీ సంబంధించిన చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ భారత దేశంలో అత్యధికంగా అమ్ముడైన ఇ-స్కూటర్‌గా నిలిచింది. మార్చి 2025లో అమ్మకాలు 34,863 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ విజయం స్థిరమైన మొబిలిటీ సొల్యూషన్స్ వైపు స్పష్టమైన విని యోగదారుల ధోరణిని తెలియజేస్తుందని నిపుణులు చెబు తున్నారు. భారతీయ ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్‌లో బజాజ్ ఆటో వ్యూహాత్మక విధానాన్ని అవలంభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో మార్చి 2025లో బజాజ్ ఆటో చేతక్‌కోసం ఇప్పటివరకు అత్యధిక నెలవారీ అమ్మకాలను నమోదు చేసింది. ఈ ఒక్క నెలలోనే 34,863 యూనిట్లను పంపిణీ చేసింది సగటున రోజుకు 1,124 బజాజ్ చేతక్ స్కూటర్లు దేశంలో అమ్ముడయ్యాయి. ఈ అత్యుత్తమ పనితీరు ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో వార్షిక అమ్మకాలకు దోహదపడింది. ఇప్పటిదాకా బజాజ్ చేతక్ ఈవీ మొత్తం అమ్మకాలు 230,761 యూనిట్లను అధిగమించాయి. ఇది గత సంవత్సరం 1,06,624 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే 116 శాతం గణనీయమైన వృద్ధిని సూచిస్తుంది. బజాజ్ ఆటో కంపెనీ 2025 ఆర్థిక సంవత్సరంలో 20శాతం మార్కెట్ వాటాను నివేదించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 11శాతం నుంచి దాదాపు రెట్టింపు అయ్యింది. ఈ పెరుగుదలకు ఈ సంవత్సరం తీసుకున్న అనేక చురుకైన చర్యలు కారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా డిసెంబర్ 2024లో కొత్త 35 సిరీస్‌ను ప్రవేశపెట్టడం వల్ల వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించింది. టీవీఎస్ రెండవ అతిపెద్ద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారుగా ఉంది. టీవీఎస్ ఐక్యూబ్ అమ్మకాలు 30,453 యూనిట్లకు చేరుకున్నాయి. అంటే దాదాపు 23 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. 2025 ఆర్థికసంవత్సరంలో టీవీఎస్ 2,37,551 యూనిట్లను విక్రయించింది.ఇది 2024 ఆర్థిక సంవత్సరంలో 1,83,189 యూనిట్లతో పోలిస్తే 30శాతం పెరిగి 21శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఓలా ఎలక్ట్రిక్ మూడు సంవత్సరాలుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో అగ్రగామిగా ఉంది. మార్చి 2025లో ఇది 23,430 యూనిట్లను విక్రయించింది. అంటే మార్కెట్‌లో 18శాతం వాటాను కైవసం చేసుకుంది. ఫిబ్రవరిలో నాలుగో స్థానానికి పడిపోయిన తర్వాత తిరిగి మూడో స్థానాన్ని పొందింది. మార్చి 2025లో ఏథర్ ఎనర్జీ 15,446 ఇ-స్కూటర్లను విక్రయించి 12 శాతం మార్కెట్ వాటాతో 4వ స్థానంలో నిలిచింది.



# లక్ష పెట్టుబడితో పిపిఎఫ్‌లో రాబడి..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పెట్టుబడి పథకా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ అధిక ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం పిపిఎఫ్ సంవత్సరానికి 7.1శాతం వడ్డీని అందిస్తోంది. పిపిఎఫ్ పథకంలో మీరు సంవత్సరానికి గరిష్టంగా రూ.1.50 లక్షలు డిపాజిట్ చేయవచ్చు. అలాగే ఈ పెట్టుబడిపై ఇన్‌కమ్ టాక్స్ ప్రయోజనాలు పొందవచ్చు. అలాగే ఈ ఖాతా 15 సంవత్సరాల్లో మెచ్యూర్ అవుతుంది. పిపిఎఫ్ పథకం మెచ్యూర్ అయ్యాక కూడా 5-5 సంవత్సరాల కింద పొడిగించవచ్చు. ప్రతి సంవత్సరం పిపిఎఫ్‌లో రూ.లక్ష జమ చేస్తే మెచ్యూరిటీ సమయంలో మీకు మొత్తం రూ.27,12,139 లభిస్తుంది. ప్రతి సంవత్సరం పిపిఎఫ్‌లో రూ.లక్ష జమ చేస్తే ఏకంగా వడ్డీనే రూ.12,12,139 వస్తుంది.




# టాటా కేపిటల్ రూ.15వేల కోట్ల ఐపిఒ!

**ముంబై, ఏప్రిల్ 6:** టాటా గ్రూపునకు చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ టాటా కేపిటల్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. రూ.15వేల కోట్లు సమీకరించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి కాన్ఫిడెన్షియల్ ప్రీ ఫైలింగ్ రూట్‌లో డిహెచ్‌ఆర్‌పి సమర్పించింది. కొత్త షేర్ల జారీ, ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో నిధుల సమీకరణ జరగనుంది. టాటా కేపిటల్‌కు అప్పర్ లేయర్‌గా ఎన్‌బిఎఫ్‌సిగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా గుర్తించింది. దీంతో ఈ సంస్థలు తప్పనిసరిగా 2025 సెప్టెంబరులోగా లిస్ట్ అవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే బోర్డు ఆమోదం పొందింది. 2.3 కోట్ల ఈక్విటీ షేర్లను ఫ్రెష్ ఇష్యూ ద్వారా, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను తగ్గించుకోనున్నారు. ప్రస్తుతం టాటా కేపిటల్‌లో టాటా సన్స్‌కు 93శాతం వాటా ఉంది. సెబి నుంచి ఆమోదం పొంది పబ్లిక్ ఇష్యూకు వస్తే, ఫైనాన్షియల్ సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒగా టాటా కేపిటల్ నిలవనుంది. టాటా గ్రూపు నుంచి ఇటీవల కాలంలో వస్తున్న రెండో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలవనుంది. అంతకుముందు టాటా టెక్నాలజీస్ 2023 నవంబరులో షేరు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు అయింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో టాటా కేపిటల్ రూ.18,178 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. రూ.3,150 కోట్ల లాభాన్ని ఆర్జించింది. లోన్ బుక్ రూ.లక్ష కోట్లు దాటింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.